సాహిత్యానువాదం : సమాలోచనం



ఆంధ్ర సారస్వత పరిషత్తు
హైదరాబాదు

BVR - 2068
8/5/18

39/69

సాహిత్యానువాదం: సమాలోచనం

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణరెడ్డి

అధ్యక్షులు, ఆంధ్రసారస్వత పరిషత్తు

సంపాదకులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రధానకార్యదర్శి, ఆంధ్రసారస్వత పరిషత్తు

సంకలనకర్త

ఆచార్య భార్గవి పి. రావు

ప్రచురణ:

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001

ఫోన్: 040-24753724

Saahityanuvaadam-Samaalochanam

ప్రథమ ముద్రణ : 2007

ప్రతులు : 1000

మూల్యం : రూ. 60/-

ప్రతులకు :
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్: +91-40-24753724

ముద్రణ :
విష్ణ కంప్యూటర్ సర్వీసెస్
(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
ఫోన్: +91-40-27654003, 27676910

విషయసూచిక

అవతారిక

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణరెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల సర్వతోముఖ వికసనం కోసం ఆరున్నర దశాబ్దాల క్రితం శ్రీయుతులు మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, లోనకంది శంకరనారాయణరావు వంటి సారస్వత మూర్తుల సముజ్జ్వల ప్రేరణతో ఆవిర్భవించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రేసర సాహిత్య సంస్థగా విశిష్ట స్థానం వహించింది. నిజాం ఏలుబడి క్రింద తెలుగు భాషాజ్యోతి కొడికట్టుతున్న దశలో దాని పునఃప్రకాశానికి పరిషత్తు ఉద్యమించి అకుంఠిత దీక్షతో జరిపిన కృషి అగణ్యం. మాన్యమిత్రులు, సాహితీమూర్తులు డా. దేవులపల్లి రామానుజరావుగారు జీవిత పర్యంతం పరిషత్తు వికాసాభ్యుదయాల కోసం సమంకిత భావంతో శ్రమించారు. తొలినాళ్లలో తెలంగాణ ప్రాంతానికి పరిమితమైన పరిషత్తు కార్యకలాపాలు కాలక్రమంలో కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఒరిస్సావంటి ఇతర రాష్ట్రాలకు, మారిషస్ వంటి విదేశాలకు విస్తరించాయి. ఉత్తమాదర్శాలతో, సమున్నతాశయాలతో పరిషత్తు వివిధ కార్యక్రమాలను చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అన్ని వర్గాల ప్రశంసలందుకుంటున్నది. వీటిలో భాషాబోధన, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, గ్రంథ ప్రచురణ ముఖ్య భూమిక వహిస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగులో ప్రాథమిక, ప్రవేశ, విశారద (పూర్వోత్తర భాగాలు) పరీక్షలు జరపడంతో పాటు, స్నాతకోత్తర స్థాయి ప్రాచ్య కళాశాలను, తెలుగు పండిత శిక్షణ కళాశాలను కూడా నిర్వహిస్తున్నది. పరిషత్తు రూపకల్పన చేసి, నిర్వహించే సాహిత్య సభలు, సమావేశాలు, సమ్మేళనాలు, సదస్సులు, చర్చాగోష్ఠులు, ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి ఎంతో విలక్షణతను సంతరించుకొన్నాయి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలు ప్రామాణికాలై పండితులకు, పరిశోధకులకు, విద్యార్థులకు, సాహిత్యాభిమానులైన

పాఠకులకు అత్యంతోపయోగకారులుగా వర్తిల్లుతున్నాయి. పరిషత్తు ఇప్పటి వరకు రెండు వందలకు పైగా గ్రంథాలు ప్రచురించింది. వీటిలో వివిధ సాహిత్య ప్రక్రియలకు చెందిన ప్రాచీన, ఆధునిక గ్రంథాలు చోటుచేసుకోవడం గమనార్హం.

పరిషత్తు నిర్వహించే సదస్సులకు విశేష స్పందన లభిస్తున్నది. ప్రత్యేకాంశాలపై జరిగే సదస్సుల్లో పండితులు, పరిశోధకులు, అనుభవజ్ఞులు పాల్గొంటున్నారు. వీరి ప్రసంగ పాఠాలను గ్రంథరూపంలో ప్రచురించడం పరిషత్తు ఒక సంప్రదాయంగా పాటిస్తున్నది. తెలుగు సాహిత్యంలో అనువాదానికున్న విశిష్టస్థానం దృష్ట్యా పరిషత్తు 'సాహిత్యానువాదం'పై 2006 జులై 10వ తేదీన ఒక సదస్సు నిర్వహించింది. వివిధ సాహితీ ప్రక్రియల్లో జరిగే అనువాదాలను గురించి లబ్ధప్రతిష్ఠులైన రచయితలు ప్రసంగించారు. ఈ ప్రసంగవ్యాసాలను 'సాహిత్యానువాదం-సమాలోచనం' అనే పేరుతో ప్రచురిస్తున్నాం. ఎప్పటిలాగే సాహితీలోకం ఈ ప్రచురణను ఆదరిస్తుందని విశ్వసిస్తున్నాం.

20.11.2007
హైదరాబాదు

ముందుమాట

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రధానకార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు అనేక వినూత్న విషయాలపై సదస్సులు నిర్వహిస్తున్నది. మా అధ్యక్షులు డా.సి. నారాయణరెడ్డిగారు ప్రత్యగ్ర దృష్టితో ఈ సదస్సులకు రూపకల్పన చేశారు. పరిషత్తు కార్యకలాపాలలో గ్రంథ ప్రచురణ కూడా ఒకటి. నిర్వహిస్తున్న సదస్సులలో వక్తలు సమర్పించిన ప్రసంగపత్రాలు వాయువిలీనం కాకుండా అక్షరరూపం తాల్చాలన్నది మా ఆశయం. దానికి అనుగుణంగానే ఇటీవల సదస్సుల పత్రాలను గ్రంథాలుగా ముద్రించాం. ఆ వరుసలోనిదే ఈ "సాహిత్యానువాదం: సమాలోచనం".

తెలుగులో ప్రథమంగా సాహిత్యానువాదం – అందులో కవిత్వానువాదం– నన్నయతో మొదలయింది. ఎన్నో వికాసదశలకు చేరింది. ఆధునికంగా ఎన్నో హంగులను సంతరించుకొన్నది. ఈ గ్రంథంలో ఉన్నవి సాహిత్యానువాదం స్వరూప స్వభావాలను మరొక మారు విశ్లేషణాత్మకంగా సమాలోచించిన ప్రసంగపత్రాలు. విశ్వసాహిత్యాన్ని తెలుగులోకి తెచ్చుకోవడం వల్ల తెలుగు మరిన్ని వెలుగులను సంతరించుకుంటుంది. మన సాహిత్యాన్ని అనువాదరూపేణా అన్యభాషీయులకు అందించటం వల్ల వారికి దాని ఔన్నత్యం అవగతమవుతుంది. అనువాద ప్రక్రియ– ముఖ్యంగా సాహిత్యానికి సంబంధించినది – మనో వికాసానికి, నవ్యభావవిలసనానికి దోహదం చేస్తుంది.

ఈ సదస్సులను నిర్వహించడంలో, గ్రంథప్రచురణలో సహకారహస్తం అందించారు. శ్రీ గోవిందరాజు రామకృష్ణారావుగారు, శ్రీ పాండురంగయ్యగారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

పరిషత్తు ప్రచురణలను ఇంతకుముందులాగే సాహిత్యరసికులు సమాదరిస్తారని మా విశ్వాసం.

పరిచయం

ఆచార్య భార్గవి పి. రావు

సంకలనకర్త

ఆంధ్రసారస్వత పరిషత్తు వారు సాహిత్యానువాదం అన్న విషయంపైన ఒక సదస్సు నిర్వహించారు. పరిషత్తు అధ్యక్షులు, ప్రఖ్యాత కవి – జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు డా. సి. నారాయణరెడ్డిగారు అధ్యక్షత వహించిన ఈ సదస్సును, విశ్వనాథ పీఠం అధ్యక్షులు డా. వెలిచాల కొండలరావు ప్రారంభించారు.

సభాధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డిగారు సాహిత్యానువాదం యొక్క విశేషతను విశ్లేషించి – ఈ ప్రక్రియలోని సమస్యలను కూలంకషంగా చర్చించి పరిష్కరించుకోవలసిన ఆవశ్యకతను వివరించారు. డా. వెలిచాల కొండలరావుగారు ప్రస్తుతం విస్తృతంగా వస్తున్న అనువాదాలకు ఆదరణ కొరవడిందనీ, సహేతుకమైన విమర్శలు రావటం లేదనీ ఉదాహరణలతో ఎత్తి చూపారు. ముఖ్యంగా తెలుగు నుండి హిందీ, ఆంగ్ల భాషలలోకి అనువదించబడిన సాహిత్యాన్ని జాగ్రత్తగా చర్చించి రూపొందించుకోవాలనీ – ఆ భాషలలో నుండి ఇతర భారతీయ భాషలలోకి వెళ్తున్నప్పుడు మన సాహిత్యం తెలుగుతనాన్ని కోల్పోకుండా చూసుకోవడం మన బాధ్యత అని చెప్పారు.

ఆచార్య ఎన్. భక్తవత్సలరెడ్డిగారు తమ ప్రసంగంలో భాషాశాస్త్రపరంగా పాశ్చాత్య భాషా శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన ముఖ్యమైన సిద్ధాంతాలు, మన సాహిత్యంపైన వాటి ప్రభావాలను కూలంకషంగా వివరించారు. Text (పాఠ్యం) సాహిత్య వ్యవస్థ వల్లే ఏర్పడినా దాని వెనుక ఉన్న సాహిత్యేతర వ్యవస్థల వల్ల ఏర్పడే ప్రభావం, పరస్పర పోషిత, ప్రేరణ స్వభావాల గురించి Poly Systems (బహుళ వ్యవస్థ సిద్ధాంతం) వివరించారు.

అనువాద రచనలలోని విమర్శన సూత్రాలను డా. హరిబండి లక్ష్మిగారు సోదాహరణంగా విశ్లేషించారు. ఏ అనువాదాన్నయినా విభిన్న కోణాల నుండి చూసే అవకాశం వుంది కనుక, ఆ విభిన్నతను ఎత్తి చూపే విమర్శనసూత్రాల ఆవశ్యకత వుందని అన్నారు. అనువాదం ఎవరు చేశారు, ఎందుకు చేశారు, ఎవరి కోసం చేశారు, ఎప్పుడు చేశారు - అనే ముఖ్యమైన ప్రశ్నలను విమర్శకులు దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

ఆ తర్వాత కవిత్వానువాదం ప్రత్యేకతను శ్రీమతి సుజాత పట్వారిగారు వివరించారు. సాహిత్య ప్రక్రియల్లో కవిత్వాన్ని అనువదించడం ఒక సవాల్ అని చెప్తూ కవిత్వాన్ని సృజనాత్మకంగా, కళాత్మకంగా ఎలా అనుసృజన చేయాలో వివరించారు.

కథానికలు, నవలలు అనువదించడంలోని సమస్యలను డా. కె.బి. లక్ష్మిగారు వివరిస్తూ కొన్ని మంచి పరిష్కారాలను సూచించారు. ముఖ్యంగా మాతృకలోనున్న మలుపుల్ని, వినూత్న పదప్రయోగాలను అనువదించడంలోని సాధకబాధకాల్ని ఎత్తి చూపారు. అనుసృజన, స్వేచ్ఛానువాదంలోని పరిమితులను ఎత్తిచూపారు.

నాటక ప్రక్రియను - అనువాదాన్ని పరిశీలనగా విశ్లేషించి ప్రసంగం చేసినవారు డా. వి. చంద్రశేఖర్‌గారు. నాటక రచనల చారిత్రక నేపథ్యాన్ని కూలంకషంగా విశ్లేషించి నాటకరచనకు, ప్రదర్శనకు మధ్య వున్న అంతరాన్ని అనువాదకులు పట్టుకోవాలన్నారు. జూలియస్ సీజర్ తెలుగు అనువాదాన్ని, కన్యాశుల్కం ఇంగ్లీష్ అనువాదాన్ని సోదాహరణంగా వివరించారు.

సాహిత్యానువాదంలో కృషి చేయాలనుకున్న విద్యార్థులకు, అనువాదాలు చేస్తున్నవారికి ఉపయోగకరంగా ఉండే కొన్ని వ్యాసాలను ఇందులో పొందుపరచడమైనది. గోవిందరాజు రామకృష్ణారావుగారి-సాహిత్యానువాదం, డా. భార్గవీరావు గారి - సాహిత్యానువాదంలో ఆధునికత (a moden approach), డా. డి. చంద్రశేఖర రెడ్డిగారి 'అనువాదకుడికి అభివాదం' ముఖ్యమైన విషయాల్ని, విలువైన సమాచారాన్నీ పొందుపరుచుకున్న వ్యాసాలు. పాఠకుల ఆదరణ, విమర్శకుల మన్ననలను అందుకుంటుందన్న ఆశతో ఈ రచనను మీ ముందు ఉంచుతున్నాం.

సాహిత్యానువాదం : సమస్యలు - పరిష్కారాలు

ఆచార్య యన్. భక్తవత్సలరెడ్డి

అనువాదం ఒక కళ. ఒక శాస్త్రం. అనువదించడం ఒక కళ అయితే దాన్ని అధ్యయనం చేయడం ఒక శాస్త్రం. ఈ ద్వైధీభావం ఉన్నందున అనువాదంలో అటు రమ్యతని, ఇటు దాని వెనుక ఉన్న నేపథ్యాన్ని, సంస్కృతి సంప్రదాయాల్ని కూడా అధ్యయనం చేయాల్సి ఉంది.

అనువాద అధ్యయన సిద్ధాంతాలలో కొన్ని రూపానికి, భాషా నిర్మాణ క్రమానికి పెద్ద పీట వేస్తే, మరికొన్ని వాటి వెనుక ఉన్న గుప్త నిర్మాణానికి ప్రాధాన్యత నిచ్చాయి. మరికొన్ని సిద్ధాంతాలు ఇంకొంచెం ముందుకు వెళ్లి పదం కన్నా ఆ పదం కల్గించే అర్థానికి లేదా భావానికి ప్రాముఖ్యమిచ్చాయి. దీని వెనుక ఉన్న నేపథ్యం, సంస్కృతి, సంప్రదాయాల్ని స్పృశించడం వాళ్లు మర్చిపోలేదు. సమాజం భిన్న వ్యవస్థలతో కూడుకున్నది. అందులో సాహిత్య వ్యవస్థ ఒకటి. Text సాహిత్య వ్యవస్థ వల్లే ఏర్పడినా దాని వెనుక సాహిత్యేతర వ్యవస్థల ప్రభావం, పరస్పర పోషిత, ప్రేరణ స్వభావం ఉంది అని చెప్పడం బహుళ వ్యవస్థ (Poly systems) సిద్ధాంతం. తర్కాన్ని జోడించి చదివే ప్రతి పాఠ్యం లేదా అనువాదం మూలభాషని తిరిగి రాయడమే అవుతుంది. అలా ప్రతిసారి మారే ఈ Text కు author కన్నా author - functions కి ప్రాధాన్యం ఇవ్వడం Deconstruction సిద్ధాంతకర్తల అభిమతం. మరికొంత మంది అనువాదంలో పోకడల్ని వర్గీకరించి విశ్లేషించినారు. వీటిని స్థాలీపులాకంగా పరామర్శించడం ఈ వ్యాసం ప్రథమాశయం. అలాగే అనువాదంలో ఉన్న కొన్ని విశేషాంశాల్ని వివరించడం మలి అశయం. అనువాద సిద్ధాంత కర్తలలో ప్రధానంగా రోమన్ యాకబ్సన్, ఎజ్రా పౌండు, రాబర్ట్ బ్లై, నోమ్ చోమ్స్కీ, యూజిన్ నీడ లాంటి పరిశోధకులు విశేషమైన కృషి చేసినారు. అలాగే Poly systems సిద్ధాంత కర్తలు ప్రతిపాదించే విషయాలు కూడా ఇక్కడ ప్రస్తావనార్హం.

రోమన్ యాకబ్‌సన్ (Roman Jacobson)

ఈయన మూడు రకాల అనువాదాల గురించి చెప్తాడు. ఒకటి ఒకే భాషలోని సంజ్ఞల్ని పదాల అమరికలో మార్పులు తెచ్చి మరొక సంజ్ఞలుగా మార్పు చేయడం - intralingual; రెండు ఒక భాషలోని సంజ్ఞల్ని ఇతర మాధ్యమాలలోకి (కళ, సంగీతంలాంటివి) మార్చడం - intersemiotic; మూడు ఒక భాషలోని సంజ్ఞల్ని వేరొక భాషలోని సంజ్ఞలుగా విశ్లేషించడం - interlingual. ఇందులో ఈ మూడో విధానాన్ని నిజమైన అనువాదంగా గుర్తించడం పరిపాటి అయింది.

ఎజ్రా పౌండ్ (Ezrapound) - The Energy of Language

ఎజ్రా పౌండ్ అనువాదంలో భాషలోని భావం కన్నా రూపానికి ప్రాముఖ్య మిచ్చినట్లు కనబడుతుంది. ఆయన భాషలో సంగీతాత్మక - Melopoeia, దృశ్యాత్మక - Phanopoeia, సందర్భసహిత - Logopoeia గుణాలుంటాయని అంటాడు. Logopoeia పండితుల భాషాజ్ఞానం ఆడించే పద విన్యాసం అది. అంటే కొన్ని పదాలు రూఢ్యర్థంతో పాటు సందర్భ నేపథ్యం వల్ల అర్థభేదాన్ని భావావేశాన్ని కల్గిస్తాయి. అందులో అందుబాటులో ఉన్న అర్థాలతో పాటు వ్యంజనార్థాలు, లక్షణార్థాలు ఉంటాయి. ఇవి భాషకు రమ్యతను జోడిస్తాయి.

ఎజ్రా పౌండ్ పదం కల్గించే అర్థవైవిధ్యానికన్నా ఆ పదం కల్గించే స్పందనకు ఎక్కువ ప్రాముఖ్యమిచ్చినట్టు అనువాద విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ స్పందన పదాల అమరికలో వచ్చే అర్థవిన్యాసాలవల్ల, సందర్భ నేపథ్యం కల్గించే అర్థ సమన్వయాల వల్ల వస్తుందన్నది ఆయన అభిప్రాయం.

భాషలోని సంగీతాత్మక - Melopoeia గుణాన్ని అనుభవించడం కష్టతరం. దృశ్యాత్మక Phanopoeia గుణాన్ని యథాతథంగా అనుసరించవచ్చు. సందర్భసహిత - Logopoeia గుణాన్ని అనువదించలేం. ఎందుకంటే అందులో ఉన్న మనో వ్యాపారాన్ని పట్టుకోవడం అంత సులభం కాదు కనుక. ఒకవేళ రచయిత మనోవ్యాపారాన్ని పట్టుకొన్నా దాన్ని వేరొక భాషలో తేవడానికి కావలసిన సమానాత్మక (equivalent) పదం దొరకడం కష్టం కనుక.

పదాల యొక్క అర్థం ఎప్పుడూ సందర్భం లేకుండా ఉండదు అన్నది ఆయన దృఢ అభిప్రాయం. పాఠ్యం (text) యొక్క దేశ, కాల పరిస్థితుల్ని, దాన్ని ప్రయోగించిన భావావేశ పరిధుల్ని (ideological restrictions) అనువాదకుడు అర్థం చేసుకోవాలి. కనుక అనువాదకుడు ఆ పదాలు వాడిన సందర్భాన్ని, ఆ సందర్భంలో

అది చూపిస్తున్న వివరణని, విశ్లేషణని కూడా అర్థం చేసుకోవాలి. ఎజ్రా పౌండ్ దృష్టిలో పదం యొక్క అర్థం అమూర్తం కాదు. అది ఆ పదం బట్వాడా చేసే సాంస్కృతిక నేపథ్యం యొక్క బాహిర రూపం. దాన్ని అర్థం చేసుకోవాలంటే ఆ పదం యొక్క చారిత్రక, సాంస్కృతిక, సామాజిక స్థితిగతులను, సమాజ విలువల్ని, లోకవీక్షణాన్ని (worldview) అర్థం చేసుకొని ఉండాలి. అప్పుడే అనువాదకుడు పదాలకు నేడు ఉన్న అర్థాన్ని గాకుండా అది వాడిన నాటి సందర్భాన్ని సాంస్కృతిక నేపథ్యాన్ని తేగలడు.

రాబర్ట్ బ్లై (Robert Bly)

అనువాదాన్ని ఒక సిద్ధాంతంగా కాకుండా, ఒక అభ్యాసంగా వివరించిన వాడు రాబర్ట్ బ్లై. అనువాదంలో రూపానువాదం లేదా పదానువాదానికి పెద్ద పీట వేసినా మూలాల్లో ఆ పదాల అర్థవైవిధ్యాన్ని, వస్తువైవిధ్యాన్ని అవి విశ్లేషించే మాతృ భాషీయుల నుంచి రాబట్టడం, అనువాదాన్ని వ్యావహారిక భాషలోకి మల్చడం, భాషలోని భాషాతీత గుణాల్ని గుర్తించడం, ఇతర అనువాదాలతో తారతమ్య పఠనం చేయడం లాంటి ఎనిమిది స్థానాలుంటాయని కూడా గుర్తించినారు.

రాబర్ట్ బ్లై అనువాద ప్రక్రియ ప్రధానంగా మూడు విషయాల్ని స్పష్టీకరిస్తుంది.

1. అర్థానికి, వస్తువుకి సంబంధించిన 'సమానాలు' (Equivalents)
2. సంగీతాత్మకతకి సంబంధించిన సమానాలు
3. అనువాద భాషలో ఆమోదయోగ్యత. ఎజ్రా పౌండ్ ప్రతిపాదించిన Logopoeiaని రాబర్ట్ బ్లై స్పృశించలేదు.

డబ్ల్యు.ఎస్. మెర్విన్ – W.S. Merwin చెప్పినట్లు –

ఒక భాషలోని పదానికి వేరొక భాషలో సమానపదం వెతకడం కష్టం. ఒకవేళ రూఢ్యర్థాన్ని చెప్పే పదం దొరికినా, మూలభాషలో ఆ పదం వ్యక్తం చేసే సందర్భోచిత అర్థవైవిధ్యాన్ని, ఇది వ్యక్తీకరించలేదు. పదాల అమరికలోని 'కొత్త'ని, పదాల వ్యుత్పత్తిలో దొర్లే ప్రతిధ్వనుల్ని, శబ్ద సుభగత్వాన్ని తీసుకురావడానికి కావలసిన సమాన పదం అనువాద భాషలో దొరకడం బహు దుర్లభం.

అనువాద భాషలోని భాషా నిర్మాణ వ్యవస్థకు లొంగి కొన్ని, లొంగకుండా కొన్ని కొత్త పదాలు, పదబంధాలు అనువాదం దిగుమతి చేసుకొంటుంది. ఆ పదాల అర్థాలతో దగ్గరి సంబంధం ఉన్న పదాలకు అర్థాన్ని జోడించి అనువదించడం వీలవుతుంది. దీనివల్ల ప్రపంచాన్ని వీక్షించే దృక్పథాలలో కొత్త పుంతలు తొక్కడానికి

అవకాశం కలుగుతుంది. దీనివల్ల పదాలకు సరికొత్త సంయోజనాలు, అర్థవైవిధ్యం వచ్చి పడుతుంది. ఈ పద్ధతిలో మూలభాషలోని శబ్ద సౌందర్యాన్ని, అర్థవైవిధ్యాన్ని, భావావేశాన్ని అనువాదంలో తీసుకురావడానికి వీలవుతుంది.

నోమ్ చోమ్స్కి - **Noam Chomsky**

అంతర్జాతీయ స్థాయిలో భాషా శాస్త్ర పరిశోధనని కొత్త పుంతలు తొక్కించిన భాషా శాస్త్రజ్ఞుడు, అంతర్జాతీయంగా రాజకీయ మేధావిగా ఎదిగినవాడు నోమ్ చోమ్స్కి. అతని దృష్టిలో పదం కన్నా వాక్యం అర్థవంతమైన minimal unit. పైకి కనబడే వాక్య నిర్మాణం - వ్యక్త నిర్మాణం - వెనుక ఒక గుప్త నిర్మాణం ఉంటుంది. ఆ గుప్త నిర్మాణం కొన్ని transformational rules ద్వారా వ్యక్త నిర్మాణం అవుతుంది. ఆ గుప్త నిర్మాణం, భాషకు స్వతస్సిద్ధమైన basic component – ప్రాథమిక పదజాలానికి కొన్ని phrase structural rules, lexical rules ఆపాదించడం వల్ల తయారవుతుంది అన్నది ఆయన అభిమతంగా తెలుస్తుంది.

కాబట్టి వాక్య నిర్మాణంలో కనబడే పదాలకి, పదజాలానికి, వాక్యానికి, వాక్య సందోహానికి సమానాత్మకాలని తీసుకురావాలంటే ముందు వాటి గుప్త నిర్మాణాన్ని ఆలోచించాల్సి ఉంటుంది.

యూజిన్ నీడ - **Eugine Nida**

భాషాశాస్త్రంలో, బైబిలు అనువాదంలో ప్రత్యేకమైన కృషి చేసిన వ్యక్తి.

బైబిలు అనువాదంలో కేవలం రూపానికి గాకుండా భావానికి ప్రాముఖ్య మిచ్చిన వ్యక్తి. వాక్యాత్మక, అర్థ వివరణాత్మక అంశాలతో పాటు pragmatics మరియు contextual అంశాలకు ప్రాధాన్యమిస్తారు. Pragmatics సంజ్ఞలకు (sign) ఆయా సమాజాలు స్పందిస్తున్న తీరు, అనుసరిస్తున్న విధానం తెలియజేస్తుంది. కనుక ఒక పదం యొక్క అర్థ వివరణ కోసం ఆ పదంతో సమాజానికి ఉన్న అనుబంధం, స్పందన అర్థం చేసుకోవాలి.

అంటే Nida దృష్టి ఒక సంజ్ఞ - sign యొక్క అర్థాన్ని కనుగొనడం కాదు, ఆ సంజ్ఞ ఆ సమూహంలో ఎలాంటి అంగీకారాన్ని, అనుబంధాన్ని, సంబంధాన్ని, స్పందనని కల్గి ఉంది అని చెప్పడం. దీన్ని 'functional definition of meaning' గా ఆయన గుర్తించినాడు. దీనివల్ల ఒక పదం యొక్క అర్థాన్ని తెల్సుకోవడమే కాదు, ఒక పదానికి అర్థం అనేది ఎలా వచ్చి చేరుతుందో కూడా తెలుస్తుంది అంటాడు. ఒక భాషలోని గుప్త నిర్మాణాన్ని - సందర్భ సమితమైన సంజ్ఞల కలయికని, భాషను

సంస్కృతిని అధ్యయనం చేయడం ద్వారా తెల్సుకోగలం – అలాగే ఆ సంజ్ఞలు దేశకాల పరిస్థితులననుసరించి ఎలాంటి మార్పులు, చేర్పులు పొందాయో కూడా తెల్సుకోవ డానికి అవకాశం ఉంటుంది.

అలా Eugine Nida ప్రతిపాదించింది కేవలం 'formal correspondence' కాదు functional equivalence ని. ఆయన దృష్టి అంతా కూడా జీసస్ మీద దృష్టి నిలపడానికి బైబిలు ఎంత వరకు దోహదపడుతుంది అన్నది చూడడమే. అందుకనే తొలుత బైబిలు సమాజంలో ఎలాంటి స్పందనని కల్గించిందో అలాంటి స్పందననే అనువాదం కల్గించాలన్నది ఆయన సిద్ధాంతం. అందుకని మూలభాషలోని పదజాలానికి సమాన పదజాలాన్ని వెతకడం కాకుండా ఆ పదజాలం వెనుక ఉన్న ప్రమేయాత్మక సమానత్వం – functional equivalence కావాలన్నాడు. మూలభాషలో వచ్చిన అంగీకారం, స్పందన అనువాదంలో కూడా వస్తే ఆ అనువాదం మూలానికి చాలా దగ్గరగా ఉన్నట్లు ఆయన అభిప్రాయపడుతాడు. అప్పుడు మూలభాషలోని పదాలు, భావాలు, అలంకారాలు లాంటివి మారినా ఫరవాలేదు కాని అంగీకారం స్పందన ఉంటే చాలన్నది ఆయన అభిప్రాయం. దీనివల్ల అనువాదకుడికి కేవలం రెండు భాషలు మాత్రమే తెలిస్తే చాలదు, అనువదించాలను కొన్న విషయంతో కూడా సమగ్ర అవగాహన చాల అవసరమన్నది ఆయన అభిప్రాయం. అందుకని రెండు భాషలలోనూ వాక్య నిర్మాణంలో తీసుకువచ్చిన సమానత్వం కన్నా మూల భాషలో చెప్పిన మీద ఆ సమాజం ఎలా స్పందించిందో, స్వీకరించిందో, అంగీకరించిందో అలాంటి స్పందన, స్వీకరణ లేదా అంగీకారం అనువాద భాషలో కూడా ఉంటే అదే మంచి అనువాదంగా ఆయన అభిప్రాయపడ్డారు.

James Holmes నాలుగు రకాల అనువాదాల్ని గురించి వివరిస్తారు.

1. మూలభాషలోని రూపాన్ని యథాతథంగా తీసుకురావడం మొదటిది. రూపాన్ని యథాతథంగా తీసుకురావడం జరిగే పని కాదు కాన దానితో సన్నిహిత సంబంధం ఉన్నవాటిని తేవచ్చు.

2. మూలభాషలోని పాఠ్యం (Text) యొక్క ప్రమేయాన్ని (function) దృష్టిలో పెట్టుకొని అదే ప్రమేయాన్ని అనువాద భాషలో తేవడానికి ప్రయత్నిస్తుంది.

3. మూలభాషలోని వస్తువు (content)ని తీసుకొని అనువాద భాషలో ఒక స్వతంత్ర కావ్యంగా మలచడం మూడోది.

4. అనువాదం అని చెప్పడానికి వీలు లేనంతగా చాలా తక్కువ పోలికలతో చేసే అనువాదం నాలుగోది (దీన్ని 'అనుసరణ' అనవచ్చా?) James Holmes ఈ

అనువాదాన్ని 'deviant forms' అంటాడు.

Andre' Lefevere – ఏడు రకాల అనువాదాల్ని ప్రతిపాదిస్తాడు.

1. Phonemic Translation – పదానువాదం

ఇందులో మూలభాషలోని పదాల వ్యుత్పత్తితో పోలికలున్న పదాల్ని గుర్తించి వాటిని అనువాదంలో తేవడం. ఇందువల్ల అర్థవైవిధ్యానికి పెద్ద ప్రాముఖ్యం ఉండదు.

2. Literal Translation – భావానువాదం

మూలభాషలోని పదాలు స్ఫురింపజేసే భావాన్ని (Sense) అనువదించడం. ఈ కోవలో వివరణ ఎక్కువగా ఉండి, మూలభాషలోని 'సాహిత్య విలువలు' కనబడకుండా పోతాయి.

3. Metrical Translation – ఛందోనువాదం

మూలభాషలోని ఛందస్సుని యథాతథంగా తీసుకువస్తుంది. అయితే భావాన్ని, వాక్యనిర్మాణాన్ని పక్కన పెడుతుంది.

4. Prose Version – వచనానువాదం

వచనానువాదంలో మూలభాషలోని 'భావం' వస్తుంది. కాని, అందులోని సాహిత్య విలువల్ని చెప్పే పాఠ్యం – Text కనబడదు లేదా దానికి తక్కువ ప్రాముఖ్యం ఉంటుంది.

5. Rhyming Translations – లయానువాదాలు

ఈ అనువాద ప్రక్రియలో 'లయ'కు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో పదాలు అర్థరహితమై, పాఠకునికి ఉత్సాహం కల్గించకపోవచ్చు.

6. Blank Verse – గేయఛందస్సు

ప్రాస, అనుప్రాసలతో కూడుకొన్న బ్లాంక్ వర్స్ అనువాదంలో చాలావరకు సఫలీకృతమైంది. అయితే ఛందో నియమం వల్ల మూలభాషలోని పాఠ్యం (Text) చాలా మార్పులు, చేర్పులు, కూర్పులతో పాటు విస్తరణకు కూడా గురవుతుంది.

7. Interpretation – విశ్లేషణాత్మకానువాదం

మూలభాషలోని ఇతివృత్తాన్ని విశ్లేషించి, ఆ పాఠ్యం (Text) అనువాద భాష పాఠకులు సులభంగా గ్రహించడానికి వీలుగా ఉంటుంది. అయితే ఇందువల్ల మూలభాష 'పాఠ్యం'లోని నిర్మాణం, అల్లిక (Structure and Texture) అనువాదంలో మృగ్యం అవుతుంది.

Andre Lefevere ఇందులో ఏదో విధానాన్ని అసలైన అనువాదంగా పేర్కొంటారు.

బహుళ వ్యవస్థ సిద్ధాంతం – Polysystems

Polysystems – బహుళ వ్యవస్థ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వాళ్లలో Tynjanov, Itama Even Zohar ల్ని ప్రత్యేకంగా పేర్కొనాలి. Tynjanov 'system' అన్న పదాన్ని సాంకేతికార్థంలో వాడితే, Even Zohar 'polysystems' పదాన్ని సృష్టించినాడు.

ఈ బహుళ వ్యవస్థ సిద్ధాంతం ప్రకారం 'పాఠ్యం' (Text) అనేది కొన్ని వ్యవస్థల (Systems) సముదాయం. అందులో సాహిత్యపరమైన, సాహిత్యేతరమైన 'వ్యవస్థలు' (Systems) ఉంటాయి. ఈ వ్యవస్థలు ఒక్కో నిర్దిష్ట ప్రమేయం (function) కల్గి ఉంటాయి. అలాగే ఇవి అన్నీ సమాజం యొక్క సంస్కృతికి లోబడే ఉంటాయి. అనువాదంలో ఇలాంటి వ్యవస్థల్ని తీసుకురావాలన్నది వారి అభిప్రాయం.

Tynjanov సాహిత్యాన్ని ఒక వ్యవస్థ (System)గా భావిస్తాడు. ఆ వ్యవస్థలలో –

1. Constructional function – నిర్మాణాత్మక ప్రమేయం సాహిత్య పాఠ్యం (Literary Text) లోని నిర్మాణ ఘటికల (Structural elements) మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని విశ్లేషించడం.

2. Literary function – సాహిత్యాత్మక ప్రమేయం

సాహిత్య పాఠ్యం (literary text) సాహిత్య నియమాలకు ఒదిగిన విధాన విశ్లేషణవల్ల సాహిత్యాత్మక ప్రమేయాన్ని గుర్తించవచ్చు.

3. Verbal function – క్రియాత్మక ప్రమేయం

సాహిత్య వ్యవస్థ, సామాజిక వ్యవస్థ మధ్య ఉన్న పరస్పర, అన్వయ, అన్యోన్య సంబంధ విశ్లేషణ.

Polysystem సిద్ధాంతం సాహిత్యాత్మక వ్యవస్థ (literary systems) లతో పాటు సాహిత్యేతర విషయాలైన పోషణ (patronage), సామాజిక వ్యవస్థ, ఆర్థిక స్థితిగతులు, సంస్థాగత వైవిధ్యాలు (Institutional manipulations) లాంటి వాటి నేపథ్యంలో సాహిత్య పాఠ్యం (Text) ఎలాంటి ప్రమేయాన్ని కల్గి ఉందో విశ్లేషించడం ఈ సిద్ధాంతంలో ప్రధానంగా కనబడే విషయం.

మిగతా సిద్ధాంతాలలో లాగా Even - Zohar ప్రతిపాదించిన System – వ్యవస్థ కేవలం పాఠ్యం - Text ని మాత్రమే ఉద్దేశించింది కాదు. కేవలం రమ్యత వల్లనో, అలంకారయుత సౌందర్యం వల్లనో ఒక పాఠ్యం Text సమాజంలో గౌరవం పొందదు. అయితే సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలలో అది ఇమిడే స్వభావాన్ని బట్టి దాని గొప్పతనం ఆధారపడి ఉంటుంది. Text సాహిత్యాత్మక వ్యవస్థ (literary system) వల్లనే వచ్చినా అది ఎప్పుడూ సర్వస్వతంత్రమైనది కాదు. అది సాహిత్యేతర వ్యవస్థలతో పరస్పర పోషిత, పరస్పర ప్రేరణ స్వభావం కల్గి సమాజం యొక్క వ్యవస్థకు లోబడి ఉంటుంది.

అనువాద సిద్ధాంతాలలో ప్రస్తుతం ముఖ్యమైనది ఈ బహుళ వ్యవస్థ - సిద్ధాంతం. ఇది అనువాదంలో 'సమానాత్మకత'ని గుర్తిస్తూనే, వాటిని సమాజ సంస్కృతి సంప్రదాయాలతో ముడిపెడుతుంది.

అనువాద అధ్యయనంలో వచ్చిన ఈ సిద్ధాంతాలలో కొన్ని సాహిత్య పాఠ్యం (Literary text) ని గురించి మాత్రమే వివరిస్తే మరికొన్ని ఆ సాహిత్య పాఠ్యం రావడానికి దాని వెనుక ఉన్న ప్రేరణలన్నింటిని కూడా తెల్సుకోవాలంటాయి. సాహిత్య పాఠ్యం విషయంలో అందులోని భాషా నిర్మాణ పద్ధతులకి, రూపానికి సంబంధించిన చర్చ ఒక పక్క అందులోని భావానికి సంబంధించి మరో పక్క చర్చలు జరిగినాయి.

కనుక అనువాద వ్యాపారం ఆషామాషీ వ్యవహారం కాదు. అనువాదం అందరికీ ఆమోదయోగ్యం కావాలంటే 'పటుత్వ దీక్ష' అవసరం. మూలభాషలో బాహిరంగా కనబడే పదజాలం, వాటి రూఢ్యర్థాలు, సందర్భోచితంగా అవి కల్గించే అర్థవైవిధ్యాలు, లక్షణ, వ్యంజనార్థాల సొబగులు, అవి విశ్లేషించే భావాలు, భావార్థాలు, నిగూఢార్థాలు, శబ్ద లయాన్విత సవ్వడులు, అక్షర రమ్యతలు, ప్రాసాది ఆవర్తన సోయగాలు, అర్థం చేసుకోవడం మొదటి పని.

దీనికి మూలభాషా నిర్మాణ వైవిధ్యంతో సంపూర్ణమైన అవగాహన అవసరం. లక్షణ, వ్యంజనార్థాల వెనుక దాగి ఉన్న సాంస్కృతిక విశేషాల్ని, గుప్త నిర్మాణం ప్రస్ఫుటించే వివిధ భావాల్ని అర్థం చేసుకోవాలి.

ఇక రెండు, ఆ సాహిత్య పాఠ్యం (Literary text) వెనుక ఉన్న ప్రేరణ, స్పందన, నేపథ్యాన్ని తెల్సుకోవాలి. దాని ప్రయోజనాన్ని, సమాజం దాన్ని అంగీకరించిన, స్వీకరించిన విధానాన్ని గుర్తించాలి.

మూడు, మూలభాషలోని ఈ సంక్లిష్ట స్వభావాన్ని అనువాద భాషలో

తెలియజేసే బాహ్య, అంతర నిర్మాణాల్ని సందర్భోచిత వైవిధ్యాల్ని చూపించగలిగే 'భాష'ని ఎన్నుకోవడం తప్పనిసరి.

నాలుగు, ఈ అనువాదాన్ని రచయిత ఎందుకు చేస్తున్నాడు? అతని లక్ష్యం ఏమిటి? ఈ అనువాదకునికి పాఠకులు ఎవరు? వారికి ఇది ఎంతవరకు ఆమోద యోగ్యం కాగలదు అన్న విషయాల మీద రచయిత ఒక నిర్దిష్ట అభిప్రాయాన్ని కల్గి ఉండాలి.

అప్పుడు అనువాదం కేవలం అక్షరాలతో కూడిన పదజాలం, పదజాలంలో ఉన్న ఏదో ఒక అర్థం, పదబంధాలు కల్గించే ఏదో ఒక భావం కాకుండా మూలభాష సాహిత్య పాఠ్యం యొక్క 'లో ఎదల్ని' చిత్రీకరించడానికి దోహదపడుతుంది. ఈ 'లో ఎదల' ఆవిష్కరణే మంచి అనువాదానికి గీటురాయి అన్న విషయం నిర్వివాదం.

మూలభాషలోని అలాంటి ఒక సాహిత్య పాఠ్యం – literary text ని అనువదించడానికి కేవలం రెండు భాషలు మాత్రమే తెలిస్తే చాలదు. మూలభాషలోని ఆ textకి సంబంధించిన సాహిత్యాత్మక వ్యవస్థలతో పాటు సాహిత్యేతర వ్యవస్థల్ని కూడా తెల్సుకొని ఉండాలి. అలాగే రచయిత ఆశయం, నిర్దిష్ట పాఠకుని ఎన్నిక అనువాదంలో మలుపులు రావడానికి దోహదపడతాయి.

రచయిత ఆశయం

సంస్కృత మహాభారతాన్ని ఎందరో కవులు తమ భాషలలో అనువదించారు. మూలం ఒక్కటే అయినా అనువాదాలు అన్నీ ఒకే కోవలో లేవు అన్న విషయం వాటిని తారతమ్య పఠనం చేసినప్పుడు తెలుస్తుంది.

మహాభారత కథని అనువదించడంలో తెలుగు, మలయాళ కవుల దృక్పథం భిన్నమైంది. తిక్కన 'అనన్య సామాన్యకరణంబగు పరమధర్మం' బోధించడం కోసం మహాభారతాన్ని ఆంధ్రీకరిస్తే, సమాజాన్ని భగవంతుని వైపు తిప్పడానికి, భక్తిని ప్రతిపాదించడానికి తుంజత్తు ఎళుత్తచ్చన్ మలయాళంలోకి మహాభారతాన్ని అనువదిస్తాడు.

సంస్కృత భారత గ్రంథారంభంలో వ్యాసముని ఇలా అంటాడు:

యుధిష్ఠిరో ధర్మమయో మహాద్రుమః
స్కంధోఽర్జునో భీమసేనోస్య శాఖాః
మాద్రీ సుతౌ పుష్పఫలే సమృద్ధే
మూలం కృష్ణో బ్రహ్మచ బ్రాహ్మణాశ్చ

ధర్మవృక్షాన్ని పాండవులతో పోల్చాడు. మరో శ్లోకంలో అధర్మ వృక్షాన్ని కౌరవులతో పోల్చుతాడు. ఈ రెండు శ్లోకాల్ని చూస్తే మహాభారతంలోని అంతరార్థం అవగతమవుతుంది. పాండవులు కౌరవులు ధర్మాధర్మాలకి ప్రతీకలు. ఇక కథ అంతా ఈ అంశం మీదే ఆధారపడి ఉంటుంది. ఈ సిద్ధాంతం మీద ఆధారపడే తిక్కన 'మహా కవిత్వ దీక్షావిధి'ని పొందుతానంటాడు. ఇక మలయాళ కవి ఎళుత్తచ్చన్ తన మహాభారతం కిళిప్పాట్టు గ్రంథారంభంలో:

"శ్రీమయమాయ రూపం తేడుం పైంగిలి పెణ్ణే
సీమ ఇల్లాద సుఖం నల్కణం ఎనిక్కు నీ
శ్యామల కోమళ నాయిాడున్న నారాయణన్
తామరస సాక్షన్ కథ కేళ్ప్పాన్ ఆ గ్రహిచ్చుఞాన్
....
.... పరయేణం
కైతవమూర్తి కృష్ణన్ తన్నుడె కథామృతం"

సురుచిర లావణ్య సోయగాల చిలకమ్మా
సీమలు లేని ఆనందం ప్రసాదించవమ్మా
శ్యామల కోమల నారాయణుడు
ఆ తామరస నేత్రుడి కథ విననిష్టమమ్మా
....
.... వర్ణించవమ్మా
కైతవమూర్తి కృష్ణ కథామృతం.

ఇది ఎళుత్తచ్చన్ భారతంలోని ఆరంభ పాదాలు. కవికి కావల్సింది ధర్మం ప్రతిపాదించేందుకు వ్యాసముని తీసుకొన్న కౌరవపాండవుల కథ కాదు; నిమిత్త మాత్రుడైన కృష్ణుని కథామృతం. దీనివల్ల ఎళుత్తచ్చన్ భారతంలో కౌరవపాండవుల కథ కన్నా శ్రీకృష్ణుని లీలలకు ప్రాముఖ్యం ఇస్తాడన్న విషయం అర్థమవుతుంది.

"నిరన్న పీలికళ్ నిరక్కవే కుత్తి
నెరుకయిల్ కూట్టిత్తిరమొడు కెట్టి
....
...."

దీని తెలుగు అనువాదం :

ఈకలు చక్కతీర్చి నెత్తి మీద
మనోహరంగా కట్టిన నెమలి పింఛం
నీలశకలోపమ కైశిక భారం
ధగద్ధగిత మణికిరీటం
ముంగురులు దోగాడే ఫాలభాగం
తీర్చిదిద్దిన తడి తిలకం
చెమటలో ముద్దయిన రూపం
లోకాన్ని సృష్టించి రక్షించి హరించి
కదలాడే కనుబొమ్మల మనోహరత్వం
భృత్యులపై కుమ్మరిస్తున్న కరుణ
కఠినాత్ములపై పొంగిపొరలే కోపం
మధురవాణుల తోడి అనురాగం
పోరున అద్భుతరసం
విరోధుల తోడి భయంకరత్వం
నవ నవ రసాల పొంగిపొరలే కన్నులు
మకర కుండలం ప్రతిబింబిస్తున్న నును చెక్కిలి
సరోజ వదనం
స్వేదార్ద్ర నాసిక
మందస్మిత రుచిరారవిందం
అధర శోభ
తులసి సరోజ కిసలయ మాలలు
మనోహరంగా – ఊగుతూ,
ముత్యపు మాలలూ, కౌస్తుభమణి
ముద్దిడుతున్న కంఠం
చెర్నాకోల పట్టిన హస్తం
హరిచందనం అద్దిన వక్షస్థలం
నలగని పట్టు పీతాంబరం
పగ్గాల్ని పట్టుకొన్న కరతలం
నొగలపై మోపిన పదసరోరుహయుగం

మూర్తీభవించిన ఆ రూపం
నా ఎదలో నిలిచిన ఆ రూపంలాగానే
మణిరథం మీద మణివర్ణుడు -
స్పష్టంగా చూస్తున్నాను నేను

ఈ ఉదాహృత భాగం మలయాళ సాహిత్యంలో మణిదీపం. కేరళీయుల నాలుకలపై నిత్యం లాస్యమాడే గేయం.

శల్యుడు సారథియై - శల్యసారథ్యాన్ని చేస్తున్నాడు. అర్జునుడు ధర్మరాజుపై కోపించి, కర్ణుని సంహరిస్తానని ప్రతిన చేసి పోరుకి, పార్థసారథితో వస్తున్నాడు. ఆ ఘట్టంలో పార్థసారథిని చూసిన శల్యుడు కర్ణునితో అలా వర్ణిస్తాడు.

ఇక్కడ కవి కృష్ణుని ఒక రథికునిగా గాక సర్వేశ్వరునిగా చిత్రీకరిస్తాడు. అతని రూపాది విశేషాల్ని కీర్తించడంలో అతని హావభావ విన్యాసాల్ని తిలకించడంలో మునిగిపోతాడు. అది సంగ్రామ రంగమని మర్చిపోతాడు. ఆ పరంధాముని, గోపాలకృష్ణుని, నెమలి పింఛంవాడిని, కరుణాత్ముని, భీకరనయనుని - ఇలా నవరసాల్ని అధిగమించిన ఆ పార్థసారథిని చూస్తూ కన్నులకు అద్దుకొంటాడు.

అలాగే సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో వచ్చిన పురాణ, కావ్య, నాటకాలలో రచయితల అభిప్రాయాలు స్పష్టంగా కనబడతాయి. మూలాన్ని యథాతథంగా అనువదించడం కాదు వారు చేసింది. అనువాదం నెపంతో ఒక పక్క సమాజంలోని ఉచ్చనీచ భేదాల మీద, శాస్త్రసమ్మతం కాని ఆచారక్రమాల మీద ధ్వజం ఎత్తడానికే ఆయా రచయితలు పూనుకొన్నారన్నది స్పష్టం.

అనువాద రచనలు - విమర్శనసూత్రాలు

డా. లక్ష్మిహరిబండి

సాహిత్యానికి ఎంత వయస్సు ఉందో అనువాద సాహిత్యానికీ దాదాపుగా అంత వయస్సు ఉన్నా సాహిత్య విమర్శ అభివృద్ధి చెందినంతగా అనువాద సాహిత్య విమర్శ అభివృద్ధి చెందలేదు. అనువాద సాహిత్యం/ అనువాద రచనలు ఎలా ఉండాలి అనే విషయం పట్ల ఒక్కొక్కరు ఒక్కో రకంగా స్పందించటం వలన పలు రకాల విభిన్న అభిప్రాయాలు వెలుగులోకి వచ్చాయి. ఏ అనువాదాన్నైనా విభిన్న కోణాలలో చూడటానికి అవకాశం ఉంది కనుక దాని విమర్శలో కూడా ఆ విభిన్నత కనిపిస్తుంది. ఏ అనువాదకుడైనా ఒక అనువాదాన్ని చేపట్టటానికి అనేక కారణాలు ఉంటాయి కనుక దాని విమర్శ కూడా తదనుగుణంగా ఉంటుంది. ఒక అనువాద రచనను విమర్శించేందుకు ఏ కొలమానాలను వాడాలి అనే విషయం నిర్ణయించుకునే ముందు విమర్శకుడు ముందుగా అనువాదానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానాలను తెలుసుకోవాలి. అనువాదం ఎవరు చేశారు, ఎందుకు చేశారు, ఎవరి కోసం చేశారు, ఎప్పుడు చేశారు, ప్రత్యేకించి ఆ రచయితను, ఆ మూల రచనను ఎంచుకోవటానికి గల ప్రత్యేక కారణాలు ఏవి అనే విషయాల పట్ల విమర్శకునికి స్పష్టమైన అవగాహన ఉండాలి. అప్పుడే ఆ విషయాలను దృష్టిలో పెట్టుకొని తదనుగుణంగా ఆ అనువాదాన్ని అంచనా వేయటానికీ, విశ్లేషించటానికీ కావలసిన విమర్శనా సూత్రాలను ఎంచుకోవటానికీ వీలవుతుంది. మూలగ్రంథానికి ఒక context ఉన్నట్లే, అనువాద గ్రంథానికి కూడా ఒక context అంటూ ఉంటుంది. కాబట్టి దాన్ని base చేసుకొని target ను బేరీజు వేయాల్సి ఉంటుంది. ఇటువంటి విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం అనువాదరచనను మాత్రమే తీసుకొని, అనువాదం ఎలాఉండాలి అనే విషయంపట్ల తనకున్న స్వంత అభిప్రాయాల కనుగుణంగా విమర్శన సూత్రాలను రూపొందించుకోవటం సమంజసం కాదు.

అనువాద రచనల విమర్శకు సంబంధించి మరో ముఖ్య విషయాన్ని మనం గమనించాల్సి ఉంటుంది. ఏ అనువాదాన్నైనా ఒక అనువాదకుడు ఎవరి కోసం చేస్తాడు? మూలభాష తెలియని లక్ష్యభాషా పాఠకులకు మూలభాషలోని ఒక రచనను అందించడమే అనువాదకుని లక్ష్యం. ఏ అనువాదమైనా mono lingual target readers కు ఉద్దేశించబడింది. మరి అటువంటప్పుడు అనువాదం బాగుందీ, బాగాలేదని ఆ భాష పాఠకులు చెప్పాలి. బాగుంటే ఎందుకు బాగుంది, బాగా లేకపోతే ఎందుకు బాగలేదు అని వారు చెప్పాలి. అయితే వీరికి మూలం గురించి తెలియదు కాబట్టి మూలంతో సంబంధం లేకుండా అనువాదాన్ని అంచనా వేస్తారు. సాధారణంగా ఇటువంటి పాఠకులు అనువాదంలో చూసేది readability. అనువాదం చక్కగా, సాఫీగా, స్వతంత్ర రచనను తలపించేలా సృజనాత్మకంగానూ, ఆసక్తిదాయకంగానూ ఉండాలనుకుంటారు వీరు. అన్నిటికి మించి ఇటువంటి పాఠకులు సాధారణంగా అనువాద రచనను చదివేటప్పుడు దానికి మూలం మరో భాష అని, అది కేవలం అనువాదమేనని తెలిసినా అది అడుగడుగునా అనువాదం అనిపించేలా ఉంటే ఇష్టపడరు. అది అనువాదం అనే విషయాన్ని మరిపించేలా ఉండాలని కోరుకుంటారు. వీరికి మూలం తెలియదు. మూలరచన విశిష్టతలు, మూలరచయిత శైలీ, ప్రత్యేకతలు, మూలభాష సంస్కృతీసంప్రదాయాలు, మూలభాషా సాహిత్యపు ప్రత్యేకతలు మొదలైన విషయాల పట్ల వీరికి ఎటువంటి ఆసక్తి ఉండదు. మనందరికీ తెలుసు కొన్ని అనువాదాలు చాలా ఆదరణ పొందుతాయి. కాని వాటిని మూలంతో పోల్చి చూసినప్పుడు తెలుస్తుంది అనువాదం అంత సంతృప్తికరంగా లేదనీ, అనేక చోట్ల అనువాదంలో మార్పులు, చేర్పులు, కుదింపులు వంటివే కాకుండా mistranslations కూడా ఉన్నాయని తెలుస్తుంది. బూదరాజు రాధాకృష్ణ గారు (2003) అనువాద పాఠాలులో ఉమర్ ఖయ్యాం రాసిన 'రుబాయీ'ల అనువాదం గురించి ప్రస్తావించారు. ఎడ్వర్డ్ ఫిట్జ్‌రాల్డ్ వీటిని 'Rubayats of Omar Khayyam' అని ఇంగ్లీషులోకి అనువాదం చేశాడు. ఈ అనువాదం చాలా ప్రసిద్ధికెక్కింది. కొందరు తెలుగుకవులు కూడా ఫిట్జ్‌రాల్డ్ ఆధారంగా ఉమర్ ఖయ్యాం కవితలను తెలుగులోకి అనువదించారు. అయితే దువ్వూరి రామిరెడ్డి గారు మాత్రం ఆరేళ్లు కష్టపడి పర్షియన్ భాషనూ, సంస్కృతినీ నేర్చుకొని, తెలుసుకొని ఈ రుబాయీలను మూలం నుండి 'పానశాల' అనే పేరుతో అనువాదం చేశారు. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ అనువాదానికీ ఫిట్జ్‌రాల్డ్ అనువాదానికీ పోలికే లేదు. ఏ అనువాదకుడైనా bilingual, bi-cultural అయి ఉండాలి. అతనికి/ ఆమెకు మూలభాషతో పాటు ఆ భాషా

సంస్కృతితో కూడా మంచి పరిచయం ఉండాలి. ఫిట్జ్‌రాల్డ్‌కు మూల సంస్కృతి తెలియదట. 'సాఖీ' అనే పదాన్ని మూలంలో 'మిత్రుడనే' అర్థంలో ఖయ్యాం వాడితే ఫిట్జ్‌రాల్డ్ దాన్ని 'ప్రియురాలు'గా అనువదించాడు. అలాగే మూలంలో ఖయ్యాం కోడికాలును ప్రస్తావిస్తే ఫిట్జ్‌రాల్డ్ దాన్ని స్త్రీ తొడగా అనువదించాడు. మూలంలోని తత్వం అనువాదంలో శృంగారంగా మారిపోయిందట. మొత్తం మీద విక్టోరియన్ యుగంలోని ఇంగ్లీషు సంస్కృతినీ, భావుకతనూ ఫిట్జ్‌రాల్డ్ 12వ శతాబ్దపు ముస్లిం వాతావరణానికి ముడిపెట్టాడు. ఇది అనువాదం కాదు, పునఃసృష్టి (transcreation). మన భారతం, భాగవతం, రామాయణం మొదలైన కావ్యాలు కూడా అనువాదాలు కావు, స్వతంత్రానుకరణలు, పునఃసృష్టులు. ఇవి సౌందర్య దృష్టి (aesthetic aspect) తో చేసిన గొప్ప పునఃసృష్టులు. మరొక చిన్న ఉదాహరణ టాల్‌స్టాయ్ War and Peace. నిజానికి టాల్‌స్టాయ్ రాసిన Vaina i miir కు సరైన అనువాదం War and World కానీ War and Peace కాదు. ఇక్కడ సమస్య ఎక్కడొచ్చిందంటే miir అనే రష్యన్ పదానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి ప్రపంచం/ లోకం; రెండవది శాంతి (peace). ఈ ఇంగ్లీషు అనువాదం చేసిందెవరో తెలియదు కాని ఇక్కడ పొరపాటు పడ్డారు. కానీ జరిగిందేమిటో మనందరికీ తెలుసు. అది War and Peace గానే ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధినొందింది. ఇప్పుడు మరెవరో వచ్చి అది War and Peace కాదు, War and World అంటే ఎవరూ నమ్మరు. ఇలా మూలం తెలియకుండా, మూలంతో సంబంధం లేకుండా అనువాదాన్ని అంచనా వేయటంలో నమ్మకం అనేదే కీలకాంశం అవుతుంది. పాఠకులకు అనువాదకుని మీద నమ్మకం ఉంటుంది. అనువాదకుడు మూలాన్ని సరిగ్గా అనువదించి ఉంటాడనే నమ్మకంతో అనువాదాన్ని చదువుతారు. ఈ trust అనేది misplace అవ్వకుండా ఉన్నంత వరకూ ఈ విధంగా అనువాదాలను అంచనా వేయటంలో ఎటువంటి ప్రమాదం లేదు.

ఇదే కోణంలో అనువాద రచనలను బేరీజు వేసే వారు మరొకరున్నారు. వారు ప్రచురణకర్తలు. ముఖ్యంగా పబ్లిషర్స్ చూసేది పుస్తకం అమ్మకాలు. ఈ అనువాదం పాఠకులను ఆకట్టుకునేలా ఉందా, పుస్తకం బాగా అమ్ముడు పోతుందా, తమకు పేరునూ లాభాలనూ తెచ్చి పెడుతుందా అనే విషయాలపైనే వారి దృష్టంతా ఉంటుంది. అనువాద ప్రక్రియ (the process of translation) ఎలా ఉందనేది వారు పట్టించుకోరు. పబ్లిషర్స్ ముందుగా మూల రచయిత మంచి పేరున్నవాడేనా, మూలరచన మంచి గుర్తింపు ఉన్నదేనా అనే విషయాలను చూస్తారు. అలాగే

అనువాదకుడు మంచి పేరు, హోదా, గుర్తింపు ఉన్న వ్యక్తా, కాదా అనేది కూడా చూస్తారు. ఉదాహరణకు అనువాదకుడు ఎ.కె. రామానుజన్ వంటివాడో, గిరిష్ కర్నాడ్ వంటివాడో, శ్రీశ్రీవంటివాడో అయితే అనువాదం అమ్మకాల గురించి ఆలోచించాల్సిన పనిలేదు. ఏ అనువాదంలోనైనా పరిగణించాల్సిన ముఖ్యమైన అంశాలలో రెండు trust, expertise – ఇవి రెండూ ఉండాలి. అలాగే మూలరచన మంచి పేరున్నది God of small things, Harry Potter series, Da Vinci Code అయితే వారికి ఇబ్బంది ఉండదు.

వీరు అనువాదం సృజనాత్మకంగా, స్వతంత్ర రచన అనిపించేలా ఉందా, లేదా అని చూస్తారు కానీ సాధారణంగా దాన్ని మూలంతో పోల్చి చూసి, విశ్లేషించి అంచనా వేయరు.

ఈ రెండు రకాల అనువాద రచనల విమర్శలో అనువాద రచనలను అనువాద రచనలుగా కాక, లక్ష్యభాషలో రచించబడిన స్వతంత్ర రచనలుగా పరిగణిస్తారు. దీన్ని లక్ష్యభాషలో గల ఇతర రచనలతో పోల్చి చూస్తారు. అది లక్ష్యభాష సాహిత్య రంగంలో ఎటువంటి స్థానాన్ని ఆక్రమిస్తుంది, పాఠకులు ఎలా అందుకుంటారు అన్న విషయాలు ఇక్కడ ముఖ్యం.

ఇకపోతే అనువాద రచనల విమర్శలో ప్రముఖులు మూలభాష, లక్ష్యభాష రెండూ క్షుణ్ణంగా తెలిసినవారు, రెండు భాషా సాహిత్యాలతో కూడా బాగా పరిచయం ఉన్నవారు అయివుండాలి. వీరు రచయితలు, జర్నలిస్టులు మొదలైనవారు. అనువాదం మూలగ్రంథాన్ని మూల భాషలోనే చదవగలిగే వీరి కోసం ఉద్దేశింపబడినది కాకపోయినా సరే దాన్ని సరైన రీతిలో సహేతుకంగా మూలంతో సరితూచి, విశ్లేషించి అంచనా వేయగలరు. అయితే ఒకటి – మూలం తెలిసినవారిని అనువాదం ఎంత గొప్పగా చేసినదైనా సంతృప్తి పరచలేదు. మూలానికీ అనువాదానికీ ఉండే తేడా గురించి మనకు తెలిసిందే. అయితే వీరు subjective గా, intuitive గా కాకుండా మూలాన్ని తర్వాత అనువాదాన్ని కొన్ని కోణాల ప్రకారం విశ్లేషించి, ఆయా కోణాల్లో మూలానికీ, అనువాదానికీ ఎక్కడెక్కడ సరిపోలేదూ, ఎక్కడెక్కడ తప్పులు ఉన్నాయో శాస్త్రీయంగా అధ్యయనం చేస్తారు. దీని గురించి మనం వివరంగా తర్వాత తెలుసుకోబోతున్నాం.

అనువాద రచనల విమర్శలో మనకు కనిపించే సాధారణ విధానాలు ఇవి రెండు – మొదటిది: అనువాదాన్ని అనువాదంగా పరిగణించి దాన్ని మూలంతో పోల్చి చూసి గుణదోషాలను బేరీజు వేయటం, రెండవది: అనువాదాన్ని అనువాదంగా

కాక లక్ష్యభాషలో వెలువడిన స్వతంత్ర రచనగా పరిగణించి, మూలంతో సంబంధం లేకుండా దాని ప్రమాణాలను అంచనా వేయటం. వీటిలో మొదటిది అనువాద విమర్శ కాగా, రెండవది సాహితీ విమర్శ అవుతుంది.

Translation quality assessment కు సంబంధించి జరిగిన కొన్ని అధ్యయనాలను ఇప్పుడు చూద్దాం. భాషా శాస్త్రం రంగప్రవేశం చేయకముందు, అంటే అంతకు ముందు జరిగిన కాలంలో జరిగిన అధ్యయనాలన్నిటిలో అనువాదాల విమర్శకు పూనుకున్నవారందరూ (వీరు ముఖ్యంగా అనువాదకులు, భాషాశాస్త్రవేత్తలు, రచయితలు) అనువాదాలను subjective గా, intuitiveగా అంచనా వేసేవారు. ఇందుకుగాను వీరు ఉపయోగించిన పద్ధతులు ఈ కింది విధంగా ఉన్నాయి.

1. వారు వాడిన ముఖ్యమైన కొలమానం అనువాదం మూలానికి ఎంత వరకు విధేయంగా ఉంది అనేది.

2. మూలరచనకు చెందిన విశిష్ట flavour, దాని spirit అనువాదంలో intact గా ఉన్నాయా, లేదా అనే విషయం.

3. అనువాదం సాఫీగా సాగుతుందా, లేదా అనే విషయం (its natural flow, readability).

4. అనువాదం పాఠకునికి ఎటువంటి ఆనందాన్నీ, సంతృప్తినీ ఇస్తుంది అనే విషయం.

అనువాదం మూలానికి విధేయంగా ఉండటం అంటే ఏమిటి? మూలరచన భావానికా? లేక form, style వంటి వాటికా? లేదా మూలరచనకు సంబంధించిన అన్ని అంశాలలోనా? ఈ చివరిది దాదాపు అసాధ్యం అని మనందరికీ తెలుసు. అలాగే రెండవ అంశం తీసుకుంటే 'spirit' అంటే అసలు ఏమిటి? మనం తరచూ చదువుతూ ఉంటాం, వింటూ ఉంటాం - అనువాదం మూలరచన spirit ను అందించాలని. అయితే ఈ spirit అనేదాన్ని subjectiveగా కాకుండా objective గా నిర్వచించుకోగలమా? Spirit అంటే ఇదీ అని concrete terms లో స్పష్టం చేయగలమా? అలా చేయటం సాధ్యం కానప్పుడు దీన్ని ఒక కొలమానంగా పెట్టుకోవటంలో ప్రయోజనం ఎంతవరకు ఉంటుందో మనం ఆలోచించాల్సి ఉంటుంది.

అనువాదం ఎలా ఉండాలి అనే విషయం పట్ల ఏకాభిప్రాయం లేదు. పలువురు పలు రకాల అభిప్రాయాలను వెలిబుచ్చేవారు, ఇప్పటికీ వెలిబుచ్చుతూనే ఉన్నారు. 1968లో Savory తన పుస్తకం The Art of Translation లో

అప్పుడు చర్చనీయాంశాలుగా ఉన్న పరస్పర విరుద్ధ సూత్రాలనన్నింటినీ ఒక చోట చేర్చి ఆరు జంటలుగా పేర్కొన్నారు. ఇవి.

1. ఎ. అనువాదం మూలంలోని పదాలను తెలియజేయాలి.
   బి. అనువాదం మూలంలోని ideasను తెలియజేయాలి.

2. ఎ. అనువాదం స్వతంత్రరచన అనిపించేలా ఉండాలి.
   బి. అనువాదం అనువాదం లాగే ఉండాలి.

3. ఎ. అనువాదం మూలరచయిత శైలిని కనబరచాలి.
   బి. అనువాదం అనువాదకుని శైలిని కనబరచాలి.

4. ఎ. అనువాదం మూలరచనకు సమకాలీన రచనలాగా ఉండాలి.
   బి. అనువాదం అనువాదకుని సమకాలీనంగా ఉండాలి.

5. ఎ. అనువాదం మూలానికి ఏమైనా చేర్చవచ్చు, తొలగించవచ్చు.
   బి. అనువాదం మూలానికి ఏమీ చేర్చకూడదు, దాని నుండి ఏమీ తొలగించకూడదు.

6. ఎ. పద్యాన్ని ఎప్పుడూ గద్యంలోకి అనువదించాలి.
   బి. పద్యాన్ని ఎప్పుడూ పద్యంగానే అనువదించాలి.

ఈ principles మనకు అనువాదం ఎలా ఉండాలి అనే విషయంలో పలువురికి గల పలు భిన్న అభిప్రాయాలను తెలియజేయటంతో పాటు అనువాదంతో ముడిపడి ఉన్న కొన్ని ముఖ్యమైన అంశాలను స్పష్టం చేస్తాయి.

ఆ తర్వాతి కాలంలో వచ్చిన theoretical studies అనువాదాన్ని మూలంతో కాకుండా లక్ష్య భాషా పాఠకులతో ముడిపెట్టి చూడసాగాయి. మంచి అనువాదం మూలం మూల భాషా పాఠకుల మీద ఎటువంటి ప్రభావాన్ని కలిగి ఉందో దానికి సమానమైన ప్రభావాన్ని లక్ష్య భాషా పాఠకుల మీద కలిగి ఉండాలనేది కీలకాంశంగా భావించటం జరిగింది. ఉదాహరణకు Nida (1964) అనువాదాలను అంచనా వేయటానికి ఈ కింది మూడు సూత్రాలను ప్రతిపాదించాడు.

1. General efficiency of the communication process
2. Comprehension of intent
3. Equivalence of response

Nida అనువాదానికి సంబంధించి formal correspondence, dynamic equivalence అని రెండు అంశాలను వివరించి వీటిలో అనువాదం మూలంతో formal correspondence ను కలిగి ఉండటం కంటే dynamic equivalence కలిగి ఉండటం ముఖ్యం అంటారు. ఈ dynamic equivalence అనేది మనం పైన చెప్పుకున్న equivalent effect principle కు సంబంధించినది. మూల పాఠకులు మూల రచనకు respond అయ్యే విధానం, లక్ష్య భాషా పాఠకులు అనువాదానికి respond అయ్యే విధానం సమానంగా ఉండాలనేది ముఖ్య సూత్రం. అయితే equivalent గా ఉండాలంటే identical గా ఉండాలని కాదు. నిజానికి మూలరచనకూ, అనువాద రచనకూ భిన్న cultural, historical and situational settings వలన ఈ response ఎప్పుడూ identical గా ఉండదు. ఈ సూత్రం బాగానే ఉంది కానీ మనం ఈ విషయాన్ని empirical గా పరీక్షించడానికి వీలవుతుందా అనేది పెద్ద ప్రశ్న. అలా వీలు కానప్పుడు, అంటే దీన్ని measure చేయటానికి వీలు కానప్పుడు ఈ సూత్రాన్ని అనువాదాల అంచనాలో ప్రధానాంశంగా తీసుకోవటంలో ఉపయోగం లేదు. Newmark ఈ equivalent response principle నే 'mentalistic' అంటాడు.

అనువాదాల testing కు సంబంధించి కొన్ని experimental studies కూడా జరిగాయి. కొందరు పరిశోధకులు కొన్ని practical tests ను సూచించారు. వాటిలో Nida and Taber (1969) ప్రతిపాదించిన close technique ఒకటి. ఏ అనువాదాన్ని పరీక్షించదలిచామో ఆ అనువాదంలో ప్రతి 5వ పదాన్ని తొలగించి పాఠకులకు ఇచ్చి ఆ ఖాళీలను ఆయా context లలో సరిపోయే పదాలతో నింపమనాలి. ఎన్ని ఎక్కువ correct guesses వాళ్లు చేయగలిగితే అంత ఎక్కువ predictability ఆ test కు ఉన్నట్లు. ఎంత ఎక్కువ predictability ఒక అనువాదానికుంటే ఆ అనువాదాన్ని అర్థం చేసుకోవటం అంత తేలికని మనకు తెలుస్తుంది. అలాగే Nida and Taber (1969) ప్రతిపాదించిందే మరో test ఒకే మూలరచనకు గల భిన్న అనువాదాలను బేరీజు వెయ్యటానికి ఉద్దేశింపబడింది. ఒకే మూలరచనకు గల భిన్న అనువాదాలను respondents కు ఇచ్చి వాళ్లను ఇటువంటి ప్రశ్నలు అడగాలి – ఏ అనువాదం అన్నిటి కంటే బాగుంది, ఏ అనువాదం తేలిగ్గా అర్థమవుతుంది, ఏ అనువాదం సహజంగా మూలరచన అనిపించేలా ఉంది మొదలైనవి. ఈ పద్ధతి ద్వారా ఒకే మూలరచనకు ఒకే లక్ష్యభాషలో గల భిన్న అనువాదాలను ఒకదానితోనొకటి పోల్చి

చూసి ఏది అన్నిటి కంటే బాగుందో చెప్పగలం. అయితే ఈ పద్ధతి ఈ అనువాదాలను మూలంతో పోల్చి చూడటం లేదు. కాబట్టి ఇది కూడా అనువాదరచనల అంచనాలకు valid test కాదు. అనువాద రచనల గుణగణాలను అంచనా వేయటానికి yardstick గా మూలరచనను వాడకపోతే ఏ test అయినా valid అవ్వదు. తర్వాత వారివారి అభిప్రాయాలలో, అభిరుచులలో respondents మధ్య చాలా తేడాలుంటాయి. ఈ తేడాలను నియంత్రించటం కష్టం. కాకపోతే ఈ test అనువాదం పట్ల readers కు గల general impression ను చూచాయగా తెలుసుకోవటానికి ఉపయోగపడుతుంది.

మనం పైన చూసిన మొదటి test - close test లో కూడా అనువాద రచనకు predictability ఏ మేరకు ఉందో తెలుసుకుంటున్నాం గాని దాన్ని మూలరచన predictability తో పోల్చి చూసి రెండింటికీ సరైన match ఉందా, లేదా అనేది పరీక్షించటం లేదు. కాబట్టి ఇది కూడా అనువాద రచనల విమర్శకు సరైన test కాదు.

అటు తర్వాత Wiles, Koller, Reiss వంటివారు అప్పటి వరకూ అనువాద రచనల విమర్శకు ఇతరులు చేసిన ప్రతిపాదనలలోని లోపాలను సరిదిద్దటానికి ఒక్కటే మార్గమనీ, అది మూలరచనను క్షుణ్ణంగా విశ్లేషించటానికీ, అనువాద రచనను అంచనా వేయటానికీ అనువైన సూత్రాలను ఇవ్వగలిగిన ఒక నమూనాను తయారు చేసుకోవటమేనని అభిప్రాయపడ్డారు. వీరందరూ source - text based models ను ప్రతిపాదించారు. Reiss, Koller లు ప్రతిపాదించిన modelsను పరిగణనలోకి తీసుకొని ఒక సంపూర్ణమైన, చక్కటి ఆచరణ యోగ్యమైన నమూనాను House (1977) ప్రతిపాదించారు. ఈ model ప్రకారం ముందుగా SL text కు సంబంధించిన linguistics, situational peculiarities అన్నిటినీ విశ్లేషించాలి. తర్వాత TL texts కు సంబంధించిన linguistics, situational peculiarities ను కూడా విశ్లేషించుకోవాలి. ఆ తర్వాత రెండు texts ను అన్ని aspects లో, అన్ని dimensions లో compare చేసి SL text కూ, TL text కూ ఎక్కడెక్కడ match కుదురుతుందో, ఎక్కడెక్కడ match కుదరట్లేదో, అంటే mismatch ఉందో చూసి దాన్ని బట్టి objective గా అనువాదపు quality ని judge చేయాలి. (ఈ నమూనా details కొరకు House, Juliana (1977) - A Model for Translation quality Assessment; Tisbingen: Gunter Narr చూడండి).

ఈ model ఒక functional - situational . మూలరచనకు ఏ function ఉందో అనువాద రచన కూడా అదే function ఉంటే దాన్ని adequate translation అంటాం. అది తెలుసుకోటానికి రెండు text లకు సంబంధించిన linguistic features నూ, extralinguistic features నూ, situational features నూ విశ్లేషించి చూడాలి. SL text కూ, TL text కూ గల mismatches రెండు రకాలుగా ఉంటాయి. 1. dimensional mismatches: శైలిలో కనిపించే మార్పులు, addresser కీ, addressee కీ మధ్య ఉండే relationship లో చోటు చేసుకొన్న మార్పులు, ఉపయోగించిన dialect పరంగా కనిపించే మార్పులు ఈ కోవకు చెందుతాయి. ఇవి పైకి ప్రస్ఫుటంగా కనిపించకుండా ఉండే మార్పులు. వీటినే 'covertly erroneous errors' అంటారు. 2. Non - dimensional mismatches : ఇవి మూలరచనకూ, అనువాద రచనకూ మధ్య denotative meanings లో గల mismatches గా గానీ, target language system కు అనుగుణంగా లేకపోవడం వలన తలెత్తిన mismatches గా గానీ ఉండవచ్చు. Denotative meaning లో కనిపించే మార్పులు omissions, additions, substititions గా ఉండొచ్చు. అలాగే target language system లో ఉండే breaches కూడా రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి cases of ungrammaticality (TL వ్యాకరణపరంగా ఉన్న తప్పులు), రెండవది cases of dubious acceptability (TL readers కు ఆమోదయోగ్యంగా లేని విషయాలు). ఈ non - dimensional mismatches నే 'overtly erroneous errors' అంటారు.

ఈ విధంగా SL, TL text ల profiles ను compare చేసి వాటి relative matching ను తెలుసుకోవాలి. ఏ dimension లో కూడా SL text కూ, TL text కూ మధ్య mismatches లేకపోతే అది satisfactory translation అవుతుంది. ఒకవేళ ఏవైనా mismatches ఉన్నా వాటికి సరైన justification ఉంటే ఏ ఇబ్బందీ ఉండదు. ఉదాహరణకు తెలుగులో ఏదైనా ఒక dialect లో రాసిన నవలను ఆంగ్లంలోకి అనువదించేటప్పుడు equivalent dialect ను వాడటానికి వీలు కాదు. కానీ ఈ mismatch కారణంగా అనువాదాన్ని inadequate translation అని కొట్టిపారేయలేం. ఆంగ్లానువాదంలో అనువాదకుడు ఏదైనా equivalent English dialect ను వాడకపోవటానికి/ వాడలేకపోవటానికి valid reasons ఉన్నాయి. కాబట్టి ఈ mismatch ని పట్టించుకోవలసిన అవసరం లేదు.

ఈ వ్యాసంలో ఇప్పటి వరకు చర్చించుకున్న అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకొని మనం ఒక conclusion కు రావచ్చు. అనువాద గ్రంథాల విమర్శను ఏకపక్షంగా ఒక అనువాదాన్ని మాత్రమే చూసి, మూలంతో సంబంధం లేకుండా అంచనా వేయటం సమంజసం కాదు. ఇలా చేస్తున్నప్పుడు మనం అనువాదాన్ని అనువాదంగా అంచనా వేయటం లేదు. లక్ష్యభాషలో వచ్చిన ఒక స్వతంత్ర రచనగా చేస్తున్నాం కాబట్టి ఇది అనువాద విమర్శ కాదు. అలాగే TL text ను TL speakers కు ఇచ్చి ప్రశ్నావళి సహాయంతోనో లేదా ప్రత్యక్షంగా ప్రశ్నలడిగో వారి నుండి వారి వారి అభిప్రాయాలను సేకరించడం కూడా సరైన విధానం కాదు. ఒక్కోసారి ఇలాంటి సర్వేలలో మూల రచననూ, అనువాదాన్నీ రెండింటినీ ఇచ్చి పాఠకుల అభిప్రాయాలను సేకరించటం జరుగుతుంది. అంటే మూలభాషా, లక్ష్యభాషా రెండూ తెలిసినవారిని సంప్రదించటం జరుగుతుంది. అయితే ఇటువంటప్పుడు జరిగేదేమిటంటే సర్వే మొదలు పెట్టకముందే, ప్రశ్నావళిలో ఉండే ప్రశ్నలను నిర్ణయించే ప్రక్రియలోనే పరిశోధకుడే అనువాదానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటాడు. ఇవి కూడా intuitive గా, subjective గా ఉంటాయి. ఉదాహరణకు 'అనువాదం మూలానికి విధేయంగా ఉందా, లేదా?'; 'అనువాదంలో పఠనయోగ్యత ఉందా?' ; 'అనువాదం original spirit ను capture చేయగలిగిందా, లేదా?' ; 'అనువాదం స్వతంత్ర రచనలాగా సహజంగా, సృజనాత్మకంగా ఉందా?' ఇత్యాది ప్రశ్నలను ప్రశ్నావళిలో చేర్చినప్పుడే ఆ పరిశోధకుడి అభిప్రాయంలో ఒక అనువాదం బాగుండాలంటే దానికి ఏయే లక్షణాలుండాలనే విషయం తేటతెల్లమవుతుంది. కాబట్టి మళ్లీ అది subjective approach అవుతుంది.

అలా కాకుండా అనువాదవిమర్శకుగాను House ప్రతిపాదించినట్లు SL text నూ, TL text నూ కొన్ని ముఖ్యమైన అంశాలపరంగా విడివిడిగా విశ్లేషించి, వాటి profiles ను పూర్తిగా అర్థం చేసుకున్నాక రెండింటినీ compare చేసి చూసి ఎక్కడెక్కడ రెండూ equivalentగా ఉన్నాయో, ఎక్కడెక్కడ లేవో తెలుసుకొని తదనుగుణంగా అనువాదం బాగుందనో, బాగా లేదనో చెప్పటం శాస్త్రీయంగా ఉంటుంది. ఒక SL text నూ, TL text నూ ఈ విధంగా విశ్లేషించి ఎవరు చెప్పినా, ఎంతమంది చెప్పినా, ఏ కాలంలో చెప్పినా ఫలితం ఒకే లాగా ఉంటుంది. అందరూ objective గా concrete evidence ను ఆధారం చేసుకొని చెబుతారు

కనుక భేదాభిప్రాయాలుండే అవకాశం ఉండదు. కాబట్టి అనువాద విమర్శకు గాను ఇటువంటి objective, scientific పద్ధతిని అవలంబించటం ఆచరణీయంగానూ, ఆదర్శంగానూ, ప్రయోజనకరంగానూ ఉంటుంది.

References:

1. House, Juliane (1977) - A model for Translation Quality Assessment. Tiibengen: Gunter Grass.
2. Nida, E.A. and C.R. Taber (1969). The Theory and Practice of Translation. Leiden : Brill.
3. Nida, E.A. (1964) Toward a Science of Translating. Leiden: Brill.
4. Savory, T (1968) The Art of Translation, Boston : The writer.
5. Lakshmi, H (1993) Problems of Translation. Hyderabad : Booklinks Corporation.

కవిత్వానువాదం

సుజాత పట్వారి

అనువాదం అంటే ఒక భాషలోని విషయాన్ని ఇంకో భాషలోకి భాషాంతరీకరించడం అని చెప్పవచ్చు. మన భారతీయ భాషా సాహిత్యాల్లో మొట్టమొదట వెలువడ్డ సాహిత్యం అనువాద సాహిత్యమే అన్న విషయం అందరికీ తెలిసిందే. అవే సంస్కృత మూలంలో నుండి వివిధ భారతీయ భాషల్లోకి వచ్చిన Indian epics అనబడే రామాయణ, మహాభారతాలు. అయితే మన ప్రాచీనులు చేసినవి అనువాదాలు అన్న ఆలోచనే రానంతగా వాటిని ఆయా కవుల స్వీయరచనలుగానే వింటూ, చదువుతూ పెరిగి పెద్దయ్యాం. వారు సంస్కృతానికి మక్కికి మక్కిగా పదానువాదం చేయకుండా వాటికి తమ సృజనాత్మకతను జోడించడం వల్ల వాటి స్థాయి దాదాపు మాతృకల స్థాయికి చేరింది. మనకు ఒక్క తెలుగులోనే చాలా మంది కవులు రచించిన రామాయణాలు - మొల్ల నుండి విశ్వనాథ సత్యనారాయణ దాకా లభిస్తున్నాయి. కాలగర్భంలో కలిసిన ప్రతులు ఇంకెన్నో! మొత్తం భారతీయ భాషల్లో రాతరూపంగా కానీ, మౌఖిక రూపంలో గానీ వాడుకలో వున్న రామాయణ, భారతాలు అనేకం.

ఒక స్థలకాలాలకు సంబంధించిన ప్రజల సృజనాత్మక ఆలోచనా విధానాల్ని అన్ని భాషల్లోకి వ్యాప్తి చేయడమే సాహిత్యానువాదాల ప్రధాన ఉద్దేశ్యం. సాంకేతికాభివృద్ధిలో భాగమైన రవాణా వ్యవస్థ, సమాచార వ్యవస్థలు ఎలా అయితే ప్రపంచ మానవుల మధ్య దూరాన్ని తగ్గించి ప్రపంచాన్నే ఓ 'global village' గా మార్చినట్టు, అనువాదాలు ఎక్కడెక్కడో పుట్టి, విస్తరించుకున్న మానవుల ఆలోచనా విధానాలను, తాత్విక చింతనలను ఒకరివి ఇంకొకరికి పరిచయం చేస్తూ వారిని దగ్గర చేస్తాయి. అన్ని మానవ సమాజాల ఆలోచనలు, సృజనాత్మకతలు సమైక్యం కావడం విశ్వమానవ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది.

సాహిత్యానువాదాలను మిగిలిన అనువాద ప్రక్రియలతో పోల్చరాదు. సాంకేతిక విషయాల్ని, సమాచార ప్రధానమైన విషయాలను అనువదించడానికి సృజనాత్మకత అంతగా అవసరం లేదు. రెండు భాషా నిఘంటువులను దగ్గరుంచుకుని

యాంత్రికంగా చేయవచ్చు. కానీ సాహిత్యం విషయానికొస్తే, అనువాదం కొంత కష్ట సాధ్యమవుతుంది.

సాహిత్యం సృజనకు, కళాత్మకతకు సంబంధించిన అంశం. దీని మూలశక్తి కవి లేదా రచయిత యొక్క అనుభవం, అనుభూతుల మీద ఆధారపడి ఉంటుంది. సంగీతాన్ని, నాట్యాన్ని అభివ్యక్తీకరించే కళలని అన్నప్పటికీ అవి వ్యక్తీకరించే భావాలు చాలా పరిమితి కలిగినవై వుంటాయి. భాష వ్యక్తీకరించినన్ని భావాల్ని, సంక్లిష్టతల్ని పైవి వ్యక్తీకరించలేవు. అందుకే సాహిత్య రచనకు విస్తృతి ఎక్కువ. అలాగే సాహిత్యం ఓ ప్రత్యేకమైన అనుభూతిని, శిల్పచాతుర్యాన్ని డిమాండు చేస్తుంది. సాహిత్యాన్ని అర్థం చేసుకోవడంలో వాక్యం సూచించే అర్థాల్నే కాక, వాటి మధ్యన ఎదురయ్యే నిశ్శబ్ద సంకేతాల్ని కూడా అర్థం చేసుకోగలగాలి. వాటిని అంతే సూచ్యప్రాయంగా ఇంకో భాషలో వ్యక్తీకరించగలగాలి. అందుకే సాహిత్య అనువాదకుడి పని కత్తి మీద సాములాంటిది.

అన్ని సాహిత్య ప్రక్రియల్లోకి కవిత్వం విశిష్టమైనది. కవిత్వం ఒక 'abstract' ని ధ్వని ద్వారానో, సూచ్యంగానో, ఉపమాన ఉపమేయాలను ఉపయోగించుకుంటూనో 'concretise' చేస్తూ పాఠకుడిలో స్పందనల్ని రేపే ప్రక్రియ. అందుకే అన్ని ప్రక్రియల్లోకి కవిత్వానువాదం విశిష్టం, క్లిష్టం కూడా. కవి, తన కవిత్వంలో ఒక భాషను వాడుకున్నా, ఆ భాషకే ఓ ప్రత్యేక వాక్యార్థ, కావ్యార్థాల్ని స్ఫురించగలిగే శక్తిని ప్రసాదిస్తాడు. అనువాదంలో ఇలా భాషకున్న subtlities ను పట్టుకోవడం చాలా శ్రమతో కూడుకున్న పని. ఒక్కోసారి అసాధ్యమని అనిపిస్తుంది కూడా.

కవిత్వం ఒక ప్రత్యేక శిల్పాన్ని కలిగి ఉంటుంది. కవిత్వంలో ఉపయోగించే ప్రతీకలు, imagery అంతా ఓ నిర్దిష్టమైన సాంస్కృతిక మూలాన్నించి వస్తాయి. భాషకు దానిదే అయిన లయ, గతి, ధ్వని ప్రత్యేకంగా ఉంటాయి. అందుకే ప్రతి భాష దేనికదే విశిష్టం. మూలభాషలోని ఈ లక్షణాన్ని లక్ష్యభాషలోకి మార్చటం కొంత కష్టమే. ప్రతి భాషకు పైన పేర్కొన్న తనదైన గుణాత్మకత సమాన స్థాయిలో వుంటే అనువాదాలు సులభమవుతాయి. అందుకే ఒక భారతీయ భాషలోంచి ఇంకో భారతీయ భాషలోకి అనువాదాలు effective గా మాతృకకు సరితూగేటట్టుగా చేయగలం. ఎందుకంటే దాదాపు మన భాషలన్నీ ఒకే సాంస్కృతిక, సామాజిక నేపథ్యంలోంచి వచ్చాయి కాబట్టి.

ఇక తెలుగు నుండి ఇంగ్లీషులోకి, లేదా ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువాదాలు చేసేప్పుడు ఎదురయ్యే అడ్డంకుల్ని క్రమశిక్షణతో, ఓర్పుతో అధిగమించే ప్రయత్నం చెయ్యాలి. ఈ విషయంలో భాష మీద, అందులోని నుడికారాల మీద పట్టు సాధించటం అనే అంశం మీదే అనువాదకుల విజయం ఆధారపడి ఉంటుంది. పైగా తెలుగు, ఇంగ్లీషు భాషలు భాషాపరంగా ఒకే గుణాత్మకతను ప్రదర్శించవు. ఇరు సంస్కృతులు కూడా చాలా విభిన్నమైనవి. అందుకే అనువాదకులు జాగురూకతతో వ్యవహరించాలి. అనువాదకులు మూల, లక్ష్య భాషల్లో ప్రావీణ్యాన్నే కాక ఆ రెండు సంస్కృతులను internalise చేసుకోగలిగి వుండాలి. అప్పుడే మంచి అనువాదాలు చేయడానికి సాధ్యమవుతుంది.

బ్రిటిష్‌వారి వలసతో ప్రారంభమైన అనువాదం భారతీయ భాషల నుండి ఇంగ్లీషులోకి, ఇంగ్లీషు నుండి భారతీయ భాషల్లోకి అనువదించబడే ప్రక్రియను గమనించినట్టయితే ఒక పక్క మన విద్యావిధానాన్ని ముందుకు నడిపినట్టుగానే (ప్రక్రియలపరంగా, సాంకేతికపరంగా) కనిపించినప్పటికీ ఇంగ్లీషు భాష మన ఆలోచనా రీతులను స్థానభ్రమణం చేయించి మన ఆలోచనా విధానాలను వలసవాద చట్రంలో బిగించడమే కాక మన భాషలకు, భాషా సంప్రదాయాలకు చేసిన హాని కూడా తక్కువదేమీ కాదు. కానీ ప్రస్తుతం ఇది సాహిత్యానువాదానికి సంబంధించిన సదస్సు కాబట్టి ఈ అంశాన్ని ఇక్కడ చర్చకు లేవనెత్తడం లేదు.

తెలుగు భాష భారతదేశంలోనే ఎక్కువగా వాడబడుతున్న భాషల్లో రెండవది. తెలుగులో 1920 - 40 ప్రాంతం వరకు ఛందోబద్ధమైన పద్యరచనే ఎక్కువగా సాగింది. తరువాత దశలో ఆధునిక కవిత్వం మొదలయింది. తెలుగు కవులు కొత్త ప్రక్రియల వైపు, కవితారీతుల వైపు ఆసక్తి చూపారు. కొన్ని సంవత్సరాలుగా ఒకే లాంటి ప్రక్రియలు, భాషారీతులు చలామణి అవుతుంటే, క్రమేపి భాష కొత్త ప్రక్రియల్ని, మార్పుల్ని కోరుకుంటుంది. ఇది అన్ని సాహితీ సంప్రదాయాల్లోనూ జరిగే మార్పే. ఇలాంటి చారిత్రక సన్నివేశంలో కవులు, రచయితలు ముందుండి తమ భాషల్లో వచ్చే మార్పుల్ని ఆహ్వానించే గురుతర బాధ్యతను స్వీకరిస్తారు.

తెలుగులో కూడా పద్యకవితా ధోరణి నుండి కవిత్వం క్రమంగా సౌందర్యాపేక్ష, ఆత్మాశ్రయ ధోరణితో భావకవితకు శ్రీకారం చుట్టింది. భావ కవితా కాలంలో కవిత ఛందోబద్ధతను పాటించినా భావాలు అభ్యుదయ ధోరణిలో ఉండి వచన కవితా ప్రక్రియకు దారి చూపాయి. ఈ దారిలో ముందుండి నడిపిన కవులు కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, అబ్బూరి వరదరాజేశ్వరరావు, బాలగంగాధర తిలక్ మొదలైనవారు.

వచన కవితాప్రక్రియలో అభ్యుదయవాద కవిత్వం రాసినవారిలో ప్రముఖ కవి డా. సి. నారాయణరెడ్డి, దాశరథి మొదలైనవారు ప్రముఖులు.

తెలుగులో ఒక తరాన్నే తన కవిత్వంతోనూ, విప్లవాభ్యుదయంతోనూ కట్టి పడేసిన కవి శ్రీశ్రీగారు. శ్రీశ్రీ కవితల్నే కాదు, ఆయన వచనాన్ని అనువాదం చేయాలన్నా కష్టమే. ఉదాహరణకు శ్రీశ్రీ 20వ శతాబ్దం తనదేనంటూ కచ్చితంగా ప్రకటించుకుంటూ రాసిన పంక్తుల్ని పరిశీలిస్తే,

'నాదొక దుర్గం
నేనొక స్వర్గం
అనర్గళం
అనితర సాధ్యం
నా మార్గం'

దీనిని ఇంగ్లీషులోకి అనువదిస్తే,

'I am a paradise
mine is a fort
Abundant but
impossible for others
is my way'

ముంజేతి కంకణానికి అద్దమెందుకన్నట్టు చూడగానే ఇంగ్లీషు అనువాదంలోని బలహీనత అర్థమైపోతుంది. మాతృకలోని శక్తి, ధీమా, uniqueness, ఆ marching rhythm అనువాదంలో లేక, అనువాదం చప్పగా మారింది. 'simpler rhyme is difficult to translate' అంటారు విజ్ఞులు. అలాంటిది శబ్దసౌందర్యంతో, అంతర్లీనంగా వుండే దుడుకు, క్లిష్టసమాసాలు, సంస్కృత పదాలు, ప్రతీకలు శ్రీశ్రీగారిని అనువాదానికి కష్టమైన, అనువుగాని కవిగా నిలబెడతాయి. శ్రీశ్రీ గారి కొన్ని కవితల అనువాదాలు పైన చెప్పిన ఉదాహరణ కంటే బాగానే వచ్చాయి.

ప్రారంభదశ నుంచి తెలుగు కవిత్వం మౌఖిక ప్రధానంగా వుంటూ వచ్చింది. పద్యాల్ని, కవితల్ని రాగయుక్తంగా వినడం, పాడటం జరుగుతూ వచ్చింది. మన భారతీయ సాహిత్యం మననానికి అనుగుణంగా ఉంటుంది. అందుకే తెలుగు భాషకున్న musical quality అంత మొత్తంలో ఇంగ్లీషు భాషకు లేదు. మన సాహిత్యం ధ్వని ప్రధానమైనందు వల్లనే గొప్ప గొప్ప కవులు, కృతికర్తలు, వాగ్గేయకారులు తెలుగు ప్రజల నోళ్లలో అలవోకగా జాలువారుతుంటారు. అందుకే పైన ఉదాహరించిన కవులను

ఇంగ్లీషులోకి అనువదిస్తే వారిని ఎప్పటికప్పుడు చదవాల్సిందే తప్ప 'మననం చేసుకునే' లక్షణాన్ని అనువాదం కోల్పోతుంది.

ప్రతి తెలుగు కవి మొట్టమొదటిసారి కవిత్వంతో ప్రేమలో పడడానికి కారకుడు తెలుగు పాఠక భావనా ప్రపంచంలో కలకాలం నిలిచిపోయే కవి బాలగంగాధర తిలక్. కవిత్వం ద్వారా దృశ్యచిత్రాల్ని ఆవిష్కరించడంలో తిలక్‌ని మించిన కవులు అరుదు. తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'కి వెలువడిన మూడు అనువాదాల్ని తులనాత్మకంగా పరిశీలించినట్టయితే అనువాదంలో తలెత్తే సమస్యలు, అనువాదకులు 'మాతృక'తో తీసుకొనే స్వేచ్ఛ వల్ల మారే అర్థాలు, అన్నవి స్పష్టంగా పరిశీలించడానికి వీలవుతుంది. ఇది తులనాత్మక విశ్లేషణ తప్ప ఎవరి అనువాదం గొప్పది అని చెప్పే ఉద్దేశ్యం కాదు. తిలక్ కవిత్వం నిండా ఒక intensive passion, భావుకత, లయ పుష్కలంగా కనిపిస్తాయి. సంస్కృత పదాలు, సమాసాలు - కవి వెంట పరుగెడుతుంటాయి. ఇక 'culture specific' expressions మాట సరేసరి. Suggestability అన్నది తిలక్ కవిత్వంలో ఒక భాగం. ఈ కవితకు ముగ్గురు అనువాదకులు శీర్షికలు విభిన్నంగా పెట్టారు. వెల్చేరు నారాయణ రావు దీనికి 'The Night that Poured' అని పెట్టే, ప్రొ. ప్రభాకరరావు 'As Ambrosia Dripped' అని, వెలిచాల కొండలరావు 'The Night that Rained Nector' అని పెట్టారు. శీర్షిక పెట్టడంలోనే ఇన్ని విభిన్నతలున్నప్పుడు ఇక ఇంగ్లీషులో తెలుగు పదాలకు దీటుగా పదాలు, వాడుకలు లేకపోయినప్పుడు భావాన్ని వేరే భాష పాఠకుడికి అందించాలన్న తపనతో అనువాదాలు వివరణాత్మకంగా మారడం కూడా జరుగుతుంది. ఉదాహరణకు ఈ కింది పంక్తులను తీసుకుంటే -

'జీవితాన్ని ప్రేమించినవాడు, జీవించటం తెలిసినవాడు
నవనవాలైన ఊహావర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు
ఇతడే సుమీ మన ప్రియుడు, నరుడు మనకి వరుడు..'

ఈ పంక్తులు ఇంగ్లీషులోకి వచ్చేసరికి మాతృకలోని శబ్ద సౌందర్యం కాస్తా వివరణాత్మకంగా మారింది.

అనువాదకులు 'మాతృక'తో స్వేచ్ఛ తీసుకునేప్పుడు మాతృక భావం చెడకుండా, అర్థాలు మారకుండా రెండింతల జాగ్రత్తతో మెలగకపోతే విమర్శకుల బారిన పడే ప్రమాదం ఉంది. డా. కొండలరావు కవితలోని మొదటి పంక్తులకు

'అమృతం కురిసిన రాత్రి
అందరూ నిద్ర పోతున్నారు

నేను మాత్రం
తలుపు తెరచి యిల్లు విడిచి
ఎక్కడికో దూరంగా
కొండ దాటి కోన దాటి
వెన్నెల మైదానంలోకి
వెళ్లి నిలుచున్నాను'

మధ్యలో uncertain of my destination, unclear of my intention అన్న పదాలు చేర్చడం వల్ల కవిత సూచించని అర్థం సూచించటమే కాక కవిత స్వభావమే మారిపోయింది. ఇక ప్రొ. ప్రభాకర్ 'అందరూ నిద్రపోతున్నారు...' అన్న దగ్గర 'except myself' అని వాడారు. ఆ భావం అక్కడ సూచ్యం. ఒక్క పదమే అనిపిస్తుంది కానీ, అలా ప్రకటించడం కవిత్వం economy ని disturb చేస్తుంది. అలాగే వెల్చేరు నారాయణ రావు 'అమృతం' అన్న దానికి 'life' అని పెట్టారు కానీ 'అమృతం' అన్న పదం పాఠకుణ్ణి ఇంకో భావనా ప్రపంచంలోకి తీసుకెడుతుంది. ఆ శక్తి ఇంగ్లీషులో 'life' కు రాలేదు.

ఎలా అయితే పాఠకులంతా ఒక కవితకు ఒకేలా స్పందించరో అలాగే ఏ ఇద్దరు అనువాదకులు ఒక text ను ఒకేలా అనువదించరు. ఒక text అర్థాన్ని గ్రహించడంలో పాఠకుల sensibility, intellectual and emotional backgrounds ఎలా అయితే పాఠకుడి reading ను ప్రభావితం చేస్తాయో, అలాగే అనువాదకుల స్వంత నేపథ్యం, sensibility కూడా అనువాదపు గుణాత్మకతను ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు తెలుగులో ఠాగూర్ 'గీతాంజలి'కి వచ్చిన కొన్ని అనువాదాల్ని పరిశీలిస్తే ఈ విషయం మనకు స్పష్టం అవుతుంది. నేనిక్కడ పేర్కొనబోయేది ఒకటి గుడిపాటి వెంకటాచలం అనువాదం, రెండోది బెల్లంకొండ రామదాసుది, మూడోది డా. జె. భాగ్యలక్ష్మిది.

ఠాగూర్ రాసిన 'గీతాంజలి'లోని ఓ పద్యం –

I ask for a moment's indulgence to sit by Thy side. The works that I have in hand I will finish afterwards.

Away from the sight of Thy face my heart knows no rest nor respite, and my work becomes an endless toil in a shoreless sea of toil............

గుడిపాటి చలం అనువాదం:

నీ పక్కన ఓ నిమిషం కూచునే చనువు నాకిమ్మని అడుగుతున్నాను
నేను అవసరంగా చెయ్యవలసిన పనుల్ని తరువాత పూర్తి చేసుకుంటాను.
నీ ముఖవీక్షణం నించి యెడమయిందా, నా హృదయానికి శాంతి
విశ్రాంతులుండవు. తీరం కనపడని శ్రమా సముద్రంలో
అంతులేని అలసటగా కనపడుతుంది నేను చేసే పని.

....

బెల్లంకొండ రామదాసు అనువాదం:

ఒక నిమిషం. కాసేపు నీ ప్రక్కన నన్ను కూర్చోనివ్వవూ?
పనులు తరువాత చేసుకుంటాను. నీ ముఖాన్ని
ఒక్క మాటైనా చూడకపోతే, నా హృదయానికి శాంతీ,
స్థిమితమూ ఉండవు. నాకు ఎంత చిన్నపని అయినా
ఈదరాని మహాసముద్రంలా కనిపిస్తుంది.

....

డా. జె. భాగ్యలక్ష్మి అనువాదం:

ఒక్క క్షణం నీ పక్కన కూర్చునే చనువు కోరుతున్నాను.
నా పనులన్నీ తర్వాత పూర్తి చేస్తాను.
నీ ముఖారవిందం నుండి దృష్టి మరల్చానంటే హృదయానికి శాంతి
విశ్రాంతులుండవు. తీరం లేని సముద్రంలో నా శ్రమ నిరంతరమనిపిస్తుంది.

....

ఈ మూడు అనువాదాల్ని చూస్తే, ఈ మూడు మూల మాతృకకు చాలా దగ్గరగా వుంటాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ చాలా సరళమైన, గాఢమైన ఆత్మానుగతమైన భక్తిని 'గీతాంజలి' ద్వారా మనకు అందిస్తారు. కవిత్వంలో మనం చిన్న పదం అనుకున్నదే చాలా పెద్ద అర్థాన్నిస్తుంది. అలాగే కవిత్వంలో విరామ చిహ్నాలను మనం సాధారణంగా గమనంలోకి తీసుకోం. పై కవితలో కవి తను చేయాల్సిన అత్యవసరమైన పనులన్నింటిని పక్కన పెట్టి భగవంతుడి సన్నిధిని ఇష్టపడతాడు. దీన్ని చలం 'నేను అవసరంగా చెయ్యవలసిన...' అన్న మాటల్లో ప్రతిఫలిస్తారు. మిగిలిన రెండు అనువాదాల్లోనూ దీన్ని ఎదో matter of fact గా చెప్పినట్టు ధ్వనిస్తుంది. ఇలాంటప్పుడే కవితలో ఉన్న tone/ గొంతు, భావాన్ని ఉద్దీపన చేయడానికి

ఉపయోగపడుతుంది. అనువాదకులు ఆ tone/ గొంతును అనుసరించకపోతే కవితలో గాఢత పలుచబడే ప్రమాదం ఉంది. ఇకపోతే బెల్లంకొండ రామదాసు అనువాదంలో 'ఒక్క నిమిషం.' తరువాత వచ్చే full stop కొంత నాటకీయతను సూచించినప్పటికీ, వెంటనే వచ్చే 'కాసేపు' కవి ఆరాటాన్ని, తపనని మాతృకలోని స్థాయిలో చూపించదు. అందుకే కవిత్వానువాదంలో కవిత గొంతు/ tone, విరామ చిహ్నాలను కూడా జాగ్రత్తగా పరిశీలించాలి.

ఇక మాతృకలోని 'my work becomes an endless toil in a shoreless sea of toil' అన్న దానికి చలం మాత్రమే సరిగ్గా 'తీరం కనపడని శ్రమా సముద్రంలో అంతులేని అలసటగా కనబడుతుంది నేను చేసే పని' అని అనువదించారు.

చలంలో intensity of passion and emotions చాలా ఎక్కువ అని తెలుగు పాఠకుల్లో దాదాపు అందరికీ తెలిసిన విషయం. ప్రేమైనా, కామోద్రేకమైనా, భక్తి పారవశ్యమైనా వ్యక్తీకరించడంలో చలంది బలమైన గొంతుక. అందుకే అతని జీవితంలో కూడా మైదానాల నుండి రమణాశ్రమం దాకా అంతే భావోద్వేగం. అందుకే చలం 'గీతాంజలి' అనువాదం మాతృకకు ప్రతిబింబంలా కనిపిస్తుంది.

కొన్నిసార్లు అనువాదానికి అనువు గాని, క్లిష్టమైన వాక్యాల్ని, పదాల్ని, తీసివేసినా అర్థం చెడని సందర్భాల్లో అనువాదకులు వాటిని తొలగించి కవితార్థం మారకుండా అనువదిస్తారు. అలాగే కొన్ని వాక్యాల వరుసక్రమాన్ని లక్ష్యభాష సౌలభ్యం కోసం ఒకోసారి మార్చడం కూడా జరుగుతుంది. ఉదాహరణకు అజంతా సంపుటి 'స్వప్నలిపి'ని 'మో' 'Dream Spirit' గా ఆంగ్లంలోకి అనువదించారు. అజంతా 'క్షణం క్రితం అక్కడ' అన్న కవితలో ఒక చోట –

సౌందర్యరేఖపై నడుస్తున్నానా?
నక్షత్ర వీధిలో నడుస్తున్నానా?
విపణి విద్యుత్ కాంతులలో నడుస్తున్నానా?
జీవన వైదగ్ధ్యంలో నడుస్తున్నానా?

ఈ పంక్తులకు 'మో' –

Was I walking beauty's longitude?
Was I walking on the starry streets?
Was I walking in in the electric lights of the market?

పై కవితలో 'జీవన వైదగ్ధ్యంలో నడుస్తున్నానా?' అన్నది ఆంగ్లానువాదంలో కనిపించదు. అలాగే పంక్తుల అమరిక మారడం కూడా గమనించవచ్చు. అందుకే కొన్ని సార్లు అనువాదకులు అర్థం మారకుండా కొంత స్వేచ్ఛను తీసుకుంటారు.

పైన చర్చించినటువంటి పరిమితులు వున్నప్పటికీ అనువాదకులు వెనుకాడక ఈ పరిమితుల్ని తగు రీతిలో సృజనాత్మకంగా (మాతృకకు ఏ మాత్రం భంగం కలగకుండా) అధిగమించి అన్య భాషా పాఠకులకు మంచి సాహిత్యాన్ని పరిచయం చేస్తూనే ఉండాలి.

అనువాదాలను పుస్తకరూపంగా తీసుకుని వచ్చేప్పుడు తాము ఉపయోగించిన మాతృకల ముద్రణ, ప్రచురణల వివరాలను విధిగా పొందుపరచాలి. ఇది భవిష్యత్తులో పాఠకుల reference కు ఉపయోగపడుతుంది. అలాగే మాతృక భాష గురించి, రచయిత గురించి విశ్లేషణాత్మక పరిచయాన్ని, ఆ రచన వెలువడ్డ చారిత్రక సమయ సందర్భాలను వివరిస్తూ పరిశోధనాత్మకంగా 'ముందుమాట' లేదా 'వెనుకమాట'గా కానీ పొందుపరచడం పాఠకులు అనువాదాన్ని ఆదరించడానికి ఎంతో తోడ్పడుతుంది. ముఖ్యంగా ఇతర భాషా పాఠకులకు తెలుగు గురించిన సమాచారం తెలిసి వుండదు కాబట్టి అలాగే అందరు తెలుగు పాఠకులకు ఇంగ్లీషు సాహిత్యం, రచయితల సమాచారం తెలిసి వుండదు కాబట్టి వివరణలు అవసరమవుతాయి.

ఒక కవి రాసిన అన్ని కవితలు బాగుంటాయన్న నిబంధన లేనట్టుగానే అందరు కవులు తమ భాషా సంప్రదాయాల్ని represent చేయగల స్థాయిలో వుంటారన్న గ్యారంటీ కూడా ఏమీ లేదు. అనువాదకులు వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సాహిత్యానికి నిజంగా contribute చేసిన, చేస్తున్న రచనలను అనువాదానికి స్వీకరించడం శ్రేయస్కరం.

రాజశేఖరుడు తన కావ్యమీమాంసలో చెప్పినట్టు మంచి కవితగానీ, పాట గానీ జనుల నోట్లో నానుతూ అనంతానంత సమయాల్లోకి, ప్రదేశాల్లోకి సంచరిస్తుందట. అందుకే మంచి కవితలు ఎప్పటికైనా ఎల్లలు దాటక తప్పదు, మిగిలిన భాషలతో పరస్పర సంభాషణలు చేయకా తప్పదు. అందుకే అవి మంచి అనువాదకుల కొరకు ఎదురు చూస్తుంటాయి. అలాగే మంచి అనువాదకులు మంచి కవితా స్నేహాల కొరకు ఎదురు చూస్తూ తమ బహు భాషాత్వాన్ని సార్థకం చేసుకోడానికై వేచి వుంటారు.

ఉపయుక్త గ్రంథాలు:

1. అజంతా 'స్వప్నలిపి', కవిత్వం ప్రచురణలు, 1993
2. వేగుంట మోహనప్రసాద్, 'Dream Script' , అజంతా 'స్వప్నలిపి'కి ఇంగ్లీష్ అనువాదం, సాహిత్య అకాడమీ, 2003
3. బాలగంగాధర తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1990
4. డా. వి. కొండలరావు 'Tilak's The Night That Rained Nector' – బాలగంగాధర తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'కి ఇంగ్లీష్ అనువాదం. సిస్టర్ నివేదిత పబ్లికేషన్స్, 2004
5. డా. భార్గవీరావు. 'సాహిత్యానువాదం ఓ పరిశీలన'
6. Ed. & Tr. Velcheru Narayan Rao, 'Twentieth Century Telugu Poetry - An Anthology' OUP, 2002.

కథానిక, నవలానువాదం

డా. కె.బి. లక్ష్మి

తెలుగు భాషలోని కథలు, నవలలు అనేక భారతీయ, ఇతర భాషల్లోకి అనువాదాలుగా వెళ్లినా, ఆంగ్లంలోకి వెళ్లిన కథ, నవల ప్రక్రియలకు సంబంధించి ప్రస్తావించడమే ప్రధానంగా ఈ వ్యాస రచనకు పరిమితి. అయితే ఆంగ్లంలోకి వెళ్లిన తెలుగు కథ, నవలలకు సంబంధించి సమాచారమంతా ఒకే చోట నమోదు కానందు వల్ల, పూర్తి స్థాయి వివరాలు సక్రమ రీతిలో దఖలు కానందువల్ల లభ్యమవుతున్న కొద్దిపాటి ఆధారాలతో, ఆయా రంగాలలో కృషి చేస్తున్న వ్యక్తుల అనుభవాలను, సంభాషణల ద్వారా సేకరించిన అంశాలతో సాహిత్యానువాదంలో తెలుగు కథ, నవలానువాదాలు ఎదుర్కొంటున్న సమస్యల్లో ముఖ్యమైనవి, ప్రధానమైనవి అయిన సమస్యల్ని, పరిష్కారాల్ని పరిశీలించి మీ ముందుంచుతున్నాను.

అన్ని భాషల్లోనూ మాతృభాషలోని పదాలు, ప్రయోగాలు తగ్గి హిందీ, ఇంగ్లీషు వాడుక పెరుగుతున్నది. రచన కూడా హిందీ, ఇంగ్లీషుల్లోకి వెళ్తేనే జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు అన్న భావం ప్రబలుతోంది. అది కాదనలేని వాస్తవం కూడా. ఎప్పుడైనా అనువాదకుడి కీర్తి దేశీయ భాషలకు మరికొన్ని మెరుగులు దిద్దిడంవల్ల హెచ్చుతుంది. మాతృకలో వున్న మనోహరమైన మలుపుల్ని, వినూత్న పదప్రయోగాలను ఆంగ్లంలోకి తీసుకెళ్లగలగాలి. శబ్దాలంకారాల పట్ల, అర్థాలంకారాల పట్ల అసాధారణ మైన శ్రద్ధ ఉండాలి. సామెతలు, వక్రోక్తి, చాటువులు, సంభాషణ, కావ్యశైలి - అనువాదకుడికి సవాల్ విసురుతాయి.

కథ అయినా, నవల అయినా ప్రధాన అనువాద సమస్యలు ఇంచుమించు ఒకటిగానే వుంటాయి. కాకపోతే కథ నిడివి చిన్నది గనక, ఒక సంఘటన, సన్నివేశానికి సంబంధించి తక్కువ పాత్రలతో కథ నడుస్తుంది గనక అనువాదకుని శ్రమ పరిమితమవుతుంది.

నవల నిడివిలో పెద్దది కావడమే గాక అనేక చారిత్రక, సామాజిక, రాజకీయ,

కౌటుంబిక జీవన సమాహారం కావడం, ఫలు పాత్రలు, మలుపులు మొదలైన విభిన్న పార్శ్వాలతో కూడుకున్న వుండడం వల్ల అనువాదకునికి ఆయా నేపథ్యాలు క్షుణ్ణంగా తెలిసి ఉండాలి లేదా పరిశోధించగలగాలి.

నిజానికి అనువాదం ఒక కళే కాదు, ఒక ఛాలెంజ్ కూడా. ఒక ప్రాంతీయ భాష నుండి ఇంకొక ప్రాంతీయ భాషలోకి అనువదించడం తేలికే గాక మూలభాషకు, లక్ష్యభాషకు కూడా పూర్తి న్యాయం చేకూరే అవకాశం వుంది. అదే లక్ష్యభాష విదేశీ భాష అయ్యేటప్పటికి భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, వర్ణనలు, వావివరసల దగ్గర్నించి అన్నింటినీ సమన్వయించుకుంటూ రావాలి. లేకపోతే అసలు కథ అస్తిత్వమే దెబ్బతినే ప్రమాదం ఉంది.

భాషల మధ్య అనువాద ప్రక్రియ విజ్ఞానం విస్తరించేందుకు దోహదం చేస్తుంది. రామాయణ, మహాభారతాల వంటి పురాణేతిహాసాలను మనకు అందించింది అనువాదమే. తెలుగులోని గొప్ప రచనలు ఇతర భాషలలోకి, ముఖ్యంగా ఆంగ్లంలోకి అనువదించకపోవడం కారణంగా తెలుగు సాహిత్యానికి సరైన గుర్తింపు, రావల్సినంత గుర్తింపు దక్కడం లేదన్నది నిర్ద్వంద్వం.

భాషాసమైక్యత, సాంస్కృతిక అవగాహన, గాఢ మైత్రికి అనువాదాలు మార్గదర్శకాలు. అనువాదాలు గొప్పవా? స్వతంత్ర రచనలు గొప్పవా? అంటే మూల రచయిత, అనువాదకుల ప్రతిభావ్యుత్పత్తుల మీద జవాబు ఆధారపడి వుంది. రచయితకి, అనువాదకునికి ఒకప్పుడు సమాన ప్రతిపత్తి ఉండేది.

ఆయా భాషలతో పరిచయం, పరిజ్ఞానం లేనివారికి అనువాదాలు అటు విషయం (content), ఇటు కథా నిర్వహణ శిల్పం తెలుసుకోవడానికి ఉపయుక్తంగా వుంటాయి. అనువాదం కమ్యూనికేషన్ బ్రిడ్జి, సమాచార వారధి, ఈ వారధి ఎక్కి ఆవలి తీరం చేరాలన్న తాపత్రయం తెలుగువారికి ఉన్నంతగా తెలుగేతరులకు (తెలుగు నుండి ఆంగ్లంలోకి తీసుకెళ్లాలనుకునే ఆంగ్ల భాషా నిష్ణాతులు) వున్నట్లు కనబడదు. అందుకే ఆంగ్లంతో సహా ఇతర భాషల నుండి తెలుగులోకి దిగుమతి అయినంతగా తెలుగులో నుంచి ఆంగ్లంలోకి ఎగుమతులు అవడం లేదు. దానాదీనా అంతర్జాతీయ, జాతీయ స్థాయి గుర్తింపు కోసం తమ తమ రచనల్ని రచయితలే స్వయంగా (వీరి సంఖ్య చాలా తక్కువ) లేదా అనువాదకులుగా పేరుపడిన వారి ద్వారా అనువదింప జేసుకుని సొంత ఖర్చులతో ఆంగ్లానువాదాల్ని అచ్చు వేసుకునే పరిస్థితి ఏర్పడింది. పేరున్న రచయితల కథలు, నవలలు ఇదివరలో కంటే ఇప్పుడు కాస్త విరివిగానే ఆంగ్లంలోకి అనువాదాలు వెళ్తున్నాయి. కానీ అది చాలదు.

మరి ఈ మేరకు అకాడమీలు, పుస్తక ప్రచురణ సంస్థలు చేస్తున్న ప్రయత్నం తక్కువేమీ కాదు.

సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ (NBT), మాక్‌మిలన్, బుక్ లింక్స్, పెంగ్విన్, ఐసిసిఆర్, ఓరియంట్ లాంగ్‌మన్, కథ, స్పారో వగైరా సంస్థలు అనువాదాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాయి. విభిన్న ప్రక్రియల్లో వచ్చిన దిశానిర్దేశక రచయితల భిన్న తరహా రచనల్నే వీరు ఆంగ్లంలోకి అనువదించడానికి స్వీకరిస్తారు. వారి పరిధిలోకి, పరిమితుల్లోకి రాని రచయితలు తమ రచనల్ని ఆంగ్ల పాఠకులకి అందించాలన్న అభిలాషతో అటు ఆంగ్లానువాదం, ఇటు అచ్చు ఖర్చులు తామే భరిస్తూ సెల్ఫ్ ఇంప్రూవ్‌మెంట్ బుక్స్ (Self improvement Books)ని బుక్‌షెల్ఫ్‌ల్లోకి తీసుకొస్తున్నారు. ఇక్కడే జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది.

అసలు ఆంగ్లానువాదాలు ఎవరి కోసం? ఆంగ్ల పాఠకుల కోసమా? ఆంధ్రేతర భారతీయుల కోసమా? ఎవరి కోసమైనా సాంస్కృతిక సమస్యలు, భాషా సమస్యలు దృష్టిలో పెట్టుకుని పదగుంఫన, శైలీ ప్రత్యేకతలను పాఠకుల దృష్టికి తేవాలి. అధోజ్ఞాపికలు (Foot Notes) ఇవ్వాలి.

సాంస్కృతిక సమస్యలు, భాషా సమస్యలు అనువాదకుల్ని ఇబ్బంది పెడతాయి. సాంస్కృతిక సమస్యలు రెండు రకాలు. ఒకటి భిన్న సంస్కృతుల మధ్య ఉన్న తేడాల వల్ల వచ్చినది. రెండోది ఒకే సంస్కృతిలో భిన్న కాలాలు, భౌగోళిక పరిస్థితులు, చారిత్రక కారణాల వల్ల కనిపించే వ్యత్యాసాలు. ఇవి గాక వస్తు సంస్కృతి, సాంఘిక జీవితం, ఆచార వ్యవహారాలు, భాషలోని భావాల తీరు, శబ్దసౌందర్యం, శైలి, శిల్పం వగైరా. వీటిని నిలబెట్టుకుంటూ ఆంగ్లానువాదం సాగాలి.

తెలుగు అత్యంత పరిపుష్టమైన భాష. భాషాపరంగా నానార్థాలు, సమానార్థకాలు పుష్కలంగా ఉన్నాయి. ఉదాహరణకు 'ఎండ' అన్న ఒక్క పదం తీసుకుంటే, మనకి తెలుగులో పొడ ఎండ, పొద్దుటెండ, మండుటెండ, నీరెండ, మూగెండ ఇలా. వాళ్లకి Sun ఒకటే. ఇంకా చెప్పుకోవాలంటే సన్నీ డేస్ (sunny days).

అక్కడి వాతావరణాన్ని బట్టి మంచు ఎక్కువ గనక మనకి మంచు, చలి మంచు, పొగమంచు వుంటే దానికి రెండింతలుగా ice, snow, dew, mist, fog, frost వున్నాయి. భోజనం అంటే మనకి షడ్రసోపేతాలు, కానీ వాళ్లకి అన్నం అంటే ప్రధానంగా బ్రెడ్, సూప్, శాండ్‌విచ్‌లు.

తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువదించేటప్పుడు అనువాదకుల్ని తీవ్రంగా తికమక పెట్టేవి బాంధవ్యపదాలు. మనకి మేనత్త, మేనమామ, పిన్ని, బాబాయి, పెదనాన్న, పెద్దమ్మ, అన్న, తమ్ముడు, అక్క, చెల్లి, తోడల్లుడు, తోటి కోడలు, బావ ఇలా ఎందరో. అదే ఆంగ్లంలో అంకుల్, ఆంటీ, బ్రదర్, కజిన్. ఎంత తిప్పితే మన చుట్టాల్తో సమానం కాను? బాంధవ్య వివరణలు ఇవాల్సి వస్తుంది. లేకపోతే ఎవరికెవరు ఏమవుతారో చుట్టరికాలు తెలీక తప్పులు దొర్లుతాయి. సహజం. మక్కీకి మక్కీ తర్జుమా కాకుండా అనువాద రచనే ఒరిజినల్ ఏమో అన్నంత సహజంగా వుండేలా భాష, భావం పట్ల శ్రద్ధ వహించాలి.

ముఖ్యంగా నవలానువాదంలో కేవలం కథను చెప్పడమే గాక మూల నవలలోని శైలి, వాక్యసరళి, ఆ భాషలోని నుడికారాలు (Idioms & Phrases) అనువాద భాషలో ఒదిగేలా చూసుకోవాలి. ఆ భాషా సంప్రదాయాల్ని, ప్రాంతీయ జీవన విధానాన్ని, ఆచారాలను వగైరా తెలుసుకుని అనువాదానికి పూనుకోవాలి. అంతేగాని భాష తెలిసినంత మాత్రాన అనువాదానికి పూనుకోరాదు.

అనువాదం అనేది అసిధారా వ్రతంలాంటిది. అనువాదకుడికి వుండే స్వతంత్రం కూడా అంతంత మాత్రమే. సొంత భావాలు, అభిప్రాయాలు, అభిరుచులు పొరపాటున కూడా చొప్పించకూడదు. నిగ్రహం, చిత్తశుద్ధి వుండాలి.

మూలభాషలో భాషకు జీవం లాంటి సామెతలు, చమత్కారాలకు సమానార్థకాలు ఆంగ్లంలో దొరకడం సాధ్యం కాదు. కాబట్టి ఇంచుమించు దగ్గరగా వుండే సామెతల్ని వుపయోగించడం గాని, ఆ సామెతల భావాల్ని సహజమైన మాటల్లో మలచుకోవడం గాని చేయాలి.

వీటిని బట్టి చూస్తే మాతృభాషతో పాటు ఆంగ్లంలో కూడా ప్రావీణ్యం వున్న రచయితల స్వీయానువాదాలే ఇతరుల అనువాదాల కన్నా మూలకథకి సరైన న్యాయం చేకూరుస్తాయనిపిస్తుంది.

తన 'గాలివాన'తో తెలుగు కథకి అంతర్జాతీయ కీర్తి తెచ్చిపెట్టిన పాలగుమ్మి పద్మరాజు, వాకాటి పాండురంగారావు, ఆర్.ఎస్. సుదర్శనం, నిడదవోలు మాలతి, సత్యం మందపాటి స్వీయానువాదాలతో ఈ విషయం నిరూపించారు.

తెలుగు పాఠకులకి అనువాదాల రుచి స్వాతంత్ర్యానికి పూర్వం నుండే తెలుసు. అందుకే మన ఫిక్షన్ రుచి ఆంగ్లపాఠకులకి కూడా అందించాలనుకోవడం.

ఎర్నెస్ట్ హెమింగ్వే 1940లో 'For whom the Bell Tolls' యుద్ధ వాతావరణం నేపథ్యంలో జరిగిన ప్రేమకథ తెలుగులో 'ఘంటారావం', 1934లో వేట గురించి 'Green Hills of Africa' కి 'సముద్రంలో చేపల వేట' పేరిట చేపలవేట గురించిన తాత్విక నవల, 1954లో 'The old man and the sea' ల అనువాదాలు ప్రాచుర్యం పొంది అప్పటి రచయితల్ని ఎంతగా ప్రభావితం చేశాయంటే అలాంటి వస్తువుతో తెలుగులో సృజనాత్మక రచనలు చేసేంతగా.

పత్రికల్లో లియో టాల్‌స్టాయ్ నీతికథలు, మార్క్‌ట్వైన్ రాసిన టామ్ సాయర్ (వీక్లీ సీరియల్ – నండూరి రాంమోహన్‌రావు అనువాదం), థామస్ హార్డీ The return of the native (డి. రంగారావు అనువాదం) మొదలైనవి పాఠకులకి పరిచయం.

ప్రస్తుత పత్రికలు కూడా అనువాదానికి చోటిస్తున్నాయి. వాటిలో విపుల మాసపత్రికది అగ్రస్థానం. భారతీయ, పాశ్చాత్య భాషా కథల అనువాదాలు తెలుగులో అందించడానికి 1978 ఫిబ్రవరిలో ప్రారంభమైన విపుల భారతీయ, యూరోపియన్, అమెరికన్, ఆఫ్రికన్, ఆసియా ఖండాల వివిధ భాషల కథలు లెక్కకు మిక్కిలిగా ప్రచురించింది, ప్రచురిస్తోంది. Good, Better, Best, Poor – తరహా అనువాద సమస్యలు అక్కడా వున్నాయి. పత్రిక గనక భాషాపరంగా బాగులేని అనువాదాల్ని రీరైట్ చేసుకోవడం, అనువాదకులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి మూలకథకి అన్యాయం జరగకుండా జాగ్రత్త పడడం వుంటుంది.

సోమర్‌సెట్ మామ్, జెఫ్రీ ఆర్చర్, హిచ్‌కాక్, పెరల్ బక్, జేమ్స్ జాయిస్, ఆగాథా క్రిష్టి, ఉడ్‌హౌస్, హెమింగ్వే ఇత్యాదుల కథలు డైరెక్టుగా ఆంగ్లం నుంచి, అనుసంధాన భాషల నుంచి తెలుగు అనువాదాలుంటాయి విపులలో.

ఆర్.కె. నారాయణ్, శివ్ కె. కుమార్, రస్కిన్ బాండ్, నయనతారా సైగల్, ముల్క్‌రాజ్ ఆనంద్, ఎమ్బ్రాయస్ ప్రసాద్, కుష్వంత్‌సింగ్, శోభాడే, బుల్‌బుల్ శర్మ, ఝుంపా లహరి, వి. రంగారావు తదితర ఇండో ఇంగ్లీష్ కథల అనువాదాలు అనేకం విపులలో వచ్చాయి. ఒక విధంగా చెప్పాలంటే అనువాద సాహిత్యం ద్వారా జాతీయ సమైక్యతను, అంతర్జాతీయ అవగాహనను కల్పించే ఏకైక తెలుగు మాసపత్రిక విపుల. అటువంటి పత్రికకు 28 సంవత్సరాలు ఎడిటర్‌గా పనిచేసిన అనుభవంలో నా దృష్టికి వచ్చిన ప్రధాన అనువాద సమస్యలు అనేకం. వాటిలో కొన్ని కామెడీ ఆఫ్ ఎర్రర్స్ గంభీర పనివేళల్ని తేలికపరుస్తూ వుంటాయి.

సరదాగా కొన్ని:

అనుసృజన, స్వేచ్ఛానువాదం కాని అనువాదాల్లో కూడా పాత్రలకు పరిమితమై పనిమనిషి పాత్రకు యాసపెట్టడం వల్ల రష్యన్, ఫ్రెంచ్, ఇటలీ, ఈజిప్ట్, జపాన్, జర్మనీ, వియత్నాం, మరాఠీ, గుజరాతీ ఒకటేమిటి? ఏ మూల భాషా పనిమనిషైనా సరే కోస్తా, తెలంగాణ, రాయలసీమ యాసల్లో మాట్లాడేస్తుంది.

అలాగే ఏ భాష, ఏ నేపథ్యం, ఏ వాతావరణం నుండి మూలరచనను అనువదిస్తున్నామన్న స్పృహ లేని కారణంగా ఇంగ్లీష్ కథల, నవలల తెలుగు అనువాదాల్లో 'అల వైకుంఠపురంలో నగరిలో ఆ మూలసౌధంబు దాపల' వర్ణనలు, విదేశీ పాత్రల భోజనంలో ఆవకాయలు, ఆవ పెట్టిన పనసపొట్టు కూరలు, గుమ్మడి కాయ, మినపప్పొట్టు, ఒడియాలు వగైరా తెలుగు వంటలు వండేస్తుంటారు.

ఇక వాక్యనిర్మాణం దగ్గరికి వస్తే – 'ఇది భారవంతమైన పారదర్శకం కాని ఘనరూపంపై సూర్యుని ప్రభావం' – ఈ వాక్యానికి ఒరిజినల్ ఏమై వుంటుందో! పోనీ అర్థం ఊహించగలరా? 'ఎండగా వుంది' అని అర్థం చేసుకోగలగాలి.

ఇంకొక పదవిన్యాసం చిత్తగించండి. ఇది కథలో ఒక పేపర్ ప్రకటనకు చెందినది. 'వధువు కావలెను – పాదాలు వేళ్ల నుండి మొల వరకు వంపుసొంపుగా వుండి నిలువుగా ఊపే అందమైన వధువు కావలెను' పంక్చుయేషన్ మార్కులు లేని ఈ వాక్యం వధువు అందం కంటే ముందు పాఠకుల మతి పోగొడుతుంది.

ముచ్చటగా మూడవది – 'ఒకస్థాయిలో అతను ఈ వ్యావహారిక ప్రపంచంతో తనకున్నటువంటి కార్యకారణ సంబంధాలను వదిలించుకుని, విలక్షణమైన తేలికపాటి తనాన్ని సంవేదిస్తూ గుర్రంతో లీనమైపోయాడు'. ఈ వాక్యాడంబరానికి అర్థం 'గుర్రం మెడను కావలించుకుని వుండిపోయాడు' అని గ్రహించగలగాలి.

ఇలాంటి పొడుపు కథల్లాంటి వాక్యాలు మన తెలుగుకి సంబంధించి ఇంగ్లీష్‌లోకి వెళ్తే వాళ్లెంత నవ్వుకుంటారో! తలలు పట్టుకుంటారో కదా! అనిపించక మానదు.

అందుకే మూలరచనకి సమర్థవంతమైన అనువాదం ఉండాలి. అనువాదకుల విజయం వారి ఎంపికలో ఉంటుంది. అనువాదం కేవలం అనువాదం కోసం కాకుండా మంచి రచనను మరో భాష వారికి పరిచయం చేయాలన్న భాషాంతరీకరణ తృష్ణ అనువాదకులకి ఉండితీరాలి. రెండు భాషల మీద పట్టు, శ్రద్ధ, అవగాహన, అవలోకన, అనువాద పటిమ తప్పనిసరి అర్హతలు. అనువాదమంటే 'To change into

another language retaining the original sense' అన్న శామ్యూల్ జాన్సన్ సూత్రాన్ని తక్కువ మంది అనువాదకులే పాటించగలుగుతున్నారు.

తెలుగులో అంగ్లభాషానువాదాల ప్రభావానికి నాంది కందుకూరి వీరేశలింగం పంతులు రాజశేఖర చరిత్రనే చెప్పాలి. ఆ తర్వాత సాక్షి వ్యాసాలు పానుగంటివారివి. కందుకూరి 'వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్', పానుగంటి 'స్పెక్టేటర్', 'పిక్‌విక్ పేపర్స్' స్ఫూర్తిమంతం మాత్రమే. తెలుగు రచన అంతా తెలుగుదనం, తెలుగు నుడికారం, ఆచారాలు వగైరా ? సాగింది. గమ్మత్తు ఏమిటంటే ఆంగ్లరచన స్ఫూర్తితో వెలువడిన రాజశేఖర చరిత్ర 1874 - 76ల్లో 'Fortune's wheel' గా ఇంగ్లీషులోకి అనువదించబడింది.

రావిశాస్త్రి 'అల్పజీవి'ని కలకత్తావారు, ఇటీవల 'గోవులొస్తున్నాయి జాగ్రత్త'ను 'Beware the cows are coming' పేరిట కేంద్ర సాహిత్య అకాడమీ అల్లాడి ఉమ, శ్రీధర్ అనువాదాన్ని ప్రచురించాయి. ఉన్నవ వారి 'మాలపల్లి'కి వివిబి అనువాదం అకాడమీ పనుపున రానున్నది.

'Translation into English has also the advantage of introducing the stories to the out side world' అని తన అనువాద సంపుటాల సంపాదకీయంలో చెప్పిన కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగులో అనువాద సౌలభ్యం ఉన్న కొన్ని రచనల్ని ఆంగ్లంలోకి తీసుకు వస్తోంది. వాటిలో సమకాలీన భారతీయ సాహిత్య కృషిలో భాగంగా 'కాంటెంపరరీ ఇండియన్ షార్ట్ స్టోరీస్' శీర్షికన ప్రచురించిన మూడు సంపుటాలు ఒక్కొక్కదాంట్లో ఒక్కొక్క తెలుగు కథ ఉంది.

1959 తొలి సంపుటిలో 'ఆన్ ది బోట్' పేరుతో పాలగుమ్మి పద్మరాజు 'పడవ ప్రయాణం'కు స్వీయానువాదం.

1967 ద్వితీయ సంపుటిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'గులాబీ అత్తరు' కథకు ఆచంట జానకీరాం 'అత్తర్ ఆఫ్ రోజెస్' అనువాదం.

1988 తృతీయ సంపుటిలో ఆర్.ఎస్. సుదర్శనం 'దై విల్ బి డన్' అని తన కథని తానే ఆంగ్లంలోకి అనువదించుకున్నారు. 1995-96లో డి. రామలింగం సంకలనం చేసిన 30 తెలుగు కథలు తర్వాత ఆంగ్లంలో సంపుటిగా వచ్చాయి. అదే సంవత్సరం నవలల్లో బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' - డి.ఎస్. రావు అనువాదం, కొడవటిగంటి కుటుంబరావు 'చదువు'కు వివిబి రామారావు అనువాదం, వాసిరెడ్డి సీతాదేవి 'అడవిమల్లె'కు డి. రామలింగం అనువాదం వచ్చాయి. 2004లో సాహిత్య

అకాడమీ వేసిన ఆంగ్లానువాద కథాసంకలనం బంగారు కథ (Golden Nuggets) లో బీనాదేవి కథ 'డబ్బు' (మనీ), ఆర్. వసుంధరాదేవి కథ 'గడియారం' (వాచ్) ఉన్నాయి.

1951లో జి.వి. కృష్ణారావు నవల 'కీలుబొమ్మలు'ను డి. కేశవరావు ఇంగ్లీషులోకి అనువదించారు. 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్' (ICCR) 1977లో ఆధునిక కథల సంపుటి మాడర్న్ ఇండియన్ షార్ట్ స్టోరీస్‌లో వివిధ ప్రాంతీయ కథల అనువాదాలతో పాటు తెలుగు కథలకు ఆంగ్లానువాదాలు ప్రచురించారు. అవి 'గ్రానీ ఈజ్ డెడ్' పాలగుమ్మి పద్మరాజు స్వీయానువాదం, 'ది బర్డెన్ ఆఫ్ యాష్' ఆర్.ఎస్. సుదర్శనం కథకు యమునామణి అనువాదంతో పాటు వాకాటి పాండురంగా రావు అనువదించిన మధురాంతకం రాజారాం 'కమ్మతెమ్మెర', తిలక్ 'కదిలే నీడలు', అల్లం శేషగిరిరావు 'పులివేట', శ్రీపతి 'నత్తోడు' ఉన్నాయి.

1968లో JAICO బుక్స్‌వారు మాడర్న్ తెలుగు షార్ట్ స్టోరీస్ పేరిట ఒక కథా సంకలనం వెలువరించారు. అందులో చలం, శ్రీశ్రీ, వి.ఆర్. నార్ల, కొ.కు., భానుమతీ రామకృష్ణ, దాశరథి, పి. శ్రీదేవి, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, బుచ్చిబాబు, తిలక్, తురగా జానకీరాణి, బలివాడ కాంతారావు, వాకాటి, అరిపిరాల విశ్వం మొదలైన 31 మంది కథలకు ఆంగ్లానువాదాలున్నాయి. సంకలనకర్తలు వాడ్రేవు పతంజలి, ఎ. మురళీధర్‌ల కథలు కూడా ఉన్నాయి.

కేంద్ర సాహిత్య అకాడమీ వారి 'ఇండియన్ లిటరేచర్' 1976 జనవరి సంచికలో 'ది విలేజ్' కథ పి.వి.ఎల్. నరసింహారావు స్వీయానువాదం, 1982 మార్చి సంచికలో 'ది క్విల్టెడ్ ప్లంబర్' విరించి స్వీయానువాదం, ఇల్లిందల సరస్వతీదేవి కథకు పతంజలి అనువాదం 'డ్రీమ్స్ అండ్ ఫియర్స్' 1986లో వచ్చాయి. ఆ తర్వాత కూడా కొన్ని వచ్చాయి.

తెలుగు విశ్వవిద్యాలయం 1986లో 10 కథలతో 'ఎనదర్ బంచ్ ఆఫ్ తెలుగు షార్ట్ స్టోరీస్' అనే కథా సంకలనం వెలువరించింది. అనువాదకులు డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రి.

1991లో వాసిరెడ్డి సీతాదేవి నవల 'వెన్నెల మండుతోంది' ని 'ది బర్నింగ్ మూన్‌లైట్' పేరిట డి. రామలింగం అనువదించారు. ఇది బుక్‌లింక్స్ ప్రచురణ. 'సదరన్ వింటేజ్' పేరిట గీతాహరిహరన్ సంపాదకత్వంలో వచ్చిన కథాసంకలనంలో అల్లం రాజయ్య తదితరుల కథలున్నాయి. నేషనల్ బుక్ ట్రస్ట్ వారు ఓల్గా 'శ్వేత'

నవలకు అరి సీతారామయ్య ఆంగ్లానువాదం వేశారు. ఓల్గా 'స్వేచ్ఛ', 'రాజకీయ కథలు' కూడా సీతారామయ్య అనువాదాలుగా రాబోతున్నాయి. కథ, ప్రతిభ ఇండియా, హెచ్‌బిటి, పెంగ్విన్ ఎంపిక చేసిన తెలుగు రచనల ఆంగ్లానువాదాలు ప్రచురిస్తున్నాయి.

అబ్బూరి ఛాయాదేవి సుఖాంతం, శ్రీమతి ఉద్యోగిని, ఉడ్ రోజ్, మొగ్గ (The Tilt), తన మార్గం (ఆంగ్లం - తానా), బోన్‌సాయ్ బతుకు, స్పర్శ (Week లో వచ్చిన The touch) మొదలైన కథలు ఆంగ్లంలోకి వెళ్లడమే గాక అనేక అవార్డులు, రివార్డులు గెలుచుకున్నాయి. రాజస్థాన్ సెకండరీ స్కూల్ విద్యార్థులకి పాఠ్యాంశంగా, ఇంటర్‌మీడియట్ వారికి నాన్‌డిటైల్డ్‌గా, స్పెషల్ ఇంగ్లీష్ విద్యార్థులకి పాఠ్యాంశాలుగా గౌరవాన్ని పొందాయి. హైదరాబాద్ CIEFL వారు ఆమె కథని స్పానిష్ భాషలోకి అనువదించారు. తెలుగులో ఎంత పేరు వచ్చినా సరైన ఆంగ్లానువాదం ఉన్నప్పుడే ఇటువంటి అపూర్వ అవకాశాలు అందుకునే అదృష్టం రచయితలకి కలుగుతుందనడానికి ఆమె రచనలు ఒక ఉదాహరణ మాత్రమే.

స్వీయానువాదానికి శ్రీకారం చుట్టిన వారిలో డిటెక్టివ్ రచయిత టెంపోరావును ముందుగా చెప్పుకోవచ్చు. కొ.కు., ఇచ్ఛాపురపు జగన్నాథరావు, వంగూరి చిట్టెన్‌రాజు స్వీయానువాదాలు వెలువరించారు.

ఉమెన్ రైటింగ్ ఇన్ ఇండియా, అన్వేషి, న్యూయార్క్ ఫెమినిస్ట్ ప్రచురణలు భిన్న రచనల ఆంగ్లానువాదాలను చేపడుతున్నాయి.

వ్యక్తిగతంగా రచన సాయి, విష్ణుభొట్ల ఫౌండేషన్, జి. కృష్ణమూర్తి తదితరులు ఈ విషయకంగా కృషి చేస్తున్నారు.

ఇటీవల వెలువడిన వ్యక్తిగత ప్రచురణల్లో డి. కామేశ్వరి 'లివింగ్ టుగెదర్' (కథాసంపుటి) డి. రంగారావు అనువాదం, వాసా ప్రభావతి 'మెయిడెన్ ఫ్లైట్' – డా॥ భార్గవీరావు అనువాదం, శారదా అశోకవర్ధన్ 'ది పెరెనియల్ లైట్ అండ్ అదర్ స్టోరీస్' గోవిందరాజు రామకృష్ణారావు అనువాదం వున్నాయి. గోవిందరాజు సీతాదేవి 'లైట్ అండ్ షేడ్' (వెలుగునీడలు), 'ది పెరల్ పెలన్‌క్విన్' (ముత్యాలపల్లకి) నవలల్ని డి. రంగారావు అనువదించారు. గోవిందరాజు సీతాదేవి కథలు 'లిటిల్ ల్యాంప్ అదర్ షార్ట్ స్టోరీస్' (గోరంతదీపం) ఆంగ్లానువాద సంపుటి కూడా వెలువడింది.

ఉగాది పబ్లిషర్స్ చివుకుల పురుషోత్తం నవల 'ఏది పుణ్యం – ఏది పాపం?'ను 'సిన్నర్, సెయింట్'గా వేశారు. అనువాదం డా॥ భార్గవీరావు. ఉగాది పబ్లిషర్స్ శైలజ, ఖంగ్లా భారతి, లావణ్య – ముగ్గురు అనువదించిన ఓల్గా, జానకీబాల, పి. సత్యవతి,

శీలా సుభద్రాదేవి, కె.బి. లక్ష్మి, ఎస్. జయ, కె. నిర్మల మొదలైన 12 మంది రచయిత్రుల కథల్ని 'ఏ లాంగ్ వే' పేరిట అచ్చువేశారు.

పోలాప్రగడ సత్యనారాయణ 'కౌసల్య' నవల, పోలాప్రగడ రాజ్యలక్ష్మి 'రెల్లు పొదలు' (రీడ్ బుషెస్)లను, శ్రీలత మూడు తరాలు (త్రీ జనరేషన్స్), నవీన్ 'అంపశయ్య' (థాట్స్ ఆఫ్ లైఫ్), యద్దనపూడి సులోచనారాణి ఐదు నవలలు ఎన్.బి.టి. ప్రచురించింది. అనువాదకులు డి. రంగారావు.

విశ్వవ్యాప్తంగా అనువాదాల ఆవశ్యకతను గుర్తించిన నేటి నేపథ్యంలో వస్తున్న అనువాదాలు అంత సంతృప్తినివ్వడం లేదన్న భావనలు ఉన్నా, పత్రికలవారు రీరైట్ చేసుకునే పరిస్థితి ఉన్నా, సంస్థలపరంగా వ్యక్తిగతంగా పరిమితులు, అస్తవ్యస్తాలు ఉన్నా తెలుగు రచనలకు ఆంగ్లానువాదాలు వచ్చే తీరాలి. చేయవలసినదేమంటే ఒరిజినల్ రచనలో సత్తా లేదని, అది ఆంగ్లంలోకి రాకపోయినా నష్టం లేదని తెలిసినా ప్రలోభాలకు లొంగి అనువాదం చేపట్టకూడదు. మంచి రచనల అనువాదాలకు మార్కెటింగ్ ఉండేలా సంస్థలు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అన్నింటి కంటే ముఖ్యంగా అకాడమీలు, ప్రచురణసంస్థలు, రచయితలు సంయుక్తంగా మంచి అనువాదకులతో ఒక ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలి. పారితోషికాలు, రాయితీలు, మార్కెటింగ్ వగైరాల గురించి నిర్దిష్ట నిర్ణయాలు, తీర్మానాలు చేసుకోవడం, అనువాద సౌలభ్యం వున్న రచనల్ని, సాహిత్యపరంగా ఆంగ్ల పాఠకులు అందుకు తీరాల్సిన రచనల్ని ఎప్పటికప్పుడు ఎటువంటి లాబీలు లేకుండా ఎంపిక చేసుకోవడం, పాఠకుల అభిప్రాయాలు సేకరించి చర్చించడం తప్పనిసరిగా చేయాలి. ఏ సమస్యకైనా పరిష్కారం దాని వెంటే వుంటుంది. విజ్ఞులకి అసాధ్యమైనది ఉండదు.

'ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడూ కాదో స్థిరబిందువు. సైకత నదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు' అన్నాడు తిలక్. అది అనువాద సాహిత్యానికీ వర్తిస్తుంది.

నాటకానువాదం - ఒక పరిశీలన

డా. పి. చంద్రశేఖర్

నాటకానువాదం – ఆరంభం

నన్నయ భారతాంధ్రీకరణతో తెలుగు లిఖిత సాహిత్యం శ్రీకారం చుట్టుకుంది. తరువాత ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు వంటి రచనలు అసంఖ్యాకంగా వెలువడ్డాయి. అయితే తెలుగులో నాటక రచన కాని, నాటకానువాదం కానీ చాలా ఆలస్యంగానే ప్రారంభమైందని చెప్పాలి. కోరాడ రామచంద్రశాస్త్రి రచించిన మంజరీ మధుకరీయము (1860)తో తెలుగు నాటక రచనకు నాంది వాక్యం పలకడమైంది. అయితే అటు సంస్కృతం నుండి కాని, ఇటు ఆంగ్లం నుండి కాని నాటకానువాదాలు తదనంతర కాలంలోనే జరిగాయని చెప్పాలి. సంస్కృతంలో వ్యాయోగ రూపంలో వారణాసి ధర్మసూరి (15వ శతాబ్దం చివర, 16వ శతాబ్దం ఆరంభం) రచించిన 'నరకాసుర విజయము'ను 'నరకాసుర విజయ వ్యాయోగము' (1871)గా కొక్కొండ వెంకటరత్నం (1842 – 1915) తెలుగులో నాటకానువాదానికి తెర తీశారు. ఈ దశలో వేణీ సంహారమ్ (1886), చండ కౌశికమ్ (1900)ను వడ్డాది సుబ్బారాయుడు (1855 – 1938), ఉత్తర రామచరిత్ర (1889)ను వావిలాల వాసుదేవ శాస్త్రి (1851 – 1897), ముద్రారాక్షసమ్ (1890) ను సుసర్ల వసంతరావు, మృచ్ఛకటికమ్ (1890)ను తిరుపతి వేంకటకవులు, నాగానందమ్ (1891) ను వేదం వేంకటరాయ శాస్త్రి (1853 – 1929) మహావీర చరిత్ర (1902) ను దాసు శ్రీరాములు (1846 – 1908) సంస్కృతం నుండి నాటకాలను తెలుగులోకి అనువదించారు. సంస్కృతం లోని శ్లోకాలను తెలుగులో పద్యాలుగా కొక్కొండ వెంకటరత్నం అనువదించారు. తరువాతి నాటకానువాదకులు ఇదే పద్ధతిని పాటించారు.

ఆంగ్లం నుండి తెలుగులోకి నాటకానువాదం 1875వ సంవత్సరం నాటికి సిద్ధించింది. అందులో ఆంగ్ల భాషలో షేక్స్పియర్ రచించిన 'జూలియస్ సీజర్'ను 'సీజర్ చరిత్రము' (1875) గా వావిలాల వాసుదేవశాస్త్రి (1851 – 1897) అనువదించి తెలుగు నాటకానువాదానికి మార్గం వేశారు. షేక్స్పియర్ రచించిన 'మర్చెంట్ ఆఫ్ వెనిస్'ను 'వెనీస్ వణిజ నాటకము' (1880)గా గురజాడ శ్రీరామమూర్తి (1851 – 1899) అనువదించారు. ఈ నాటకం పేరును 'వెనిసు వర్తకుని చరిత్ర' అని ప్రొఫెసర్ జి. యన్. రెడ్డి పేర్కొన్నారు.

ఇంగ్లీషు నుండి తెలుగులోకి వచ్చిన నాటకాలు

ఆంగ్లం			తెలుగు		
	ఆంగ్ల నాటకం పేరు	రచయితపేరు	తెలుగు నాటకం పేరు	అనువాదకుని పేరు	సంవత్సరం
1.	Julius Caesar	Shakespeare	జూలియస్ సీసర్ (అ.వా)	వావిలాల వాసుదేవశాస్త్రి	1876
2.	Merchant of Venice	Shakespeare	వెనిసు వర్తకుని చరిత్ర (అ.స.)	కందుకూరి వీరేశలింగం	1880
3.	Merchant of Venice	Shakespeare	వెనిసు వర్తకుని చరిత్ర (అ.వా.)	గురజాడ శ్రీరామమూర్తి	1880
4.	Duenda	Sheridan	రాగమంజరి (అ.స.)	కందుకూరి వీరేశలింగం	1885
5.	The Rivals	Sheridan	కల్యాణ కల్పవల్లి (అ.స.)	కందుకూరి వీరేశలింగం	1885
6.	Othello	Shakespeare	జయద్రథ నాటకము (అ.స.)	కె. పద్మనాభరాజు	1894
7.	Macbeth	Shakespeare	మాక్బెత్తు (అ.వా.)	ఎస్.ఆర్. కృష్ణమ్మ	1895
8.	Cymbeline	Shakespeare	ఖండిత మాత్సర్యము (అ.స.)	వెంకటనరసింగరావునాయుడు	1898
9.	Cymbeline	Shakespeare	సుసేన విజయము (అ.స.)	హనుమంతరావు	1898
10.	Pericles	Shakespeare	శ్రీ రాఘవేంద్ర విజయము (అ.స.)	భావనారాయణ	1899
11.	The Tempest	Shakespeare	మాలతి వసంతము (అ.స.)	టి.వి. వెంకటాచలం	1899
12.	School for scandal	Sheridan	అపవాద తరంగిణి (అ.స.)	కె.ఆర్.వి. కృష్ణారావు	1900
13.	All is welll that ends well	Shakespeare	సౌందర్య సతీమణి (అ.స.)	భావనారాయణ	1904
14.	Merchant of Venice	Shakespeare	వణిక్పుర వర్తకోదంతము (అ.స.)	టి. సూర్యనారాయణరావు	1906
15.	King Lear	Shakespeare	ప్రళయాంతకరాజు (అ.స.)	పరమహంస విద్యానాథ స్వామి	1907

16.	The Tempest	Shakespeare	అద్భుత సుందరి లేదా ఝంఝూ మారుతము (అ.స.)	పరమహంస విద్యానాథస్వామి	1907
17.	Othello	Shakespeare	పుళింద సుశీలము (అ.స.)	సిహెచ్. శ్రీనివాసరావు	1908
18.	As you like it	Shakespeare	శ్రీ సరోజిని (అ.స.)	టి. వెంకటాచలం	1910
19.	King Lear	Shakespeare	చిత్రకేతు చరిత్ర (అ.స.)	కందుకూరి వీరేశలింగం	1910
20.	Twelfth Night	Shakespeare	మోహినీ మనోహరము (అ.స.)	శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి	1910
21.	Pericles	Shakespeare	వీరసేన విజయము (అ.స.)	శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి	1910
22.	Othello	Shakespeare	ముగ్ధ ప్రణయము (అ.స.)	కార్లపాకం లక్ష్మీనరసింగరావు	1934
23.	Romeo and Juliet	Shakespeare	ప్రణయాదర్శము (అ.స.)	కృష్ణారావు	1943
24.	Twelfth Night	Shakespeare	ద్వాదశయామిని (అ.స.)	పానుగంటి లక్ష్మీనరసింహారావు	1943
25.	Comedy of Errors	Shakespeare	సరస్వతి నాటకము (అ.స.)	పానుగంటి లక్ష్మీనరసింహారావు	1943
26.	King Lear	Shakespeare	కన్నతండ్రి (లేదా) నన్నెచోడభూపాలీయము (అ.స.)	పానుగంటి లక్ష్మీనరసింహారావు	1933
27.	Hamlet	Shakespeare	సంకల్ప విలంబము (అ.స.)	పానుగంటి లక్ష్మీనరసింహారావు	1933
28.	Henry IV	Shakespeare	నరసభూపాలీయము (అ.స.)	పానుగంటి లక్ష్మీనరసింహారావు	1933
29.	Henry V	Shakespeare	కృష్ణదేవరాయ విజయము (అ.స.)	పానుగంటి లక్ష్మీనరసింహారావు	1933
30.	The Taming of the Shrew	Shakespeare	కలహరి ప్రియ (అ.స.)	పానుగంటి లక్ష్మీనరసింహారావు	1933
31.	The Brand	Ibsen	భీష్ముడు (అ.స.)	పాణకా పిచ్చిరెడ్డి	1933

అ.వా. : అనువాదం, అ.స.: అనుసరణ

నాటకానువాదంపై అభిప్రాయాలు

"నాటకాన్ని నాటక రూపంలో అనువదించవచ్చు లేదా నాటకాన్ని కథా రూపంగా కావ్యరూపంగా అనువదించవచ్చు. అయితే నాటకం పాఠ్యమే కాకుండా అభినయం కూడా. కాబట్టి ప్రదర్శనకు అనుకూలంగా అనువాదం సాగితే బాగుంటుంది. అనువాదానికి స్టేజి క్రాఫ్టు (Stage craft)ను గురించిన జ్ఞానం ఉండాలి. అప్పుడే నాటకాన్ని నాటక రూపంలో అనువదించినప్పుడు అది పాఠకుణ్ణే కాకుండా ప్రేక్షకుణ్ణి కూడా ఆకట్టుకుంటుంది" అని ఆచార్య భీంసేన్ నిర్మల్ (2000: 25) తెలిపారు. అంతేకాక "నాటకానువాదానికి కొన్ని విశిష్ట సమస్యలున్నాయి. ఎందుకంటే నాటకం పాఠ్యమే కాక ప్రదర్శనయోగ్యతను కూడా కలిగి ఉంటుంది. నాటకంలో సంభాషణలు ప్రథమ స్థానం వహిస్తాయి. ఈ సంభాషణలు భావగాంభీర్యంతో కూడి శబ్ద చమత్కారం కలిగి ఉంటాయి. ఆ సంభాషణావైచిత్రి సామాజికులను (ప్రేక్షకులను) ఆకట్టుకుంటుంది. కాబట్టి నాటకానువాదంలో ఈ సంభాషణావైచిత్రి ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అనువాదకుడు ఈ విషయాన్ని గ్రహించి, ఒక వైపు రంగస్థలాన్ని (Stage) మరొకవైపు ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకొని అనువాదం సాగించాలి" అని ఆచార్య భీంసేన్ నిర్మల్ (2000: 39/40) తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు.

"ఆచారవ్యవహారములును పేరులును దేశములును మనవారికి వింతగాఁ గానఁబడును గాన కేవల మూలార్థానుసారముగా భాషాంతరీకరింపబడిన పాశ్చాత్య గ్రంథములు మనవారికంతగా రుచింపకపోవచ్చును" అని వీరేశలింగం పంతులు తెలిపారని ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు (1986: 582) పేర్కొన్నారు. "నాటక కథలను నేను (వీరేశలింగము పంతులు) తెలిగించునప్పుడు మునుపున్న పేరులకు మాఱుగా మనదేశపు పేరులు పెట్టి అందున్న దేశములను మన భారతఖండములోని దేశములనుగా మార్చి, కథలో మన యాచారవ్యవహారములకు బ్రతిరూపముగా నుండునట్లు వ్రాసితిని" అని కూడా వీరేశలింగం పంతులు వెల్లడించారని ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు (1986: 582) తెలిపారు.

జూలియస్ సీజర్ - అనువాదరీతులు

ఆంగ్లం నుండి తెలుగులోకి అనువదించిన నాటకాలను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి: 1. పద్యంలోకి అనువదింపబడినవి. 2. పద్యం - వచనంలోకి అనువదింపబడినవి. 3. వచనంలోకి మాత్రమే అనువదింపబడినవి. అయితే

అనువాదాన్ని మూడు విధాలుగా విభజించవచ్చు. అవి: 1. అనువాదం (Translation) 2. అనుసరణ (Adaption) 3. అనుసృజన (transcreation).

ఆంగ్లం నుండి తెలుగులోకి అనువదింపబడిన నాటకం శ్రీ సీజరు చరిత్రము. 1876లో దీనిని రాజమండ్రి కళాశాలలో ఇంగ్లీషు అసిస్టెంట్ టీచరుగా పనిచేస్తున్న వావిలాల వాసుదేవశాస్త్రి (1851 – 97) పద్యరూపంలో రచించారు. దీనికి మూలం ఆంగ్లంలో షేక్స్పియర్ రచించిన జూలియస్ సీజర్ నాటకం. దీని పీఠికలో –

"I believe this is the first attempt at translating an English drama into the corresponding Telugu metre. Therefore it is very necessary that I should be careful in selecting Telugu words for the English proper names. I have tried to change them as little as possible, and at the same time to adopt them to suit Telugu tongue, subject through out to the requirements of metre. The metre that is adopted is Tetagiti in which each line is independent and consists of *five ganas*. Thus I say, it corresponds to the English iambic, where each line is composed of five feet and it is in this metre only that all the English plays are written. As in almost all Telugu works, the different kinds of metre - both fixed and variable - are found to be grouped together. I must confess this to be an innovation brought onto the field of Telugu literature, but I may rest assured that this is no breach of Telugu prosody. More over, this is the advice I received from many friends of mine. I have done my best to introduce Hindu customs and manners where I could, but the advice of some to displace Roman manners all together came to me after I had given the matter to the press. If it be found practicable, I shall try to do so in the second edition. Unfortunately I finished the translation in less than two months, and consequently, errors of different kinds may have crept in to this volume for which excuse I crave the indulgence of the critic. Any suggestions from learned hand as to the improvement of this will be thankfully received. I stand under great obligation to M.R. Ry.C. Soobbbarayalloo Naidu garu for the trouble has taken in correcting the proof sheets as come out from the press."

4th January 1875 **V.V. Sastry**
Rajamundry
Innespetah

అని తెలిపారని ప్రొఫెసర్ జి.యన్. రెడ్డి (1988: 118 - 119) పేర్కొన్నారు.

తెలుగు పీఠికలో ఆంగ్ల పీఠికలోని విషయాన్ని దాదాపుగా అనువాదరూపంలో తెలియబరిచారు. అది -

"ఆదిని లాఁతి తెలుగుఁ బొత్తంబులవలెనే దీని నానా విధ వృత్తములలోఁ బ్రబంధ కవితని రచియింప దలంపు గలిగె, కాని యిప్పటి వారికి నాటక రీతి యందే యభిరుచి యెక్కువ యని కొందరు నా స్నేహితులు సలహా యిచ్చిన కతనఁ దొంటి యభిప్రాయము మాయించి నాటక వైఖరిని మొదటి నుండి తుదివరకు తేటగీతినే వ్రాయుట తగునని యెంచి యీ తీరున వ్రాసినాడ... ఇందు జాల భాగమాంగ్ల భాషాగ్రథితమగు విల్లియము షేక్స్పియరు ప్రణీత గ్రంథముననుసరించియే వ్రాయంబడియెను. గాని ప్రకరణానుకూలముగా నచ్చటచ్చటఁ గొంత చేర్పఁబడె. ఆంగ్లేయ సంజ్ఞాపదంబులకు గా నిందు వాడంబడ్డ వివిధ రూపములతో నొక్క పట్టిక దీని చిట్టచివరనను బంధింపబడెను. దుర్జ్ఞేయాభిప్రాయముల పట్ల రివరెండు - జే - హంటరుగారి టిప్పణములు చూచినాఁక ... సెప్టెంబరు నెల 12 తేది అనగా 1875 సం॥ వావిలాల వాసుదేవ శాస్త్రి" అని కొత్తపల్లి సుబ్బారావు (1960/ 1986:452) తెలిపారు.

ఆంగ్లంలోని నాటకాలను తెలుగులోకి అనువదించడానికి వావిలాల వాసుదేవ శాస్త్రి శ్రీకారం చుట్టారు. కావున ఆయన కొన్ని విధాలైన సమస్యలను ఎదుర్కొన్నారు. వాటిని ఇతివృత్తానికి సంబంధించినవి, భాషకు సంబంధించినవి అని విభజించ వచ్చును.

వావిలాల వాసుదేవశాస్త్రి అనువాదంలో కొంత స్వతంత్రతను ప్రకటించారు. నాటకాన్ని 'తేటగీతి'లోకి అనువదించారు. 'గణము' కోసం, యతుల కోసం వ్యర్థ పదాలను ప్రయోగించారు. కాని లక్ష్మీకాంతమోహన్ మాత్రం జూలియస్ సీజర్ (1961) నాటకాన్ని తెలుగు వచనంలో రచించారు. కాబట్టి సాఫీగా సాగిందని చెప్పాలి. నాటకంలోని పేర్లను అనువదించడాన్ని చూద్దాం.

లిప్యంతరీకరణ

షేక్స్పియర్	**వావిలాల వాసుదేవశాస్త్రి**	**లక్ష్మీకాంతమోహన్**
జూలియస్	జూలియసుఁడు	జూలియస్
బ్రూటస్	బ్రూటసుఁడు	బ్రూటస్

వాసుదేవశాస్త్రి ఆంగ్ల పదాలకు కూడా ఉత్వదుజ్‌లు చేర్చి జూలియసుఁడు, బ్రూటసుఁడు అని లిప్యంతరీకరిస్తే, లక్ష్మీకాంతమోహన్ జూలియస్, బ్రూటస్‌గా హలంతంగా లిప్యంతరీకరించారు.

Cassius: "He had a fever when he was in Spain
And when the fit was on him, I did mark
How he did shake: it's true, this God did stake;
His coward lips did from their colour fly;"

(Julius Caesar. Act I, Scene 2 p 602)

"స్పెయినులో నున్నయప్పుడు సీజరునకు
జ్వరము దగిలెను; నాతెఱ వచ్చినప్పుడు
కడఁగి చూచితి నాతఁడు వడఁకుడెల్ల;
వడఁకినాఁడప్పుడిట్టి దేవుఁడును గూడ;
నతని పిఱికి పెదవులు డాలఱచుఁ బుంచె"

(వావిలాల వాసుదేవశాస్త్రి)

కేసి: అతడు స్పెయిన్‌లో వున్నప్పుడు అతడికి జ్వరం వచ్చింది. జ్వరంగా తీవ్రంగా వున్నప్పుడు అతడెలా వణికి పోయాడో నేను గుర్తించాను. నిజం అట్లా దేవుడు వణికిపోయాడు. అతడి పిరికి పెదిమలు భయంతో తెల్లబడినాయి.

(లక్ష్మీకాంత మోహన్, 1961:9)

Brutus: ....
It is the bright day that brings forth the adder
And that craves wary walking. Crown him; that!
And then I grant we put a sting in him
That at his will he may do danger with.

(Act 2, Scene 1; 1998: 606)

"బ్రూట: ముసురు విరిసినఁ గాదె, పాములు చెలంగి
కదలఁ బ్రాకుఁచుఁ, బరికించి నడువఁగోరు
అతనికిఁ గిరీటమిత్తమా? - యద్ది యగును;
తోనె యాతఁడు తనకిష్టమైన యట్టు
కుట్టి చంపంగ నిమిత్తము కొండి, నిజము"

(వావిలాల వాసుదేవశాస్త్రి)

బ్రూటస్: .... పగటి పూటనే విషసర్పం బైటికొస్తుంది; అప్పుడే జాగర్తగా చూసి నడవాలి. అతడికి కిరీటం యిస్తే తన యిష్టం వచ్చినట్లు కరవడానికి విషపు కోరలు తగిలించినట్లే.

(లక్ష్మీకాంతమోహన్, 1961: 27, అంకం 2, రంగం 1)

Portia: ....? No, my Brutus,
You have some sick offence within your mind,
which by the right and virtue of my place
I ought to know of (kneeling)...
(Act 2, Scene 1, 1998: 608)

"కాదు మామక బ్రూటసా మీదు మనము
నేదో వ్యథ పెట్టుచున్నది, యింత నిజము
అదియు మత్ప్రస్తుత పదంపు హక్కు చేత
గట్టిగా నేను వినఁదగినట్టిదేను"
(వావిలాల వాసుదేవ శాస్త్రి)

పోర్షియా: లేదు, నా ప్రియ బ్రూటస్. మిమ్మల్నేదో మహా వ్యాధి పట్టి పీడిస్తూంది. అదేమిటో తెలిసికొనే హక్కు మీ భార్యనైన నాకు వుంది. మీకు మోకరిల్లి వేడుకొంటున్నాను.

(లక్ష్మీకాంతమోహన్, 1961: 39, అంకం 2, రంగం 1)

Brutus: (coming forward and kneeling)
I kiss thy hand, but not in flattery, Caesar;
Desiring thee that publius Cimbar may
Have an immediate freedom of repeal
(Act 3, Scene 1, 1998: 612)

బ్రూట: "సీజరా పెట్టుదు నీదు చేత ముద్దు
కాని, యిద్ది ముఖప్రీతి గాదు సుమ్మి
పబ్లియసు సింబరునకు నేర్పడ్డ యన్య
దేశగమన దండనమును దీసివేయ
వెంటనే మిమ్ము వేడుచుంటి"
(వావిలాల వాసుదేవశాస్త్రి)

బ్రూటస్: మీ హస్తాన్ని ముద్దాడుతున్నాను, సీజర్. అయితే ముఖస్తుతితో గాదు; వినయంతో, ప్రేమతో. పబ్లియస్ సింబర్ మీదున్న బహిష్కరాజ్ఞను వెంటనే ఉపసంహరించ గోరుతున్నాను.

(లక్ష్మీకాంతమోహన్, 1961: 55, 3వ అంకం, మొదటి రంగం)

Antony: ....
Pardon me, Julius. Here wast than bayed,
brave heart;

Here didst thou fall, and here thy hunters stand
signed in thy spoil and crimsoned in thy lethe

(Act 3, Scene 1, 1998: 613)

"అరసి క్షమియింపుమీ జూలియసుఁడ నన్ను
ధీర సారంగ యిట నొరుఁ జేరనీక
పోరి పోరి తుదకు నిట్లు దోరితీవు;
చేర్చుకొని మీదు కొల్లలే చిహ్నముగను
మీదు నెత్తుట వెలువడ్డ మేనులొప్ప
వేఁటరులు నిలుచున్నారు వీరె యిచట"

(వావిలాల వాసుదేవశాస్త్రి)

ఆంటనీ: .... క్షమించు, జూలియస్! వీరుడా, నీవిక్కడ వేటాడబడి చంపబడ్డావు! నీవిక్కడ రాలిపోయావు. నీ రక్తంతో కళంకితులై నిన్ను వేటాడినవాళ్లు యిక్కడ నిలబడ్డారు.

(లక్ష్మీకాంతమోహన్, 1961: 62, 3వ అంకం, మొదటి రంగం)

నుడికారాత్మక అనువాదం

Murellus: ....

"what dost thou with my best apparel on?"

(Act 1, Scene I, 1998: 601)

"పరుగు పరుగున మడుఁగు దోవతులు గట్టి (వావిలాల వాసుదేవశాస్త్రి)

"అలా కొత్త బట్టలు కట్టుకొని యిక్కడేం చేస్తున్నావూ?"

(లక్ష్మీకాంతమోహన్, 1961: 1, మొదటి రంగం)

Murellus: "Pray to the Gods to intermit the plague"

(Act 1, Scene 1, 1998: 601)

"తేర్చి కొండయన్ ముక్కోటి దేవతలను..." (వావిలాల వాసుదేవశాస్త్రి)

"... మహమ్మారిని కొంతకాలం పాటు రాకుండా చేయమని దేవతలకు మోకరిల్లి ప్రార్థించండి.

(లక్ష్మీకాంతమోహన్, 1961:3, మొదటి అంకం, మొదటి రంగం)

Casca: Look in the Calendar and bring me word.
(Act 1, Scene 3, 1998: 604)

"…. పంచాంగమరసి, చెప్పుమీ తప్పదికది నాకు"

(వావిలాల వాసుదేవశాస్త్రి)

బ్రూటస్: పంచాంగం చూసి నాకొచ్చి చెప్పు.

(2వ అంకం, 1వ రంగం, లక్ష్మీకాంతమోహన్, 1961:29)

Casca: Your ear is good. Cassius, what night is this?
(Act 1, scene 3, 1998: 604)

పాము చెవులు నీవి …

(వావిలాల వాసుదేవశాస్త్రి)

"నీకు వినికిడి శక్తి బాగా ఉంది. అబ్బా, యిదేమి రాత్రి కేషియస్!"

(మొదటి అంకం, 3వ రంగం, లక్ష్మీకాంతమోహన్, 1961:21)

Cassius: "I think we are too bold upon your rest
Good morrow, Brutus. Do we trouble you"

"…. మేము సెడగొట్టితిమి బోలు నీదు నిదుర
ప్రొద్దునే నీకు శుభమస్తు, బ్రూటసుండ"

(వావిలాల వాసుదేవశాస్త్రి)

కేషియస్: మేమిలా నీ నిద్రాసమయంలో రావడం చాలా సాహసమనుకొంటాను. ఉదయాభివందనాలు, బ్రూటస్. మేము నీకు ఇబ్బంది కలిగించలేదు గదా?

(2వ అంకం, 1వ రంగం, లక్ష్మీకాంతమోహన్, 1961: 31)

Decius: … great Caesar! (Act 3, Scene 1, 1998: 612)

"డేసిథియస్ – సీజరేంద్ర!" (వావిలాల వాసుదేవశాస్త్రి)

డెసి: వీర సీజర్ (3వ అంకం, 1వ రంగం, లక్ష్మీకాంతమోహన్, 1961: 56)

Antony: O mighty Caesar! (Act3, Scene 1, 1998: 613)

సర్వశక్తి మత్సీజరేంద్ర! (వావిలాల వాసుదేవశాస్త్రి)

అంటనీ! ఓ వీర సీజర్!… (3వ అంకం, 1వ రంగం, లక్ష్మీకాంతమోహన్, 1998: 60)

First Plebeian: We'll burn the house of Brutus.

(Act 3, Scene 2, 1998: 616)

"బ్రూటసుని యిల్లు పరశురాముని కిడుదము" (వావిలాల వాసుదేవశాస్త్రి)

మొదటి: బ్రూటస్ యిల్లు తగలబెడదాం

(3వ అంకం, 2వ రంగం, లక్ష్మీకాంతమోహన్, 1998: 77)

First Plebeian: ... Take up the body.

(Act 3, Scene 2, 1998: 617)

"... పట్టుడీ యేడు కట్లసవారినెత్త" (వావిలాల వాసుదేవశాస్త్రి)

మొదటి: ... యెత్తుకోండి శవాన్ని!

(3వ అంకం, 2వ రంగం, లక్ష్మీకాంతమోహన్, 1998: 78)

పై రెండు అనువాదాల్లో వావిలాల వాసుదేవశాస్త్రి తెలుగు నుడికారాత్మకంగా అనువదించడం జరిగింది. ఆంగ్లంలోని భావాన్ని గ్రహించి, తెలుగు నుడికారం అంటే జాతీయాలు, సామెతలు, సూక్తులు, అలంకారాలువంటి వాటిని ప్రయోగించి రచనకు కొంత శోభను చేకూర్చాడని చెప్పవచ్చు.

Shakespeare: best apparels

వావిలాల వాసుదేవ శాస్త్రి: మడుగు ధోవతులు

లక్ష్మీకాంతమోహన్: కొత్త బట్టలు

Shakespeare: Gods

వావిలాల వాసుదేవ శాస్త్రి: ముక్కోటి దేవతలు

లక్ష్మీకాంతమోహన్: దేవతలు

Shakespeare: great Caesar

వావిలాల వాసుదేవ శాస్త్రి: సీజరేంద్ర

లక్ష్మీకాంతమోహన్: వీర సీజర్

Shakespeare: migty Caesar

వావిలాల వాసుదేవశాస్త్రి: సర్వశక్తి మత్సీజరేంద్ర

లక్ష్మీకాంత మోహన్: వీర సీజర్

Shakespeare: burn

వావిలాల వాసుదేవ శాస్త్రి: పరశురామునికిదుదుము

లక్ష్మీకాంతమోహన్: తగులబెడతాం

Shakespeare: take up the body

వావిలాల వాసుదేవశాస్త్రి: యేదుకట్ల సవారీనెత్త

లక్ష్మీకాంతమోహన్: ఎత్తుకోండి శవాన్ని.

మొదలైన సందర్భాలలో వాసుదేవశాస్త్రి తెలుగు నుడికారాన్ని ప్రయోగించి పఠనకు ఇష్టాన్ని కల్పించాడు. అంతే కాక రచన అనువాద రచన అనిపించకుండా జాగ్రత్త పడ్డాడు.

కన్యాశుల్కము - అనువాద రీతులు

భారతీయ భాషలనుండి అంటే తెలుగు, తమిళం, హిందీ, పంజాబీ వంటి భాషల నుండి ఇంగ్లీషులోకి అనువదించేటప్పుడు ఆ గ్రంథాల పాఠకులను దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. అనువాదం తెలుగు నుండి ఇంగ్లీషులోకి చేస్తున్నాం అనుకుందాం. అప్పుడు ఇంగ్లీషు అనువాదం తెలుగు తెలియని భారతీయులకా? లేక తెలుగు తెలియని (ఉప) ఖండేతర పాఠకులకా? అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. భారతదేశం, భారతీయ సంస్కృతి ఏకత్వంలో భిన్నత్వాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగి ఉంది. అంతే కాక దాదాపుగా అన్ని భారతీయ భాషల్లోకి కొద్దో గొప్పో సంస్కృత పదాల ఆదానం జరిగింది. భారతీయ సంస్కృతిలోని అనేక భావనలు - మూర్తం, అమూర్తం - సమానంగా ఉంటున్నాయి. ఆయా భావనలు తెలియజేసే పదజాల శబ్దరూపం కూడా దాదాపు అన్ని భాషల్లోనూ విస్తరించి ఉంది. అందువల్ల ఇంగ్లీషు అనువాదంతో ఆయా పదాలను లిప్యంతరీకరించి ఇవ్వవచ్చు. వాటికి వివరణ దాదాపుగా అవసరం ఉండదు. అందువల్ల తెలుగులోని రచనలను తెలుగు తెలియని భారతీయుల కోసం ఇంగ్లీషులోకి అనువదించడం కొంత సులభంగా ఉంటుంది.

తెలుగు రాని (ఉప) ఖండాంతర పాఠకులకు ఇంగ్లీషులోకి అనువదించి నప్పుడు ఎక్కువ కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ పాఠకులకు తెలుగు సంస్కృతి, తెలుగు సాహిత్యం తీరుతెన్నులు తెలియవు కాబట్టి అనువాదంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంటుంది.

కన్యాశుల్కము నాటకంలోని కొన్ని పదాలను ఇంగ్లీషులో ఇటాలిక్స్‌లో ఇవ్వడమైంది. 'కన్యాశుల్కము'లో ఇంగ్లీషు పదప్రయోగం ఎక్కువగా ఉంది. అటువంటి పదాలను ఎస్.ఎన్. జయంతి ఆంగ్లంలో క్యాపిటల్ లెటర్స్ (పెద్దక్షరాలు)లో ఇవ్వడం

జరిగింది. ఉదా: "THE ELEVEN CAUSES FOR THE DEGENERATION OF INDIA" ఎస్.ఎన్. జయంతి (1964:2). అయితే ఇదే నాటకాన్ని అనువదించిన విజయశ్రీ, టి. విజయకుమార్ మాత్రం ఆ భాగాలను ఆంగ్లంలో బోల్డ్ లెటర్స్‌లో ఇవ్వడం జరిగింది. **"The Eleven causes for the degeneration of India"** ఇదే విధంగా ఈ అనువాదకులు అనువదించడం జరిగింది.

తెలుగు నాటకంలోని తత్సమ, తద్భవ పదాలను, సంజ్ఞా వాచకాలు (proper nouns)ను ఇటాలిక్స్‌లో ఇచ్చి, వాటి వివరణను పుస్తకం చివరలో ఇచ్చారు ఎస్.ఎన్. జయంతి. ఉదాహరణకు *Sishya* (శిష్య), *Bengali, Soota* వంటి పదాలను ఈ విధంగా తెలిపారు.

Sishya is a typical word for which there is no correct English synonym. Roughly it means a disciple. But nowadays it is loosely used to denote a student also. ఇంకా చాలా వివరణ ఇవ్వడం జరిగింది. (ఎస్.ఎన్. జయంతి, 1964: 214)

Suta was an ancient sage who was not only well versed in the sacred scriptures, but also in narrating and propagating them (ఎస్.ఎన్. జయంతి. 1964:214)

'కన్యాశుల్కము'లోని పదాలను అనువదించిన విధానాన్ని పరిశీలిద్దాం. ఈ అంశంలో అనువాదకులు ఒకే పద్ధతిని పాటించలేదు. వారు వేరు వేరు పద్ధతులను పాటించారు. పద్యాలను లిప్యంతరీకరించి ఎస్.ఎన్. జయంతి ఇచ్చారు. అయితే దీనికి భిన్నంగా ఆ పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి సి. విజయశ్రీ, టి. విజయకుమార్ ఇచ్చారు. ఉదా:

Khagapathi Amruthamu thega
Bhugabhugamani pongi chukka Bhumin valen
poga chuttai genminchenu
Poga thaganivadu dunnapothai puttun

(S. N. Jayanthi)

అయితే దీని భావాన్ని పుస్తకం చివరలో పాదసూచికగా ఇంగ్లీషులో ఇవ్వడం జరిగింది. అది:

"When the lord brought the nector pot
Bubbling and boiling a drop on earth did land
And at that spot did sprout the tobacco plant

One that doesn't smoke is sure to be reborn a
complete dud"

(S.N. Jayanthi)

"When the lord of garuda brought nector
It bubbled over and a drop fell on the earth
It took birth as a tobacco plant
The non - smoker will be reborn as a buffalo!"

(సి. విజయశ్రీ, టి. విజయకుమార్, 2002:3)

పై రెండు అనువాదాలు ఒకే రీతిలో లేవనే విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఈ రెండు అనువాదాల్లో కొన్ని పదాలు ఒకే విధంగా ఉన్నాయి. కొన్ని పదాలు ఒకే విధంగా లేవు.

గురజాడ	ఎస్.ఎన్. జయంతి	విజయశ్రీ, విజయకుమార్
అమృతము	Nector	Nector
పొగ చెట్టు	tobacco plant	tobacco plant

పై రెండు సందర్భాల్లోనూ రెండు అనువాదాల్లో ఒకే పదాన్ని ప్రయోగించడమైంది.

గురజాడ	ఎస్.ఎన్. జయంతి	విజయశ్రీ, విజయకుమార్
పొగతాగనివాడు	one that doesn't smoke	non - smoker
దున్నపోతు	buffalo	complete dud

పై సందర్భాల్లో అర్థం ఒకటే అయినా అభివ్యక్తి తీరులో మార్పు వచ్చిందని తెలుస్తుంది.

అనువాదాల్లో కూడా కొన్ని సందర్భాల్లో ఒకే పదాన్ని వాడటం జరిగింది. అవి:

గురజాడ	ఎస్.ఎన్. జయంతి	సి. విజయశ్రీ, విజయకుమార్
చుట్ట/సిగార్	Sigar	Sigar
జంఝాలు	Sacred thread	sacred thread
పజ్యండు	dozen	dozen
పింతల్లి కొడుకు	cousin	cousin
కోనేరు	Temple pond	Temple pond
అప్ప	elder sister	elder sister

మహాస్త్రం	Weapon	Weapon
వేదం	Veda	Veda
జాఫరు కట్ట	Broom stick	Broom stick
నాలుగష్టకాలు	Four astakas	Four astakas
రాచకార్యం	important problem	important problem

పై అభివ్యక్తులన్నీ సాధారణమైనవే. అందువల్ల అనువదించటానికి అంత పెద్దగా కష్టపడాల్సిన అవసరం రాలేదు.

నుడికారాత్మకం – జాతీయాలు, సామెతలు, లోకోక్తులు అయిన రచనను అనువదించడం కష్టంతో కూడుకున్న పని. అందువల్ల అటువంటి సందర్భాల్లో వైవిధ్యం చోటు చేసుకున్నది.

గురజాడ: పప్పు ఉడకదు.

S.N. Jayanty: Pretty hard to get going this place
C. Vijayasree & Vijayakumar: My tricks don't seem to work any more

గురజాడ: కళ్లు కాయలు కాసి పోయినాయి.

S.N. Jayanty: I am anxiously waiting

C. Vijayasree & Vijayakumar: tired of waiting

గురజాడ: రామాయణంలో పిడకల వేట్లాట లాగా
S.N. Jayanty: Not to disturb me

C. Vijayasree & Vijayakumar: Why do you interrupt

గురజాడ: పైన పటారం లోన లొటారం
S.N. Jayanty: All is not well

C. Vijayasree & Vijayakumar: Full of only sound and fury

గురజాడ: డామిట్ కథ అడ్డంగా తిరిగింది.
S.N. Jayanty: Damn it was a nasty turn the story has taken
C. Vijayasree & Vijayakumar: Damn it! the story has somersault

గురజాడ: అరటిపండు విప్పినట్లు
S.N. Jayanty: neatly and accurately

C. Vijayasree & Vijayakumar: readable language

కొన్ని తిట్లను అనువదించిన తీరును పరిశీలిద్దాం.

గురుజాడ	ఎస్.ఎన్. జయంతి	సి. విజయశ్రీ, విజయకుమార్
ఓర్వలేని వెధవ	Some rascals	jealous idiot
గాడిద కొడుకు	bastard	Son of an ass
ముండ	Wench	snut
వెఱ్ఱిముండ	mad woman	mad bitch
ఆడముండలు	female species	Wretched females
రంకుమొగుడు	Lover	Paramour

పై తిట్లలో son of an ass అనడం యథానువాదంగా కనిపిస్తున్నది. మరికొన్ని పదాలను చూద్దాం.

గురజాడ	ఎస్.ఎన్. జయంతి	సి. విజయశ్రీ, విజయకుమార్
ప్రియశిష్యుడు	dearest Sishya	favourite disciple
పూటకూళ్లమ్మ	Inn keeper	board house woman
కోమటి దుకాణము	grocer's shop	Komati shop
పాతివ్రత్యము	pious	loyalty
వేశ్య	public woman	prostitute
రసికులు	philanderers	conniosseurs
పురోహితుడు	priest	purohit
అబ్బి	son/dear fellow	boy
దమిడి	pie	paisa

'కన్యాశుల్కము'లోని ప్రసిద్ధ వాక్యాల అనువాదం చూద్దాం.

గురజాడ: మనవాళ్లు వుట్టి వెధవాయలోయ్

S.N. Jayanty: no sir our people are set of fools

C. Vijayasree & T. Vijayakumar: Our people are pure idiots.

గురజాడ: నిన్ను సురేంద్రనాథ్ బానర్జీ అంత గొప్పవాణ్ణి చేస్తాను.

S.N. Jayanty: I will make you another Surendranath Banarjee

C. Vijayasree & T. Vijayakumar: I will make you as a great man as Surendranath Banarjee

గురజాడ: పెద్దదాన్ని రొమ్ము మీద కుంపట్లాగా భరిస్తూనే ఉన్నా.

S.N. Jayanty: I am crushed with grief over the fate of the elder daughter.

C. Vijayasree & T. Vijayakumar: the elder girl is a burden on us as it is.

గురజాడ: పదు పదు అన్న నా సవితే గాని పడ్డ నా సవితి లేదండి.

S.N. Jayanty: every woman hurls threats at you. But do you find a woman carrying them out.

C. Vijayasree & T. Vijayakumar: There are many women who threaten to jump into the well, but there is not one who really does it.

గురజాడ: నేను యేమో ఉద్యోగాలూ ఊళ్లేలి తనతో వైభోగం వెలిగిస్తాననే నమ్మకంతో ఉంది. పూర్ క్రియేచర్.

S.N. Jayanty: POOR CREATURE she is under the delusion that I will soon be a big officer and lead a princely life.

C. Vijayasree & T. Vijayakumar: She is under the illusion that I will lord over the jobs and towns and I will be in grandeur with her poor creature.

కన్యాశుల్కము నాటకాన్ని ఇతర భాషల్లోకి అనువదించడం కష్టసాధ్యం. అందులోని నుడికారం, ప్రాంతీయ మాండలికం, కులమాండలికం, తిట్లు, పరిహాసం మొదలైనవి ఇతర భాషల్లో అభివ్యక్తీకరించడం చాలా కష్టం. తెలుగు మాతృభాషగానూ, ఇంగ్లీషును ద్వితీయ భాషగాను అభ్యసించిన వారికి ఇంగ్లీషు అనువాదాలు రచించడం కష్ట సాధ్యం. అనువాదకులు ఇంగ్లీషులో అభివ్యక్తీకరించడానికి ప్రయత్నించారు. ఈ అనువాదాలను గురించి ఇంగ్లీషు మాతృభాషగా కలిగినవారు, తెలుగు సంస్కృతికి చెందనివారు అభిప్రాయం తెలపడం మంచిదని భావన.

ఉపయుక్త గ్రంథాలు

1. భీంసేన్ నిర్మల్ (2000), అనువాదశాస్త్రం, హైదరాబాద్, తెలుగు అకాడమీ
2. కొత్తపల్లి వీరభద్రరావు (1960/1986), తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము, హైదరాబాద్, స్వీయ ప్రచురణ.
3. బిరుదురాజు రామరాజు, పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శాస్త్రి (సం), (1988), విజ్ఞాన సర్వస్వము - తెలుగు సంస్కృతి - రెండవ సంపుటం - అకారాద్యను క్రమణిక, హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయం
4. బూదరాజు రాధాకృష్ణ (2003), అనువాద పాఠాలు, హైదరాబాద్, మీడియా హౌస్ పబ్లికేషన్స్.
5. భార్గవీరావు (1996/2006), సాహిత్యానువాదం - ఒక పరిశీలన, హైదరాబాద్, పాంచజన్య పబ్లికేషన్స్.
6. లక్ష్మీకాంతమోహన్ (అను) (1961), జూలియస్ సీజరు, హైదరాబాద్, సరస్వతీ బుక్ డిపో.
7. Prof. G.N. Reddy (1988), The influence of English on Telugu Literature (1900 - 1950), Tirupathi, Prof. G.N. Reddy Sixtieth birthday Felicitation committee.
8. Stanely Wells and Gary Taylor (Sds) (1988/1998), The Oxford Shakespeare The complete works, Oxford, Clarendom Press.

అనువాదకుడికి అభివాదం

డా. డి. చంద్రశేఖర రెడ్డి

భాష ఎంత ప్రాచీనమో అనువాదమూ అంత ప్రాచీనం. ఒక వ్యక్తి చెప్పిన మాటను తిరిగి మరో వ్యక్తి చెప్తే అది అనువాదమే. అంతేకాదు, ఒకే వ్యక్తి తన మాటల్నే తాను మళ్లీ అదే భాషలో అనువదించవచ్చు కూడా. ఒక విషయాన్ని మళ్లీ చెప్పవలసి వస్తే అనువాదానికి ఆవశ్యకత ఏర్పడుతుంది. కాని ఇప్పుడు అనువాదం అంటే భాషాంతరీకరణం అన్న అర్థం స్థిరపడింది. ఒక భాషలో చెప్పిన విషయాన్ని మరో భాషలో చెప్పడం అనువాదం అంటున్నారు. ఇది ఏ విషయమైనా కావచ్చు.

భాషలకు లిపులు ఏర్పడ్డ తర్వాత విశాలమైన లిఖిత వాఙ్మయాలు ఏర్పడ్డాయి. మౌఖిక రూపంలోని అనువాదంతో పాటు లిఖిత రూపంలోని అనువాదమూ విస్తరించింది. ప్రపంచంలో బహు జాతులు, సమాజాలున్నాయి. వీటికి ప్రత్యేకంగా భాషలున్నాయి. భాషా సమాజాల మధ్య సంబంధాలేర్పడినప్పుడు వాటి మధ్య భావ వినిమయం జరుగుతుంది. సమాచారాన్ని, జ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం తప్పనిసరి అవుతుంది. ఈ సమాచారం, జ్ఞానం ఒక సమాజం నుంచి మరో సమాజానికి భాష ద్వారానే ప్రవర్తిస్తుంది. ఒక భాష నుంచి మరో భాషలోకి సమాచార, జ్ఞాన ప్రవాహం అనువాదం ద్వారానే సాగుతుంది.

రాజ్యవిస్తరణలు, వలసరాజ్యాలు, వ్యాపార సంబంధాలు, రాజకీయ సంబంధాలు పెరిగే కొద్దీ అనువాదానికి అవకాశమూ, ఆవశ్యకతా పెరుగుతూ ఉంటుంది.

విషయాన్ని బట్టి, మన అవసరాన్ని బట్టి అనువాదం రకరకాలుగా ఉంటుంది. ఎవరి కోసం, ఎందుకోసం వంటి ప్రశ్నలు అనువాద స్వభావాన్ని నిర్ణయిస్తాయి.

ముఖ్యంగా అనువాదాన్ని విషయాన్ని బట్టి సాహిత్య, సాహిత్యేతర అని రెండు విభాగాలుగా వర్గీకరించవచ్చు. ఈ రెండింటికీ గణనీయమైన భేదం ఉంది. సాహిత్యేతర అనువాదం విషయ ప్రధానం. అంటే ఇందులో సమాచారం, విషయం మాత్రమే

ప్రధానం. భాషకు ప్రాధాన్యం ఉండదు. చెప్పే విషయానికే తప్ప చెప్పే తీరుకు ప్రాధాన్యం తక్కువ. లక్ష్యాన్ని బట్టి సారళ్యతాది విషయాలలో కొంత తారతమ్యం ఉండవచ్చు. అనువాదంలోనే కాదు అసలు అభివ్యక్తిలోనే సాహిత్యేతర అంశాలలో ఈ లక్షణం ఉంటుంది.

సాహిత్యం సౌందర్య ప్రధానం. ఈ సౌందర్యానికి భాష వాహిక. చెప్పే విషయంతో పాటు చెప్పే తీరుకూ సాహిత్యంలో ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని సందర్భాలలో విషయం కంటే చెప్పే తీరుకే ప్రాధాన్యం ఉండవచ్చు. సాహిత్యంలో చెప్పదలుచుకున్న విషయానికి వస్తువనీ, చెప్పే తీరుకు రూపమనీ వ్యవహారం. రచనలో వీటి ప్రాధాన్యంలో తరతమ భేదం రచయిత లక్ష్యంపై ఆధారపడి ఉంటుంది. కథ కంటే రసం వేయి రెట్లు మిన్న అని భావించే రచయితకు రూపమే పరమోత్కృష్టం.

సాహిత్యానువాదంలో వస్తువుకూ, రూపానికీ కూడా ప్రాధాన్యం ఉంటుంది. ఒక సమాజం సంస్కృతి, నాగరికత, కళాత్మక దృక్పథం ఆ సమాజ సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. అనువాదం కూడా వీటిని ప్రతిబింబించవలసి ఉంటుంది.

సాహిత్యానువాదంలోనూ, సాహిత్యేతరానువాదంలోనూ మళ్లీ అనేక రకాల వర్గీకరణలు చేయవచ్చు. ఇక్కడ సాహిత్యానువాదం ప్రస్తుతాంశం కాబట్టి సాహిత్యేతరా నువాదాన్ని పక్కన పెట్టవచ్చు.

సాహిత్యానువాదంలో ఒకే భాషలో ఒక ప్రక్రియలోని రచనను మరో ప్రక్రియలోకి అనువదించవచ్చు. ఉదాహరణకు ఒక పద్యకావ్యాన్ని గేయ కావ్యంగానూ, గేయకావ్యాన్ని గద్యకావ్యంగానూ, శ్రవ్యకావ్యాన్ని దృశ్యకావ్యంగానూ అనువదించవచ్చు. ఇది అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ కూడా జరగవచ్చు. పద్యకావ్యాన్ని చంపూ కావ్యంగానూ, నిరోష్ఠ్య కావ్యంగానూ అనువదించవచ్చు. పద్యనాటకాన్ని వచనంగా పరివర్తనం చేయవచ్చు. గేయరూపకంగా మార్చుకోవచ్చు. భాషాంతరీకరణం లోనూ ఇటువంటి ప్రక్రియా పరిణామం ఉండవచ్చు.

అనువాదం చాలా క్లిష్టమైన పని. మూలంలోని సౌందర్యాన్ని అనువాదంలోకి తీసుకొని రావడం అత్యంత ప్రతిభావంతులకు కాని సాధ్యం కాని పని. మౌలికమైన రచనలో అనేక లక్షణాలుంటాయి. సాహిత్యపరంగాను, భాషాపరంగానూ విశిష్టత లుంటాయి. సంస్కృతీపరమైన ప్రత్యేకతలే అనువాదకులను ముప్పుతిప్పలు పెట్టగలిగి నప్పుడు సాహిత్య, భాషాపరమైన విశిష్టతలు అనువాద కార్యాన్ని దుస్సాధ్యంగానే కాదు, అసాధ్యంగానూ మార్చగలవు. అనువాదం అసంభవమైన రచనలూ ఉంటాయి. ఉదాహరణకు ద్వ్యర్థి, త్ర్యర్థి, చతురర్థ, బహ్వార్థ రచనలు అనువాదానికి లొంగవు.

మౌలిక రచయిత భాషాపరమైన చమత్కారాలెన్నో చేస్తాడు. అవి అనువాదకుడికి కొరకరాని కొయ్యలవుతాయి.

అనువాదానికి కొన్ని అనుకూల పరిస్థితులు, కొన్ని ప్రతికూల పరిస్థితులు ఉంటాయి. సామాజికమైన సాన్నిహిత్యం అంటే ఆచారవ్యవహారాలు, జీవనవిధానం, భావసారూప్యం, మతాది విషయాలలో సమత ఒక ముఖ్యమైన అనుకూలత. భాషా సాన్నిహిత్యం అంటే ఏక కుటుంబ భాషలై ఉండడం లేదా భిన్న కుటుంబ భాషలై ఉన్నప్పటికీ బహు శతాబ్దాల/ సహస్రాబ్దాల సంబంధం వల్ల భాషల మధ్య ఆదాన ప్రదానాలు విస్తారంగా జరిగి ఏక కుటంబ భాషలనిపించేంత పోలిక ఏర్పడడం మరో ముఖ్యమైన అనుకూలత. ఈ రెండు అనుకూలతలు ఉన్నప్పుడు అనువాదకుడికి ఎంతో సౌకర్యం కలుగుతుంది.

ఛందోబద్ధ పద్యాన్ని అనువదించడంలోను, వచనాన్ని అనువదించడంలోనూ కూడా భేదం ఉంది. లక్ష్యభాషలో కవి అయినవాడు మాత్రమే పద్యాన్ని పద్యరూపంలో కవితాత్మకంగా అనువదించగలడు. వచనానువాదకునికి రెండు భాషల్లోనూ సామర్థ్యం ఉంటే చాలు. అయితే సాధారణవచనం, ఆలంకారిక వచనం ఉంటాయి. ఆలంకారిక వచనం పద్యానికి సమీపంగా ఉంటుంది. కాబట్టి అటువంటి వచనాన్ని అనువదించ డానికి, సాధారణ వచనానువాదానికి భేదం ఉంటుంది.

తెలుగులో అనువాద సాహిత్యానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. పదకొండో శతాబ్దంలో సంస్కృత భారతాన్ని తెలుగులోకి అనువదించడంతో తెలుగు లిఖిత సాహిత్యంలో తొలి బృహద్రచన ప్రారంభమైంది. ఈ భారతానువాదం ముగ్గురు కవుల చేతుల్లో మూడు శతాబ్దాల్లో పూర్తయింది. ఆ తర్వాత సంస్కృత పురాణేతిహాస కావ్యాలనేకం తెలుగులో అనువదితమయ్యాయి.

ఒక అనువాద రచనను చదివే పాఠకులలో మూలభాషతో పరిచయం ఉన్నవాళ్లు, మూలభాష తెలియనివాళ్లు ఉంటారు. మూలభాషతో పరిచయం ఉన్నవారిలో కూడా మూలభాషలో చదివి అనుభూతి పొందడంలో తారతమ్యాలుం టాయి. ఎక్కువమంది అనువాదాన్ని ఆనందించగలుగుతారు. మూలభాష తెలియని వారికి అనువాదమే గతి. కేవలం రచనను చదవడం ద్వారా అనువాదమో, మౌలికమో ఎలా గుర్తించడం?

వస్తువు, భాష ఈ రెండూ మౌలిక రచన, అనువాద రచనలను గుర్తించడానికి సహకరిస్తాయి. అయితే ఇది కొంతవరకే. వస్తువు విదేశీయమైనప్పుడు - ఇక్కడ

వస్తువు ఇతివృత్తం అన్న అర్థంలో కూడా - పాత్రల పేర్లు, స్థలాలు, అక్కడి ఆచారవ్యవహారాలు మనకంటే భిన్నంగా ఉండి రచన అన్యదేశీయమనే స్ఫృహ కలుగుతుంది. తెన్నేటి సూరి నవల 'ఛెంగిజ్‌ఖాన్' తెలుగులో మౌలిక రచన అయినా కొంతమంది అనువాదమని భ్రమపడడానికి కారణం ఇదే. భాషలో విదేశీయమైన పలుకుబడులు న్నప్పుడు కూడా రచన అనువాదమన్న స్ఫృహ కలుగుతుంది.

తెలుగు కావ్యాలను పరిశీలించినప్పుడు అవి అనువాదాలైనా అనువాదాలన్న భావం కలుగదు. దీనిక్కారణం వస్తువు, భాష కూడా. వస్తువు సుపరిచితమై తరతరాలుగా అనుభవంలో ఉన్నది కావడం, సంస్కృత పదజాలం కూడా అంతే సుపరిచితమై ఉండడం దీనికి కారణం. భారతాన్ని తెలుగులో చదివేవారికి అది అనువాదమన్న స్ఫృహ కలుగదు. అంతే. సంస్కృతం నుండి అనువదితమైన రచనలన్నీ దాదాపు ఇటువంటివే. తెలుగులో ఒక స్వతంత్ర కావ్యానికీ, ఒక అనువాద కావ్యానికీ భేదం చెప్పడం కూడా కష్టమే. అందుకే తెలుగులో మహాకవులుగా వ్యవహృతమవుతున్న నన్నయ, తిక్కన, శ్రీనాథాదులు మౌలికమైన రచనలు చేసినందువల్ల మహాకవులైనవారు కాదు. గ్రీకు, లాటిన్ భాషల నుండి ఆధునిక యూరోపియన్ భాషల్లోకి జరిగిన అనువాదాల విషయమూ ఇటువంటిదేననుకుంటాను.

షేక్స్పియర్ ఎంతటి మహా రచయిత అయినా ఆయన నాటకాల తెలుగు అనువాదాల ప్రాచుర్యం తెలుగు పాఠకలోకంలో అంతంతమాత్రమే. పాత్రల పేర్లు, స్థలాలపేర్లు అన్నీ భారతీయం చేసి అనువదించిన వాటి పరిస్థితి కూడా అంతకంటే మెరుగు కాదు. అందువల్ల ఒక మహారచయిత రచన మరో భాషలోకి పరివర్తితమైనప్పుడు అది ఆ మహారచయితకు అంతే ప్రతిష్ఠను తెచ్చి పెడుతుందని చెప్పలేం. అంతకంటే చాలా తక్కువ స్థాయి మౌలిక రచనలు కూడా ఎక్కువ ప్రతిష్ఠాపాదకాలు కావచ్చు.

'అనువాదం మూలానుసారం అయితే అందంగా ఉండదు, అందంగా ఉంటే మూలానుసారంగా ఉండదు' అని ఒక నానుడి. మూలానుసారమైతే కృతకమై అనాకర్షణీయమవుతుందని అభిప్రాయం. మూలాతిక్రమణం ఎంత వరకు న్యాయమన్నది మరో చర్చనీయాంశం.

భాషాపరంగా చూసినప్పుడు స్థూలంగా అనువాదం నాలుగు రకాలు.

1. ప్రతిపదానువాదం - యథాతథానువాదం
2. భాషా స్వభావానుగుణానువాదం

3. వివరణాత్మక అనువాదం
4. స్వేచ్ఛానువాదం

అనువాదమే మూలంగా భ్రమింపజేసే అనువాదాలు నిజంగా అద్భుతాలే. అయితే మూలాన్ని, అనువాదాన్ని పోల్చినప్పుడు తప్ప నిజానిజాలు బయటపడవు.

యథాతథానువాదం అని అన్నా మూలానికీ, అనువాదానికీ అణుమాత్రం భేదం లేని అనువాదం సాధ్యం కాదు. నూటికి నూరుపాళ్లు కాకున్నా అంతకు దగ్గరగా చేసే అనువాదం. ఈ అనువాదంలో లక్ష్యభాషకు నప్పకున్నా మూలంలోని పదాన్నో, పదబంధాన్నో యథాతథంగా అనువదించే పద్ధతి కావడాన కొంత కృతకత తప్పదు.

భవభూతి 'ఉత్తర రామచరిత' నాటకంలోని శ్లోకం ఇది.

"పశ్చాత్ పుచ్ఛం వహతి విపులం, తచ్ఛదూనోత్యజస్రమ్
దీర్ఘ గ్రీవస్సభవతి, ఖురాస్తస్య చత్వార ఏవ
శష్పాణ్యత్తి, ప్రకిరతి శకృత్పిండకాన్ ఆమ్రమాత్రాన్
కిం వ్యాఖ్యాతైర్వ్రజతి స పునర్దూర మేహ్యేహియామః"

మొట్టమొదటిసారి గుర్రాన్ని చూసిన పిల్లలు దాన్ని వర్ణించిన తీరు ఇది.

"వెనుకన్దోకను దాల్చు విప్పుగ, సదా వే దాని నాడించెడిన్
మొనయున్ దీర్ఘము గాగ కంఠము, ఘురంయిల్ దానికిన్నాల్గె సూ,
తిను వే బచ్చిక నామ్రమాత్రములుగా దించున్ శకృత్పిండముల్
చను దూరమ్మది యేల వర్ణన? కనన్ జందెమ్ము రా, రా, వెసన్"

వేదం వేంకటరాయశాస్త్రిగారి అనువాదం ఇది. మొదటి వాక్యంలో పద క్రమంలో కూడా తేడా లేదు. అదే చర్ల గణపతిశాస్త్రిగారి అనువాదంలో 'వెనుకన్ బెద్దది తోక యున్నది' అని ఉంటుంది. 'తోకను తాల్చును' అనడం కంటే 'తోక ఉంది' అనడం తెలుగులో సహజం.

భాషా స్వభావాను గుణానువాదం అంటే లక్ష్యభాషా సహజంగా అనువదించడం. లక్ష్యభాష స్వభావం, నుడికారం ప్రకారం అనువదించడం. మౌలిక రచనను తలపించడం.

వివరణాత్మక అనువాదానికి అనేక హేతువులుంటాయి. ఒక విధంగా వ్యాఖ్యానాత్మకమైన రచన అని చెప్పవచ్చు. రచనా సౌందర్యాన్ని ఇనుమడింపజేసే ప్రయత్నం కూడా ఇందులో ఉంటుంది. భాగవతంలో వామనుడు త్రివిక్రముడవుతాడు. ఈ విజృంభణను వర్ణిస్తూ తెలుగు భాగవతంలో పోతనగారు చెప్పిన పద్యాలు

సుప్రసిద్ధాలు. ఈ సన్నివేశంలోని

"ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభోవీధిపై

నంతై..."

'రవిబింబంబుపమింప బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై...'

'కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతింబొందరే...'

'నిరయంబైన నిబంధమైన ధరణీ నిర్మూలనంబైన....' – మొదలైన పద్యాలు అమూలకాలు. కాని ఈ ఘట్టాన్ని అద్భుతంగా వివరించి కావ్యసౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. ఆంధ్ర భాగవతంలో ఇటువంటి ఘట్టాలనేకం.

స్వేచ్ఛానువాదం మూలంలోని ప్రధాన కథాసూత్రాన్ని అనుసరిస్తూ అభివ్యక్తి స్వేచ్ఛనిస్తుంది. దేశకాల సంప్రదాయానుగుణంగా కథలో కూడా చిన్న చిన్న మార్పులకు అవకాశమిస్తుంది. కుదింపులకు చేర్పులకు అవకాశమిస్తుంది. వ్యాఖ్యానానికి తావిస్తుంది. అనువాదకుని దృక్పథానికి చోటు కలిగిస్తుంది. వర్ణనాదులు చేర్చవచ్చు, తొలగించవచ్చు. ఆలంకారికతను జోడించవచ్చు. రసపోషణ చేయవచ్చు. ఔచిత్యాన్ని కల్పించవచ్చు, అనౌచిత్యాన్ని పరిహరించవచ్చు.

ఈ స్వేచ్ఛానువాదాన్నే అనుసృజన అనవచ్చు. తెలుగు కవులలో ప్రాచీను లంతా అనుసరించింది ప్రధానంగా ఈ విధానాన్నే. పురాణేతిహాస రచనలకు కావ్యత్వం ఇచ్చే మార్గం ఇది.

అనువాదకుడు ఈ అనువాదమార్గాలలో ఏదో ఒక విధానాన్ని ఎంచుకొని అవలింబిస్తే అవలంబించవచ్చు. కాని సాధారణంగా ఏ అనువాదంలోనూ ఒకే విధమైన పద్ధతి ఉండదు. ఒకటి కంటే ఎక్కువ పద్ధతులే అవలంబించడం జరుగుతుంది. ఒక చిన్న రచనలో కూడా ఈ నాలుగు పద్ధతులూ అవలంబించి ఉండవచ్చు.

ఒక మహారచనలో అనువాదకునికి అన్ని మార్గాలూ అవసరమే కావచ్చు. కవులు అనుసరించారు కూడా.

మహాభారతం వంటి రచనను పరిశీలిస్తే ఒక్కొక్క అనువాద విధానం అనేక ఘట్టాలలో కనిపిస్తుంది. నన్నయాదులు ఒక బృహత్ వ్యూహంతోనే రచనకు పూను కున్నారు.

శ్రీనాథుడు శ్రీహర్ష నైషధకావ్యాన్ని శృంగార నైషధంగా అనువదిస్తూ తన అనువాద వ్యూహాన్ని వ్యక్తీకరించాడు. 'శబ్దంబనుసరించియు నభిప్రాయంబు

గురించియు భావంబు పలక్షించియు, రసంబు పోషించియు, నలంకారంబు భూషించియు, నౌచిత్యంబాదరించియు ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబున జెప్పబడి' ఈ వాక్యాలు శ్రీనాథుని వ్యూహాన్ని తెల్పుతున్నాయి. స్థూలంగా ప్రాచీన తెలుగుకవులందరి అనువాద వ్యూహం ఇదే. శ్రీనాథుడు కావ్యాన్ని అనువదిస్తున్నాడు, నన్నయాదులు పురాణేతిహాసాలననువదించారు. కాబట్టి వారు అవలంబించిన వ్యూహం శ్రీనాథుని వ్యూహం కంటే కూడా విస్తృతమైనది.

శ్రీనాథుని మాటల్లో 'శబ్దంబనుసరించియు' అన్న మాట ప్రత్యేకమైనది. సాధారణంగా అర్థాన్ని అనుసరించడం తేలిక. శబ్దాన్ని అనుసరించడం కష్టం. పోలికలు లేని భాషల్లో దాదాపు అసాధ్యమని చెప్పవచ్చు. సంస్కృతం నుండి పదజాలాన్ని కొల్లగొట్టడం, ఆ పదబంధాలను సంస్కృత వ్యాకరణ మర్యాదతో సహా వాడగల్గడం వల్ల అనువాద ప్రక్రియ సంస్కృతం నుండి తెలుగులోకి జరగడం వల్ల ఈ శబ్దానుసరణం సాధ్యమైంది.

"అస్తి వామ్యభరమస్తి కౌతుకం సాస్తి ఘర్మజల మస్తి వేపధు
అస్తి భీతి రతమస్తి వాంఛితం ప్రాపదస్తి సుఖమస్తి పీడనమ్"

అన్న శ్రీహర్షుడి శ్లోకాన్ని శ్రీనాథుడిలా అనువదించాడు.

"అస్తి వామ్యభారమస్తి కౌతూహలం
బస్తి ఘర్మ సలిలమస్తి కంప
మస్తి భీతి యస్తి హర్షమస్తి వ్యథం
బస్తి వాంఛమయ్యెనపుడు రతము"

కావ్యమంతటా ఇటువంటి అనుసరణం ఉండదు కాని కవి అనుసరించ దలచుకున్నప్పుడు ఇంత సన్నిహితంగా అనుసరించగలడు.

కొన్ని అర్థ చమత్కారాలు కూడా అనువాదానికి లొంగవు. మరోదారి వెదుక్కోవలసిందే. సంస్కృత పదాలను వాడుకొనే సౌకర్యం వల్ల తెలుగు కవులిటువంటి వాటిని తేలిగ్గా సాధించారు.

"ఇహ కిముషసి పృచ్ఛాశంసి కిం శబ్దరూప
ప్రతి నియమిత వాచా వాయసే నైష సృష్టః
భణ ఫణిభవశాస్త్రే తాదజః స్థాని నౌ కా
వితి విహిత తుహీవాగుత్తరః కోకిలోఽభూత్"

అన్న శ్రీహర్షుడి శ్లోకానికి శ్రీనాథుడి అనువాదం ఇలా ఉంది.

"ప్రాతఃకాలంబు వాయసంబు 'పణినాపత్యోక్త శాస్త్రంబులో
దాతజ్ స్థానులు చెప్పుడెవ్వి?' యను చందంబొప్పఁ గౌకౌ
యనం జాతుర్యంబలరార నుత్తరము విస్పష్టంబుగాఁ గోకిల
వ్రాతంబిచ్చెఁ దుహీతుహీయని గృహారామ ప్రదేశంబులన్"

వ్యాకరణ శాస్త్రసంబంధమైన విషయాన్ని చమత్కరించాడు శ్రీహర్షుడు. తాతజ్ స్థానులు ఏవి అని ప్రశ్నించినట్లుగా కాకి 'కౌ' అందట. కోకిలలు 'తు హి' అని సమాధానం చెప్పాయట. కాకి కోకిలల ఆయా ధ్వనులకు తెలుగులో ప్రత్యేకార్థం లేదు. కాని సంస్కృతంలో 'కౌ' అన్న మాటకు 'తు, హి' అన్న మాటలకు అర్థం ఉంది. అట్లా అర్థం ఉండడం వల్లే ఈ చమత్కారానికి అవకాశం కలిగింది. శ్రీనాథుడు కాకి కౌకౌ అని ప్రశ్నిస్తే కోకిలలు తుహీతుహీ అని, సమాధానం చెప్పాయని అనువదించాడు. మరో రకంగా ఇదే చమత్కారాన్ని సాధించడానికి వీలు పడదు.

తెలుగు కవులు సంస్కృతం నుండి రచనలను అనువదించేటప్పుడు ఇటువంటి విశేషాలెన్నో.

ఒకే రచనకు పలు అనువాదాలున్నప్పుడు వాటిని తులనాత్మకంగా పరిశీలిస్తే కవుల అనువాద విధానాలలోని తారతమ్యం గోచరిస్తుంది.

రవీంద్రుని గీతాంజలికి తెలుగులో ఎన్నో అనువాదాలున్నాయి. వీటిలో కొన్ని బెంగాలీ నుండి తెలుగులోకి జరిగితే ఎక్కువ భాగం ఇంగ్లీషు నుండి తెలుగులోకి జరిగాయి. వీటి పరిశీలన ఆసక్తికరంగా ఉంటుంది.

తెలుగులో బహుఅనువాదాలు జరిగిన మరో రచన ఉమర్ ఖయ్యాం రుబాయీలు. వీటిని కూడా పర్షియన్ నుండి కొందరు నేరుగా అనువదిస్తే ఎక్కువ మంది ఫిట్జరాల్డ్ ఆంగ్లానువాదం ఆధారంగా అనువదించారు. ఒక్క ఉదాహరణను పరిశీలిద్దాం.

"Think in this battered caravan serai
whose doorways are alternate night and day
How sultan after sultan with his pomp
Abode his hour or two and went his way

They say the lion and the lizard keep
The courts where Jamshyd gloried and drank deep
And Bahram that great hunter the wild ass
stamps over his head and he lies fast asleep"

ఇది ఫిట్జరాల్డ్ ఆంగ్లానువాదం.

దువ్వూరి రామిరెడ్డిగారు 'పానశాల' అన్న పేరుతో రుబాయీలను అనువదించారు. పర్షియన్‌లో రుబాయీలు చదువుకొని వాటిని ఏ రుబాయీకి ఆ రుబాయీగా కాక, వాటిని అదే క్రమంలో కూడా కాక స్వేచ్ఛానువాదం చేశారు. 692 రుబాయీలలో అర్థపునరుక్తి ఉన్నవాటిని వదిలిపెట్టి, కొన్ని చోట్ల 2,3 రుబాయీల భాగాలను ఒక పద్యంగా అనువదిస్తూ 125 పద్యాలు రాశారు రామిరెడ్డిగారు. రాయప్రోలు సుబ్బారావుగారి అనువాదంలో 16, 17 క్రమంలో ఉన్న పై పద్యాలు రామిరెడ్డిగారి అనువాదంలో 14, 52 క్రమంలో ఉన్నాయి.

"Think in this battered caravan serai..." అన్న 16వ పద్యం రామిరెడ్డిగారి అనువాదంలో 52వ పద్యమైంది.

"అంతము లేని యీ భువనమంత పురాతన పాంథశాల; వి
శ్రాంతి గృహంబు; నందు నిరుసంజలు **రంగుల** వాకిళుల్; ధరా
క్రాంతులు పాదుషాలు **బహరామ్ జమిషీదులు వేనవేలు గా౯**
గొంత సుఖించి పోయిరెటకో **పెఱవారికి౯ జోటొసంగుచున్"**

తరువాతి పద్యం "they say..." 14వ పద్యమైంది.

"అల బహరాము గోరి మధువానిన సుందర భోగ మందిరం
బుల మృగరాజు నేఁడు భయమున్విడి క్రుమ్మరు; జంబుకంబు పి
ల్లలఁగను; వన్యరాసభములన్ మృగయారతి౯ బట్టినట్టి భూ
తలపతి గోరి పట్టు వడెఁదానొక గోరి నెఱంగుదే చెలీ"

ఈ వరుస మార్పు తెలుగు కవి స్వాతంత్ర్యాన్ని తెలుపుతుంది. మొదటి పద్యంలో అంతం లేని ఈ భువనమన్న మాట మూలంలో వాచ్యంగా లేదు. రాత్రింబగళ్లే దాని తలుపు రెక్కలు అనడం వల్ల ఊహించవచ్చు. రామిరెడ్డిగారు వాచ్యం చేశారు. విశ్రాంతి గృహం పునరుక్తమైంది. వాకిళ్లకు 'రంగుల' అన్న విశేషణం రామిరెడ్డిగారిది. సుల్తాను తర్వాత సుల్తాను అన్న ప్రయోగాన్ని 'ధరా క్రాంతులు పాదుషాలు బహరామ్ జమిషీదులు వేనవేలుగా' అని అనువదించారు. బహరామ్, జమిషీదులని పేర్లు చేర్చారు. పర్షియన్ సుల్తానులు వాళ్లే. కాని మూలంలో లేని పేర్లు ఇక్కడ వచ్చాయి. వాళ్లు సుఖించి వెళ్లిపోయారంటే సరిపోతుంది కాని తరువాతి వారికి చోటిస్తూ అన్నది వివరణ. స్థూలంగా వివరణాత్మకమైన అనువాదం రామిరెడ్డిగారిది.

రెండో పద్యంలో మూలంలో బహరాము, జమిషీదులిద్దరూ ఉన్నారు. రామిరెడ్డిగారు జమిషీదును వదిలివేశారు. కాని ఇద్దరు బదులూ బహరామునే

సరిపుచ్చారు. మూలంలోని సింహాన్ని తీసుకున్నారు. తొండను వదిలివేసి దాని స్థానంలో నక్కలు ఈనుతాయన్నారు. 'తన సమాధిలో గాఢ నిద్రపోతూ ఉన్న గొప్ప వేటకాడైన బహరాము తల మీద అడవి గాడిద తొక్కుతుంది' అన్న మూలభావాన్ని 'వేటలో అడవి గాడిదలను పట్టినట్టి బహరాము ఒక సమాధిలో పట్టువడ్డా'డని రామిరెడ్డిగారు అనువదించారు. మూలానికి ఇది కొంచెం దూరమనిపిస్తుంది.

రాయప్రోలు సుబ్బారావుగారు ఉమర్ ఖయ్యాం రుబాయిలను 'మధుకలశము' అన్న పేర అనువదించారు. రాయప్రోలు గారి అనువాదం ఇలా ఉంది :

"రేలుపగల్ కవాటముల రెక్కలుగా గల ఈ యెడారి స
త్రాలకు వచ్చుచంద్రు సులతాను లొకండెడలన్ మరొక్క **డాం**
దోళికలెక్కి ప్రాభవముతో వసియింతురు రెండు మూడు నా
ళ్లోలగ మాపి యంతనెటకో విరమింతురు **కంటె నెచ్చెలీ!**
జముషిదు శీధువానుచు యశస్సఖినేలిన నేలలందు సిం
హములు **సివంగులున్** సలుపు న్యాయసభా క్రమమంద్రు నేడు బై
రము **మృగయామదాంధుని శిరంబెట వ్రాలెనొ** అయ్యెడన్ యథే
చ్ఛముగను త్రొక్కు **గార్దభము;** దాన **చలింపడు** నిద్రనాతడున్"

రాయప్రోలువారి అనువాదంలో మొదటి పద్యంలో ఈ ఎడారి సత్రాలను అనడంలో రామిరెడ్డిగారి అనువాదంలోని విశిష్టత లుప్తమైంది. ఈ సత్రాలు సాదాసీదా సత్రాలైపోయాయి. మూలంలో ఉన్నది ఒకటే సత్రం. అది ఈ ప్రపంచం. ఆ అర్థం రాయప్రోలువారి అనువాదంలో స్పష్టం కాదు. ఆందోళికలెక్కి, ఓలగమాపి అన్నవాటిలో మొదటిది రాయప్రోలువారు చేర్చిన విశేషణం. రెండోది వివరణమనవచ్చు.

రెండో పద్యంలో తొండల బదులు సివంగులు వచ్చాయి. సింహాలు, సివంగులు అనడం వల్ల రెండూ సమానమవుతున్నాయి. ఉచ్చనీచాలు, హెచ్చుతగ్గుల అంతరాలు కన్పించవు. మార్పు వల్ల మూలంలోని అర్థానికి నష్టం కలిగింది. మూలంలో బహరాము గొప్ప వేటకాడని ఉంటే దాన్ని రాయప్రోలు మృగయా మదాంధునిగా అనువదించారు. దాన్ని బహరాములో దుర్గుణంగా చూపించారు. అడవి గాడిదను కేవలం గాడిదను చేశారు. గాడిద యథేచ్ఛగా తొక్కినా అతడు నిద్ర పోతూనే ఉంటాడు. 'ప్రతిక్రియ చేయడు/ చేయలేడు' అన్న భావాన్ని వ్యక్తం చేయడానికి రాయప్రోలు 'చలింపడు' అని ప్రయోగించారు. ఈ మాటలో అశక్తత వ్యక్తం కావడం లేదు.

ఎం.ఆర్. బలరామాచార్యగారు ఉమర్ ఖయ్యాం రుబాయిలను 'ఉమర్ ఖయ్యాం అమరగీతాలు' అన్న పేరిట గేయరూపంలో అనువదించారు. ఆయన

అనువాదం ఇలా ఉంది :

జగమే ఒక పెను సత్రము
పగలు రాత్రియను విశాల
ద్వారములా సత్రానికి
తూరుపు పడమరలందున

ఉదయమ్మున నొక ద్వారము
నుషారాణి లేచి తెరచు
సాయంకాలము మరొకటి
సంధ్యాలలితాంగి తెరచు

ఎందరెందరొ సుల్తాను
లీ ద్వారమ్ముల వచ్చిరి
చుట్టములుగ రెండు నాళ్లు
ఎట్లొ గడిపి వెడలినారు

జంషీదాను మహారాజు
చక్కని దర్బారులలో
మహా వైభవమ్ము తోడ
మధుపానము జరిగెడిదట

ఆ నేలను స్వేచ్ఛగ సిం
హమ్ములు తిరుగాడుచుండె
అట శునకము నేడు నిర్భ
యమ్ముగాను మొరుగుచుండె

మహాయోధుడగు బహరాం
పాదుషా అచేతనుడై
నిద్రవోవ అడవి ఖరము
లతని తలను తన్నుచుండె

పెను సత్రం అనడంలో పురాతనమన్న అర్థం కాని, నిరంతరం ఉపయోగించిన అన్న అర్థం కాని రావడం లేదు. 'విశాల' అన్నది వివరణాత్మకమైన విశేషణం. 'తూరుపు... సంధ్యా లలితాంగి తెరచు' వరకు ఐదు పాదాలూ అమూలకం, వ్యాఖ్యాప్రాయం. 'చుట్టములుగ' వివరణం.

రెండో పద్యానువాదంలో – మూలంలో జంషీదే మధుపానం చేసినట్లుండగా, 'దర్బారులో మధుపానం జరిగేదట' అనడం మూలంలోని ఉద్దేశానికి భంగకరం. తొండ బదులు బలరామాచార్యగారు శునకాన్ని తెచ్చారు. భావానికి భంగం లేదు. గొప్ప వేటగాడన్న విశేషణానికి బదులు మహాయోధుడన్న విశేషణం వాడారు. ఇది కూడా మూలోద్దిష్టమైన అర్థానికి అనుగుణంగా లేదు.

ఈ మూడు అనువాదాలనూ పరిశీలించిన తర్వాత పెద్దగా మార్పు అవసరం లేని సందర్భంలోనూ అనువాదకవులు చేసిన మార్పులకు హేతువును ఊహించడం కష్టమని అర్థమవుతుంది.

మూలం చదవకుండా ఏ అనువాదానికి ఆ అనువాదాన్ని వ్యస్తంగా స్వతంత్రంగా చదివితే పాఠకుడికి అంతగా అభ్యంతరపెట్టవలసిన అవసరం ఉండదు. మూలంతో పోల్చినప్పుడే తారతమ్యాల విచారణ అవసరమవుతుంది. ఇది కేవలం రెండు పద్యాల – మూడు అనువాదాల పరిశీలన మాత్రమే. మొత్తం గ్రంథాన్ని మరెన్నో ఇతర అనువాదాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే మరెన్నో తారతమ్యాలు గోచరిస్తాయి.

వివరణ, వ్యాఖ్య, అలంకారం, ఔచిత్యం, సౌందర్యం ఇత్యాది హేతువులతో పాటు అనువాదంలో వ్యత్యాసాలకు అనువాదకుల దృక్పథం, సామర్థ్యం, అవగాహ నాదులు కూడా కారణాలవుతాయి.

ప్రాచీనులను అనువాదం కేవలం అనువాదకులుగా నిలబెట్టలేదు. మౌలిక మైన కవులుగా కీర్తి తెచ్చి పెట్టింది. ఆధునికులకు అంత కీర్తికరం కాకపోయినా అనువాదకుల అనువాద కృషి మాత్రం భాషా సమాజాలకు అనన్యమైన సేవ చేసింది, చేస్తున్నది, చేస్తుంది.

మూలానుసారమూ, సుందరమూ అయిన అనువాదం అనువాదకునితో పాటు మూల రచయితకూ తనది కాని భాషా సమాజంలో చిరస్థాయి అయిన కీర్తిని సంపాదించి పెడుతుంది. మూల రచయిత వెనుక దాగి అణగిమణగి, రచయిత ప్రతిభాపాటవాలను నలుదిశలా ప్రసరింపజేసే అనువాదకుడికి మూల రచయిత సంగతి ఎలా ఉన్నా మాత్రం పాఠక సమాజం ఎల్లప్పుడూ ఋణపడి ఉంటుంది.

సాహిత్యానువాదం

గోవిందరాజు రామకృష్ణారావు

విద్వద్విషయం చర్చకు వచ్చినప్పుడు పండితుల భావజాలంలో వైవిధ్యం చోటు చేసుకోవడం సహజం. 'అనువాదం' ఈ కోవలోకే వస్తుంది. అందుచేత వివిధ నిర్వచనాలలోకి చొచ్చుకుపోకుండా ఒక భాషలోంచి అర్థం కాపాడుకుంటూ మరో భాషలోకి మార్చడం అనువాదం అని భావించి ముందుకు పోవడం సముచితం. సంప్రదాయం ప్రకారం ఏదో ఒక నిర్వచనాన్ని స్వీకరించాలి. అధిక ప్రచారంలో వున్న సామ్యూల్ జాన్సన్ నిర్వచనం 'Translation is to change into another language retaining the original sense' - అమోద యోగ్యమవుతుంది. అనువాదానికి తర్జుమా, భాషాంతరీకరణ, పరివర్తన, అనుసరణ, అనుసృజన, అనూక్తం, అనుభాష, తెలుగులోకి అయితే తెనిగింపు, ఆంధ్రీకరణ మొదలైనవి పర్యాయపదాలుగా వాడుకలో ఉన్నాయి.

అనువాదం శాస్త్రమా, కళా అనే మీమాంస కూడా ఎదురవుతుంది. ఫ్రేసర్ టైట్లర్ పద్దెనిమిదో శతాబ్దంలోనే పరిశోధనపూర్వకంగా దీనిని 'భాషాశాస్త్రం'లో అంతర్భాగమని చెప్పారు. శాస్త్రవాదులు అనువాదాన్ని సమగ్రానువాదం, పరిమితా నువాదం, పాక్షికానువాదం, స్వేచ్ఛానువాదం, నిబద్ధానువాదం, వర్ణానువాదం, యథామాతృకానువాదం, నుడికారపు అనువాదం, రేఖానువాదం, కోశానువాదం – ఇలా ఎన్నో రూపాలుగా వర్గీకరించారు. సాంకేతిక పరిజ్ఞాన విజృంభణతో ఆశ్చర్యపరిచే 'యాంత్రికానువాదం' వచ్చి చేరింది. కళావాదుల దృష్టిలో అనువాదం గొప్పకళ. కావ్యం ఉత్తమ కళాసృష్టి అయితే, వారు అనువాదాన్ని విశిష్ట కళానుసృష్టిగా పరిగణిస్తారు. మధ్యేమార్గం అభిలషించేవారు అనువాదం కళాత్మకశాస్త్రమనీ, శాస్త్రీయ కళ అనీ సంభావిస్తారు.

ఈ వాదాలు పరిత్యజిస్తే అనువాదం ముఖ్యంగా సాహితీ ప్రపంచానికి మహత్తర వరంగా భాసిస్తుంది. రెండు, అంతకంటే ఎక్కువ భాషలలో ప్రవేశం

సాధించేవారు. చాలా తక్కువ. మిగిలినవారందరూ ఇతర భాషా సాహిత్యాలు తెలుసుకునేందుకు సాధనం అనువాదం. ఈ సాధనమే లేకపోతే టాల్‌స్టాయ్, చెకోవ్, షేక్స్పియర్, గాలిబ్, ఫిరదౌసి, కాళిదాసు, తులసీదాసు, వాల్మీకి, రవీంద్రుడు, శరత్‌బాబు, జయదేవుడు, ప్రేమచంద్, సుబ్రహ్మణ్య భారతి, కువెంపు, అనంతమూర్తి, గిరీష్‌కర్నాడ్, వల్లతోల్, మహాశ్వేతాదేవి వంటి సహస్రాధిక సాహితీ శిఖరాల వెలుగులు అన్య భాషీయులు చూడగలిగేవారు కాదు. అదృష్టవశాత్తు అనువాద సాధనం ప్రపంచ సాహిత్యాలను సన్నిహితపరిచింది. ఈ బలీయ సాహిత్యానువాద గుణవిశేషాలను స్థాలీపులాకంగా పరిశీలించేందుకు ఈ వ్యాసం యత్నిస్తోంది. క్వాచిత్కంగా ఇతర భాషలు కనిపించినా దీనిలో ప్రధానంగా ఇంగ్లీషు, తెలుగు భాషల ప్రస్తావన ఉంటుంది.

వాస్తవానికి అనువాదం గొప్ప విద్య. పరకాయ ప్రవేశానికి మించిన అప్రమత్తత అవసరం. అప్పుడే అనువాదం జీవచైతన్యంతో తొణికిసలాడుతుంది. అటు ఏ భాషలోంచి అనువాదం జరుగుతుందో ఆ మూలభాష, ఇటు ఏ భాషలోనికి అనువాదం అవుతుందో ఆ లక్ష్యభాష – ఈ రెండింటి సమగ్రతత్త్వాన్ని జీర్ణించుకున్న అనువాదకుడే తన కృషిలో సఫలీకృతుడవుతాడు. కేవలం మూలభాషలోనో, లక్ష్యభాషలోనో పరిమిత వ్యవహార జ్ఞానంతో చక్కబెట్టగల కార్యం కాదిది. రెండు భాషల కావ్యసంపద, ఆంతరిక స్వభావం, నిర్మాణ వైచిత్రి, శైలీసౌందర్యం, నుడికార వైభవం, పదజాల పాటవం ఇత్యాది అంశాలతో పాటు ఆ భాష పరివ్యాప్తమైన ప్రదేశాల వైలక్షణ్యం, అక్కడి ప్రజల జీవనశైలి, సాంఘిక వాతావరణం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు మొదలైనవన్నీ అవగాహన చేసుకున్నప్పుడే అనువాదం రాణిస్తుంది.

తెలుగుకు సంబంధించి సాహిత్యానువాద రంగంలో గణనీయమైన కృషి జరిగింది. అరవై అయిదు శాతం సంస్కృత పదాలను జీర్ణించుకున్న తెలుగు సంస్కృతం నుంచి వేదవాఙ్మయం, పురాణేతిహాసాలు, కావ్యనాటకాదులను తనదైన రీతిలో అనువదించుకుంది.

తెలుగు సాహిత్య వికాసం అనువాదంతో ఆరంభం కావడం విశేషం. తెలుగు సాహిత్యంలో అనువాదయుగం ప్రశస్తి గాంచింది. తెలుగుసీమ సంస్కృత పండితులకు వాసి గాంచింది. గాంధీజీ జాతీయోద్యమంలో హిందీ భాషాధ్యయనాన్ని ఒక భాగం చేయడంతో తెలుగునాట ఎందరెందరో హిందీలో అద్భుత పాండిత్యాన్ని సముపార్జించుకున్నారు. అలాగే రవీంద్రుని ప్రభావం వల్ల పెక్కు మంది తెలుగు వారు శాంతి నికేతన్‌లో బెంగాలీ అభ్యసించారు. అలాగే తెలుగువారిలో మలయాళం, తమిళం,

కన్నడం ఇత్యాది భాషలలో పండితులైనవారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. ఇక ఇంగ్లీషు పత్రికా సంపాదకులలో తెలుగువారు గణనీయంగా కానవస్తారు. ఇవన్నీ సాహిత్యానువాదానికి బాసటగా నిలిచాయి.

అయితే సమాచార విజ్ఞాన విస్ఫోటనం, ప్రపంచీకరణ నేపథ్యంలో అనువాదకులు తమ భాషా నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకోవలసి ఉంటుంది. ఇది నిరంతరంగా సాగాలి. భాషలలో అనూహ్య పరిణామాలు వచ్చాయి. ఎక్కువ అనువాదాలు ఇంగ్లీషు నుంచి తెలుగులోకి జరుగుతున్న దృష్ట్యా ఉదాహరణగా ఇంగ్లీషు గురించి ఈ సందర్భంలో కొన్ని పరిణామాలు పేర్కొనవలసి ఉంటుంది. ఇంగ్లీషును విదేశీ భాషగా బోధనకు 100 పైగా దేశాలు స్వీకరించాయి. విద్యామాధ్యమంగా 76 దేశాలు ఉపయోగిస్తున్నాయి. ఈనాడు ఇంగ్లీషు నిఘంటువులో 6.15 లక్షలకు పైగా పదాలున్నాయి. ఈ సంఖ్య నానాటికీ పెరుగుతోంది. షేక్స్పియర్ కాలం నాటి కంటె ఇవి అయిదు రెట్లు ఎక్కువ. 'మూర్ఖుడు' అనే అర్థంలో 1300 వరకు పదాలున్నాయి. స్త్రీని నిందించే పదాలు 1050కి పైగా ఉన్నాయి. అమెరికన్ ఇంగ్లీషుకు, బ్రిటిష్ ఇంగ్లీషుకు వ్యత్యాసాలున్నాయి. కొన్ని ఆఫ్రికా దేశాలు తమకు అనుకూలంగా మార్పులు చేసుకుంటున్నాయి. వీటన్నింటినీ అనువాదకులు గమనిస్తూ ఉండాలి. ఒక విధంగా ఇది అన్ని భాషలకు వర్తిస్తుంది.

కళైనా, శాస్త్రమైనా దానికి వర్తించే కొన్ని సిద్ధాంతాలు రూపుదిద్దుకుంటాయి.

అనువాదంలో సిద్ధాంతాల కంటె అభ్యాసమే ముఖ్య భూమిక వహించే మాట యథార్థం అయినప్పటికీ సూత్రప్రాయంగా కొన్ని సిద్ధాంతాలను సంగ్రహంగా పరిశీలిద్దాం. అనువాద వాస్తవస్ఫూర్తిని గోథే తన సిద్ధాంతంలో ప్రతిబింబింపజేశారు. మూలభాషకు, లక్ష్యభాషకు పూర్తి న్యాయం చేయాలని ఆయన ఉద్దేశం. ఆయన సిద్ధాంతంలో రెండు భాగాలున్నాయి. ఆయన మాటల్లో "There are two great maxims of translation - either turn the foreign author into a native author or induce the reader to go out to the author's foreignness" అనువాదం మూల విధేయంగా, రసస్ఫోరకంగా, సమతుల్యంగా, సహజంగా, లోటును పూరించేదిగా ఉండాలని పోస్ట్‌గేట్ అభిప్రాయం. ఆయన ప్రతిపాదించిన సూత్రాలు ఐదు. అవి – Principles of Fidelity, Pleasure of the reader, commensurateness, originalness and compensation. టైట్లర్ సిద్ధాంతం ప్రకారం అనువాదంలో మూలభావం పూర్తిగా ఉండాలి; శైలి, రచనా విధానం మూలంలో మాదిరి ఉండాలి; మూలరచనలోని సౌలభ్యం ఉండాలి. ఆయన వాక్యాలలో – (i) Translation should give a

complete transcript of the ideas of the original work, (ii) The style and manner of writing in a translation should be of the same character with that of the original; (iii) A translation should have all the ease of the original composition. కాగా సేవరీ సిద్ధాంతం అనువాదకుల్ని బాగా ఆలోచింప చేస్తుంది. నిజానికి ఆయన జీవితంలోనే కొన్ని వైరుధ్యాలు తొంగిచూస్తాయి. థియొడర్ హెచ్. సేవరీ 1896లో లండన్‌లో జన్మించారు. ఆయన అధ్యయనం చేసింది జంతు శాస్త్రం. మూడు దశాబ్దాలకు పైగా జీవశాస్త్రం బోధించారు. నాలుగు దశాబ్దాల పాటు సాలెపురుగులపైన విశేష పరిశోధన జరిపారు. అలాంటి శాస్త్రవేత్త అనువాదంపైన ప్రామాణిక గ్రంథం (The Art of Translation) 1957లో రాయటం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీనికి నాంది 1953లో ఆయన రాసిన 'The Language of Science' లో కనిపిస్తుంది. సాహిత్యానువాదం శాస్త్రానువాదంకంటె కష్టతరమంటారాయన. మూడు ప్రశ్నలు- (i) What does the author say? (ii) What does he mean? and (iii) How does he say it? పరస్పర విరుద్ధంగా తోచే ఆరు జంటల ప్రశ్నలు, వాటికి సుదీర్ఘ విశ్లేషణ, వివరణ ద్వారా సేవరీ అనువాదం గురించిన జిజ్ఞాసను పెంచారు. ఆ ప్రశ్నలకాయన 'Contrasting pairs' అని నామకరణం చేశారు. అవి -

(i) A translation must give the words/ ideas of the original
(ii) A translation should read like an original work/a translation
(iii) A translation should reflect the style of the original/ the translation
(iv) A translation should read as a contemporary of the original/ the translation
(v) A translation may add/ never add to or omit from the original
(vi) A translation of verse should be in prose/ verse

ఫారెస్టర్, రాబిన్, ఫర్లే, బూత్, టాంకాక్, స్మిత్, గ్లెమెట్ ప్రభృతులెందరో అనువాద ప్రక్రియను లోతుగా అధ్యయనం చేశారు. తెలుగులో అనువాదంపై రాచమల్లు రామచంద్రారెడ్డి, డా. భార్గవీరావు, ఆచార్య సిమ్మన్న, ఆచార్య భీమసేన్ నిర్మల్, బూదరాజు రాధాకృష్ణ మరికొందరు గ్రంథరచన చేశారు. ఈ సిద్ధాంతాలు, అధ్యయనాలు, రచనలు అనువాద ప్రక్రియ ప్రతిపత్తికి సాక్ష్యాధారా లుగా నిలుస్తాయి. ఆచరణలో అనువాద కార్యానికి ఆయా అనువాదకుల దృక్పథం, అభిరుచి, ప్రతిభ

కరదీపికలుగా నిలుస్తాయి. ప్రాచీన, ఆధునిక అనువాదాల కదంబంనుంచి కొన్ని భాగాలు ఉటంకిస్తూ, ఆయా అనువాద కులు చూపిన ప్రత్యేకతలు గమనిద్దాం. సాహిత్యానువాదంలో ప్రధానంగా చోటుచేసుకున్నవి యథా మూలానువాదం, స్వేచ్ఛానువాదం. పూర్తిగా మాతృకను మార్పులు లేకుండా చేసే అనువాదాలు చాలా తక్కువ. ఇక స్వేచ్ఛానువాదంలో అనువాదకుడు తన అభీష్టాను సారం అనువదిస్తాడు. ఈ 'స్వేచ్ఛ' ఎన్నో రూపాలలో, ఎన్నో పరిమాణాలలో వినియుక్త మవుతుంది.

యథామాతృకానువాదానికే నిర్బంధాలు అధికం. మూలకర్త పట్ల గౌరవ విధేయతలున్నప్పుడు అనువాదకుడు ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొంటాడు. అవధానం చంద్రశేఖరశర్మ 'ముద్రారాక్షసం' అనువాదానికి పీఠిక రాస్తూ గడియారం వేంకటశేష శాస్త్రి ఇలా అంటారు. 'అనువాద కార్యము మిగుల సాహసముతో కూడిన పని. పరిశ్రమ ఎక్కువ. ఫలము తక్కువ. ఎందుకనగా ఇందులో వస్తువు నందును, విన్యాసమునందును, పాత్రౌచిత్యమునందును, భావసంపద యందునుగల మేలిమి గుణములన్నియు మూల గ్రంథకర్త మూటగట్టుకొనును. అవిశిష్టములనువాదకునకు మిగులును'. ఇది యథార్థమే. రచన మూలకర్తది గదా!

'నీది కాని మూలాన్ని ఇష్టం వచ్చినట్లు రసపోషణ పేరిట, ఔచిత్యం పేరిట, క్లుప్తత పేరిట, మెరుగులు దిద్దడం పేరిట, స్వేచ్ఛానువాదం పేరిట మార్చివేయడం, నిర్ద్వంద్వంగా గర్హించదగినది' అంటారు ఇంద్రగంటి శ్రీకాంతశర్మ.

మూలకర్తపై భక్తి భావం పూర్తిగా వున్నప్పటికీ యథా మూలానువాదంలో వున్న నిర్బంధాలను గమనించి మన సాహితీవేత్తలు చాలామంది స్వేచ్ఛానువాదం వైపు మొగ్గుచూపినట్లు విశదమవుతుంది. జయంతి రామయ్య 'ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరి'లో ఇలా అంటారు: 'మూలములో నున్నది యున్నట్లు తూచా తప్పకుండా నక్షరార్థక్రమమున దెలిగించుట యొక మార్గము. దీనిని వేదము వేంకటరాయశాస్త్రి ప్రభృతులవలంబించిరి. మూలములోని భావము ప్రధానము చేసికొని యా భావమాంధ్ర భాషా సంప్రదాయానుసారముగా నాంధ్రులకింపగునట్లు తెలుపుట రెండవ మార్గము. ఈ మార్గమును వీరేశలింగము ప్రభృతులనుపరిచిరి. ఈ రెండవ రీతియే యుచితమని నా యభిప్రాయము'.

'ఆంగ్ల వాక్యమును మనస్సులో చదువుకొని యందలి అభిప్రాయాలన్నింటిని నాంధ్ర వాక్య రచన పద్ధతిని వ్రాయవలెను' అని సూచిస్తారు వారణాసి రామబ్రహ్మం 'ఆంధ్ర వ్యాసరచన భాషాంతరీకరణ మార్గదర్శిని'లో.

ఆచార్య గంటి జోగి సోమయాజి 'కవి మూలగ్రంథంలోని రచనను ఆత్మ ప్రత్యక్షము చేసుకొని తన మనస్సులో భావించుకొని దానిని తన భాషలో తిరిగి రచయింపవలయును' అని అంటారు 'ప్రాచీనాంధ్ర వాఙ్మయము' అనే వ్యాసంలో. తెలుగు కవిత్వంలో అనువాద ప్రక్రియకు ఆదిలో పెద్ద పీఠమే లభించింది. మల్లాది సూర్యనారాయణ శాస్త్రి ఇలా అంటారు – 'పద కవిత్వము మొదట నాంధ్రీకరణమై, పిదప విపులీకరణమై తుదకు స్వకపోల కల్పనంబై క్రమక్రమంబుగ నభ్యున్నత స్థితికి వచ్చినట్లాయా మహాకవుల కావ్య పరంపరయే చాటుచున్నది'. అనువాదానికి శ్రీకారం చుట్టిన కవిత్రయ భారతం వ్యాసకృతికి తెలుగులో పునర్నిర్మాణం. వారి కవితా వైదుష్యం అసమానం. అందుకే వారి రచనకు సరితూగే భారతానువాదం మరొకటి ఇంతవరకు రాలేదు. అవసరమైన సందర్భాల్లోనే కవిత్రయం మూలంలో మార్పులు చేశారు. నన్నయ విషయంలో ఇది మరింత ప్రస్ఫుటం. ఆదిపర్వంలోని శకుంతలోపాఖ్యానంలో పుత్రునితో పాటు రాజసభకు వచ్చిన శకుంతల దుష్యంతునితో ఇలా అంటుంది:

'వరం కూలపశతాద్వాపీ వరం వాపీ శతాత్క్రతుః
వరం క్రతుశతాత్పుత్రస్సత్యం పుత్ర శతాద్వరమ్'

నన్నయ్య దీనిని యథామాతృకంగా అనువదించారు:

'నుతజలపూరితంబులగు నూతులు నూటికంటె సూనృత
వ్రతయొక బావి మేలు మరి బావులు నూటికంటె నొక స
సత్క్రతువది మేలు తత్క్రతుశతంబు కంటె సుతుండు మేలు, త
త్సుత శతంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్'

సందర్భోచితమని తలచినప్పుడు మూలాన్ని బాగా కుదించారు. వస్త్రాపహరణ సమయంలో ద్రౌపది 'గోవింద ద్వారకా వాసిన్ కృష్ణ గోపీ జనప్రియ..' అంటూ కృష్ణుణ్ణి కీర్తిస్తుంది. ఈ శ్లోకంలో 12 పంక్తులున్నాయి. నన్నయ కేవలం 'భామిని కృష్ణుఁదలంచె భీతయై' అని మాత్రం చెప్పారు.

భాసుని 'దూతవాక్యం' నాటకంలోని ఒక శ్లోకం:

'ధర్మాత్మజోవాయుసుతశ్చ భీమో
భ్రాతార్జునో మే త్రిదశేంద్ర సూనుః
యమో చతావశ్విసుతౌ వినీతౌ
సర్వే సభృత్యాః కుశలోపపన్నాః'

ఇది కృష్ణుడితో దుర్యోధనుడి కుశల ప్రశ్న. దీనికి దీపాల పిచ్చయ్య శాస్త్రి

అనువాదం -

'యమ తనయుండు యుధిష్ఠిరుఁ
డు, మరత్సూనుండు భీముఁడున్ సుపతి కూ
రిమి కొడుకు క్రీడి, ఆశ్విజు
లమడలు సుఖ కలితులే గదా నా భ్రాతల్'

ఈ అనువాదంపై వేదుల సత్యనారాయణ శాస్త్రి వెలిబుచ్చిన అభిప్రాయం: 'ఇట్లు మూలమందలి భావగాంభీర్యము చెడకుండ తెలుగు నుడికారపు దీరు తీయములతో ననువదించుట సిద్ధహస్తులకు మాత్రమే సాధ్యము.'

ఒథెల్లో నాటక ప్రారంభం:

'Act 1. Scene 1. Venice, A street, Enter Roderigo and Iago

Roderigi: Tush! never tell me; I take it much unkindly that thou, Iago, who hast had my purse as if the strings were thine, shouldst know of this.

Iago: 'sblood, but you will not hear me:
If ever I did dream of such a matter, Abhore me,

Roderigo: Thou told'st me thou didst hold him in the hate'

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి అనువాదం: 'మొదటి అంకము. మొదటి రంగము.

వెనిస్ నగరములోని ఒక వీధి - రాత్రి వేళ రాడరిగో, ఆయాగోలు ప్రవేశింతురు.

రాడరిగో: ఇక చాలు! ఊరుకొనుము. ఏవో సాకులు చెప్పుచున్నావు. నీ మాటలు నేను నమ్మను. నా చేతనున్న పైకమును యావత్తూ ఇంచుమించుగ నీ వశ మొనరించితిని. ఈ పలాయన విషయమునెఱిగియే నాకు తెలుపక అణచి యుంచితివి. నీ ప్రవర్తన నా గుండెలో గాలమైనది.

ఆయాగో: నమ్ము నమ్మకపో, ఆవంతైన ఈ విషయమును నేనెఱుగను, దేవుని సాక్షిగా తెలుపుచున్నాను. కలలోనైనా నాకు తెలియునని తలచితివేని నా ముఖమును చూడకుము.

రాడరిగో: అతడనిన నీకు తలనొప్పి పుట్టునంటివి కదా!'

అక్కడక్కడ స్వల్ప వివరణలతో యథామాతృకంగా సాగిన అనువాదమిది.

షేక్స్పియర్ నాటకాలనువాదాల గురించి బుచ్చిబాబు తన మనస్సులోని మాటను తేటతెల్లం చేస్తూ ఇలా అంటారు: 'షేక్స్పియర్ భాషనీ, శైలినీ అనువదించడం కష్టం. సరైన అర్థాన్ని, అంతరంగ భావాన్ని బహిర్గతం చేసేటందుకు బరువైన సంస్కృత పదజాలాన్నీ, క్లిష్టమైన సమాసాలనీ వాడి, అనువాదంలో కొంత గంభీరత సాధించవచ్చు. అట్లాంటి భాషను పండితులు హర్షించవచ్చు. కాని అది పాఠకుడికి అర్థమవుతుందనుకోను'.

ఇది 1966 నాటి మాట. ఇప్పుడైతే (2007) ఆయన అలా అని ఉండరు. ఎందుచేతనంటే -

అనువాదకుల దృక్పథం, శైలి, రచనా విధానంలో మార్పులొచ్చాయి. సరళసుందరమైన వ్యావహారికం అన్ని సాహితీ ప్రక్రియల్లో అత్యధికంగా వాడుతున్నాం. షేక్స్పియర్ అనువాదాలు ఎన్నో వచ్చాయి. జనామోదం పొందాయి. వాచవిగా రాచకొండ విశ్వనాథశాస్త్రి 'కింగ్ రిచర్డ్ 3' నుంచి తెనిగించిన (1993) కొన్ని పంక్తులు-

'నా అంతరాత్మకి
నాలుగు వేల నెత్తుటి నాలికలున్నాయ్
నాలికా నాలికా మీకొక కథ చెబుతుంది
కథకథా ప్రతి కథా
నేనొక మహాపాపినని చాటి చెప్తుంది
నమ్మించి ద్రోహాలు
దేముని సాక్షిగా అబద్ధాలు
కత్తితో కంఠం మీద నరుకులు
తడిగుడ్డతో గొంతుక్కోతలు
నే చేసిన నేరాలు ఘోరాలు
అన్నీ కూడా
వాడు
నీచాతినీచుడు
నరరూపరాక్షసుడు
అతి దుర్మార్గుడు
మహాపాతకుడు
అని న్యాయస్థానంలో

నిక్కచ్చిగా నిలబడి
నిరూపించి చెప్తాయి'

'నేను తర్జుమాలో తర్ఫీదు పొందలేదు' అని ప్రకటించి ఆయన చేసిన అనువాదమిది. మూలానికి ఆయన దూరంగా పోలేదు. 'And every tale condemns me for a villain' అనే దానికి 'కథకథా ప్రతి కథా నేనొక మహాపాపినని చాటి చెపుతుంది' అన్నారు. సులభంగా అర్థమయ్యే అనువాదమిది.

ఏమైనప్పటికీ యథామూలానువాదంలో ఉండే కొన్ని ఇబ్బందులను తొలగించుకోవడానికి, బహు జనాదరణ పొందడానికి, స్వీయ సృజనావిష్కరణకు వీలు కల్పించడానికి కవులు, రచయితలు ఎక్కువగా స్వేచ్ఛానువాదం వైపే మొగ్గు చూపారు. 'మక్కికి మక్కి' అనువాదానికి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ అంత సుముఖంగా లేరు. 'అట్టి పరివర్తనము కేవలమాధునికమై ఆంగ్ల సాహిత్యపు సహవాసముచే మనకు దాపురించినదే కాని ప్రాచీనులట్టి దాస్యము నెఱుగరు' అని ఆయన అంటారు.

తెలుగులో వచ్చిన భాగవత, రామాయణానువాదాలు, అసంఖ్యాక కావ్యానువాదాలు, నవల కథానువాదాలు, నాటకానువాదాలు – అన్నింటిలో కొంత కొంత వ్యత్యాసంతో స్వేచ్ఛానువాద ధోరణి వ్యక్తమవుతుంది. కొందరు అనుసరణలు చేశారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 'శ్యామల' షేక్స్పియర్ 'మాక్బెత్'కు అనుసరణ. కథాస్థలం తెలుగుసీమ. కొంత స్వేచ్ఛ అవసరమని భావించినా మొత్తం మీద అనువాదకులు మూలకర్త పట్ల గౌరవం ప్రదర్శించారు. ఈ సత్యం వారి అనువాదాలలో వ్యక్తమవుతుంది. రూపం మార్చినా ఈ గౌరవ భావం లుప్తం కాలేదు. కృష్ణమిశ్రుని సంస్కృత నాటకం 'ప్రబోధ చంద్రోదయం'. నంది మల్లయ, ఘంట సింగయ దీనికి పద్యానువాదం చేశారు. ఈ అనువాదం గురించి నిడదవోలు వెంకటరావు వెలిబుచ్చిన అభిప్రాయం: 'సంస్కృతమున ప్రబోధ చంద్రోదయము ఆరంకముల దృశ్యకావ్యము. దానిని తెలుగునీ కవులు ఐదు ఆశ్వాసముల శ్రవ్యకావ్యముగా సంతరించినారు. వారు మాతృకలోని కథా ప్రణాళికను గాని, పద్యగద్య క్రమమును గాని, భావస్థితిని గాని సాధారణముగానే మార్పు లేకుండగనే స్వీకరించిరి.'

శ్రీనాథుడు తన శృంగార నైషధానువాదం గురించి 'అశేష మనీష హృదయంగమముగా, శబ్దంబనుసరించియు, నభిప్రాయంబు గుఱించియు, భావంబు పలక్షించియు, రసంబు పోషించియు, నలంకారంబులు భూషించియు, నౌచిత్యంబాచరించియు, ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబున జెప్పంబడి' అన్నారు. అనువాదంలో పాటించవలసిన వాటిని ఈ వాక్యంలో పేర్కొన్నారు.

అనువాదాన్ని ఏ పేరుతో పిలిచినా, తరతమ స్థాయిలో స్వేచ్ఛ తీసుకున్నా స్థూలంగా పరిశీలిస్తే అనువాదకులు సదా మాతృకను దృష్టిలో ఉంచుకున్నట్లు విదితమవుతుంది. ఇది మిక్కిలి వాంఛనీయం. ఎందుచేతనంటే అనువాద ప్రక్రియలో ప్రధానంగా ముగ్గురికి ప్రమేయముంటుంది. వారు మూలకర్త, అనువాదకుడు, పాఠకుడు. భాషావరోధం వల్ల పాఠకుడికి మూలకర్తతో ప్రత్యక్ష సంబంధం ఉండదు. మాతృక స్వరూప స్వభావాలు తెలుసుకునేందుకు అనువాదం పాఠకుడికి సాధనంగా ఉపకరిస్తుంది. మాతృకలోని రచనా వైదుష్యం అనువాదంలో ప్రతిబింబించినప్పుడే పాఠకుడు సరైన రసాస్వాదన చేయగలుగుతాడు. అనువాదంలో అనువాదకుడి ప్రతిభా పాటవాలు ప్రదర్శితాలైనా మూలకర్త సాహితీ వైదగ్ధ్యం తప్పక ఆవిష్కృతం కావాలి. అనువాదం లక్ష్యభాష అందచందాలు నింపుకుంటూనే మూలకృతి ముద్రను మాత్రం కోల్పోకూడదు. తెలుగు అనువాదకులు ఈ విషయంలో ఆదర్శప్రాయులు కావడం ముదావహం. విమలాశర్మ, ఆచార్య జి.యస్. మోహన్, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, దీవి సుబ్బారావు, పింగళి సూర్యసుందరం, డా. ఆర్.ఎ. పద్మనాభరావు, వేమరాజు భానుమూర్తి, డా. వై. పాండురంగారావు, బి.కె. ఈశ్వర్, ఆచార్య పుల్లెల రామచంద్రుడు, డా. భార్గవీరావు, డా. పి. ఆదేశ్వరరావు, మద్దిపట్ల సూరి ప్రభృతులు వివిధ భాషల నుంచి చేసిన తెలుగు అనువాదాలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకోవడం అభినందనీయం. మరికొన్ని అనువాదాల మాధుర్యాన్ని ఆస్వాదిద్దాం.

సరోజినీ దేవి ఆంగ్లకవిత:

'I buried my heart, so deep
Under a secret hill of pain
And said 'O broken pitiful thing
Even the magic spring
Shall never woke thee to life again
Tho' March woods glimmer with opal rain
And passionate koels sing'

దీనికి డా. సి. నారాయణరెడ్డి అనుసృజన:

'బాధాపర్వతముల అట్టడుగున
పాతిపెట్టిన నా గుండెను లోతుగ
ఇట్టులంటి దయనీయ హృదయమా!
ఏ వసంతముల ఇంద్రజాలములు

నిన్ను తిరిగి మేల్కొలుపగలుగునో
ఎన్ని చైత్రవనులెంత మెరిసినా
ఎన్ని కోయిలలు ఎంత అరచినా'

'March Woods' ను 'చైత్రవనులు' అనడం కవి ప్రతిభకు మణిముకురంగా నిలుస్తుంది.

'మహా మహీ బసంత పంచమీ
పాగా సబ్ గావై హోలీ' – ఇవి మీరాబాయి ఒక గీతంలోని రెండు పంక్తులు. వాటికి డా. నారాయణరెడ్డి తెనిగింపు:

'మాఘమాసమున ప్రతి కెమ్మోవి
మధుగీతికలే వినిపించే'

ఈ అనువాదం గురించి ఆయన 'మూలంలోని భావపుష్టీ, శిల్పదృష్టీ కొరవోకుండా తెలుగు నుడికారానికీ ధారాశుద్ధికీ లోపం కలగకుండా నేను చేసిన ఈ అనువాదం...' అని చెప్పిన మాట అనువాదకులకు మార్గదర్శకంగా వర్తిస్తుంది.

హిందీ మాండలికం అవధిలో తులసీదాసు రచించిన 'రామచరిత మానస్'లోని ఒక దోహాకు పార్వతీ కృష్ణమూర్తి సరళ గద్యానువాదం గమనిద్దాం:

మూలం:

'రామ మాతు గురుపద సిరనాయీ ప్రభు పద పీఠరజాయను పాయీ। నందిగావఁ కరి పరన కుటీరా కీన్హా నివాసు ధరమ ధురదారా!'

అనువాదం:

'కౌసల్యాదేవికి, వసిష్ఠ మునీంద్రునకు నమస్కరించి, భరతుడు నంది గ్రామమున పర్ణకుటీరమున నివాసము చేయుచుండెను'

సులభగ్రాహ్యమైన చక్కటి శైలితో తెనిగించారు. ఈ అనువాద సరళి గురించి పుట్టపర్తి నారాయణాచార్యులు చెప్పిన సంగతి అనువాదకులకు ఆసక్తిదాయకంగా ఉంటుంది: 'మూలమునకు యథాతథముగ నీమె యనువదించినది కాదు. కథను సంకుచితముగ చెప్పుచుబోవును. తనకింపుగ దోచిన చోటననువదించును. అనువాదములో నిదియొక పద్ధతి'.

కన్నడంలో సర్వజ్ఞ త్రిపది:

'క్షీరదోళు ఘృతవిద్దు నీరొళు శిఖియిద్దు

ఆరిగెయ తోర దిహుదంతె ఎన్నొళగె
సారిహనుశివను సర్వజ్ఞ'

మూలానికి అతి సన్నిహితంగా అలతి అలతి పదాలతో ప్రతిభాన్వితంగా ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ అనువాదం:

'పాలలో నెయ్యుండె, నీటిలో నిప్పుండె
ఎవరికీ కనరాకనే, నాలోన
తానుండు శివుడు సర్వజ్ఞ'

జాషువా 'గబ్బిలం' కావ్యంలోని ఒక పద్యం:

'ధర్మమునకుఁ బిఱికితనమెన్నడును లేదు
సత్యవాక్యమునకు జావులేదు
వెఱవనేల నీకు విశ్వనాథుని మ్రోల
సృష్టికర్త తాను సృష్టివీవు'

కె. మాధవరావు అందించిన ఆంగ్లానువాదం:

'Duty fears none
Truth is immortal
Fear not God's wrath
For God is the creator, you His creation'

నాలుగో పంక్తి అనువాదం ఎంతో సమర్థంగా సాగింది.

'ఆత్మశుద్ధి లేని యాచారమదియేల
భాండశుద్ధి లేని పాకమేల?
చిత్తశుద్ధి లేని శివపూజలేలరా?' అనే వేమన సూక్తిని సి.పి. బ్రౌన్ ఇలా అనువదించారు.

'Observances void of purity of heart to what end are they?
To what end is the preparation of food without cleaning the vessel
Void of purity of mind to what end is the worship of God'

మూలభావాన్ని చాలా స్పష్టంగా అందించారు.

నగ్నముని 'దిగంబర నృత్యం' కవితలోని ఒక భాగం:

'ఒక్కటి నిజం
ఒక్క క్షణం నిజం
నా సంఘం బట్టల మురికి వెనక
సిగ్గుతో కుమిలి కుమిలి ఏడ్చే నేను నిజం
ఆ రాత్రి నా నీగ్రో చెలికౌగిలిలో
ఊరువుల కొండచరియల్లో చంద్రోదయం నిజం
నా నరాల బాధ నిజం
నా నిలకడ నిజం నా విశ్వాసం నిజం
నేను నిజం
ఇన్ని నిజాల వెనకా నా ఊపిరిగట్టుపై నిలబడి
పగలబడి నవ్వుతున్నది
ఆకలి నా నీగ్రో చెలి'

దీనికి శ్రీశ్రీ ఆంగ్లానువాదం:

'But one thing is true
One moment in time is true
Behind the dirty linen of this society
I who weep and weep in shame am true
That night in the embrace of my Negro Venus
The moon - rise in the valley of her thighs is true
The pain of my nerves is true
My being is true
Against the back - drop of so many truths
Standing on the threshold of my breath
My Negro girl bursts into laughter
My girl
Who is none other than
My hunger'

యథామూలానువాదం ఎంత చక్కగా చేయువచ్చో ఇందులో శ్రీశ్రీ నిరూపించారు.

విశ్వనాథ సత్యనారాయణ 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' నవలలో అనువాదంపైన ఒక చమత్కార వ్యాఖ్య ఉంది: "Necessity is the mother of invention. మనం ఒక మహా విషయాన్ని కనిపెట్టడానికి, కనిపెట్టక తప్పకపోవడం తల్లివంటిది అని అనుకొంటాను దీని అర్థం. ఇంకా సులభంగా ఎవరన్నా

ఆంధ్రీకరిస్తారేమో నాకు తెలియదు.” అనువాదకులు ఆలోచించదగినదే విశ్వనాథ వారి సందేహం.

ఇవి సాహిత్యానువాదం గురించిన కొన్ని ఆలోచనలు. ఇరవయ్యో శతాబ్ది రెండు నుంచి ఆరో దశాబ్దం వరకు పుంఖానుపుంఖాలుగా ఇతర భాషల నుంచి సృజనాత్మక రచనలు తెలుగులోకి అనువాదాలయ్యాయి. ఇలా తెలుగులోకి వచ్చిన కవితలు, నవలలు, కథలు, నాటకాలు తెలుగులోనే స్వతంత్రంగా రాసినవా అనిపించే రీతిలో ఉన్నాయి. అవి స్వతంత్ర రచనలా అనే భ్రాంతి కలిగించేటంత గొప్పగా అనువాదమయ్యాయి. అనువాదంలోని ప్రతి పుటలోను మూలకర్త భావసౌందర్యం కనిపిస్తుంది. ఎక్కడా మూలకర్త మరుగున పడదు. అదే మంచి అనువాదానికి గీటురాయి. అందులో తెలుగు అనువాదకులు కృతకృత్యులవడం ప్రశంసనీయం.

తిరిగి ఆ అనువాద కృషి చైతన్య విలసితం కావాలి. శక్తి సంపన్నం కావాలి. ఎన్నెన్నో అద్భుత రచనలు భారతీయ భాషల్లోను, విదేశీ భాషల్లోనూ వస్తున్నాయి. ఆ భాషలు తెలియని తెలుగు పాఠకులకు వాటిని సత్వరం అందివ్వడం అనువాదకుల బాధ్యత. ఇందుకు తెలుగు అనువాదకులందరూ నూతన స్ఫూర్తితో ఉద్యమించాలి. అలాగే తెలుగులోని విశిష్ట రచనలను ఇతర భాషలలోకి అనువదించేందుకు విశేష కృషి జరగాలి.

సాహిత్యానువాదం - ఆధునిక ధోరణులు

ఆచార్య భార్గవి పి. రావు

తెలుగు సాహిత్యానువాద చరిత్ర ఆదికవి నన్నయ భారతాంధ్రీకరణం నుండి మొదలవుతుంది. సంస్కృత భాష నుండి, సంస్కృతభూయిష్ఠమైన తెలుగులో స్వేచ్ఛానువాదం చేయబడిన కావ్యాలు అనువాదమని తెలుగు పాఠకులకెప్పుడూ అనిపించలేదు. 'కృష్ణద్వైపా వృషభాభిహిత మహాభారత బద్ధ నిరూపితార్థనముని మేర్పడ **తెనుగున రచియింపుము**' అని నన్నయను రాజరాజు కోరితే కొన్ని సందర్భాలలో మూలాన్ని యథాతథంగా, కొన్ని చోట్ల స్వేచ్ఛగా తెనిగించారు. పోతన భాగవతంలోని పద్యాలు రుక్మిణీకల్యాణంలోనివి, గజేంద్ర మోక్షంలోనివి ఒక తరానికి కంఠస్థాలు. వాటిలో తెలుగెంత, సంస్కృతమెంత, మూలంలో ఎలా ఉంది అని కవిపండితులెవ్వరూ విమర్శించలేదు. శ్రీనాథకవి తన శృంగారనైషథంలో –

'మిసిమి గల పుల్లపెరుగుతో మిళితమైన
ఆకుపచ్చళ్ల చవిచూచి రాదరమున
చుఱ్ఱుమని మూర్ధములు దాకి యెఱ్ఱదనము
పొగలు వెడలింప నాసికా పుటములందు!' (శృం.నై. 6–130)

పద్యం చదివితే తెలుగు రంగు, రుచి, వాసనలు మూలంలో కంటే ఘాటుగా అనిపిస్తాయి. ప్రాచీనకవులు సంస్కృతం నుండి పదాలను కొల్లగొట్టి – డు,ము,వులు – జోడించి, ఇది తెలుగే అన్న భ్రమను కల్పించి అనువాదాలు చేశారు.

గిడుగువారు వ్యావహారిక భాషను ప్రాచుర్యంలోకి తెచ్చి భాష పటిష్ఠంగానే కాక సరళంగా, సామాన్యులకు అందుబాటులో ఉండేటట్టు చేశారు. సృజనాత్మకంగా సాహిత్యం ఎదిగింది. ఛందోబద్ధమైన ఉత్పలమాలలు, చంపకమాలలు రాయలేనివారు కూడా విశృంఖలంగా, భావోద్వేగమైన కవితలు రాశారు. 'పదండి ముందుకు, పదండి తోసుకు – పోదాం పోదాం పైపైకి' (మహాప్రస్థానం) అని వచనకవితలకు శ్రీకారం చుట్టారు శ్రీశ్రీ.

'ఎత్తులపై ఎత్తులతో
జిత్తులపై జిత్తులతో
ఎత్తే విజయపతాకం
ఎన్నాళ్లని ఎగురుతుంది?' (తిమిరంతో సమరం) అని ప్రశ్నించారు దాశరథి.

దేశస్వతంత్రానికి పూర్వం, స్వతంత్రానంతరం సాహిత్యంలో ఎన్నో మార్పులు వచ్చాయి. కావ్యాలు, కవితలే కాక ఇతర సాహిత్య ప్రక్రియలు - నవలలు, కథలు, నాటకాలు - కూడా జనాదరణ పొందాయి. విద్య చాలామందికి అందుబాటులోకి వచ్చాక పాఠకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని రచనలు విరివిగా వచ్చాయి. ఇతర భారతీయ భాషల నుండి తెలుగుకు, తెలుగు నుండి ఇతర భాషల్లోకి అనువాద రచనలు వెలువడ్డాయి. అనువాదం కళా, శాస్త్రమా అన్న తర్కం వెనకబడ్డది - అనువాదం శాస్త్రీయతను ఇముడ్చుకున్న కళ - కళాత్మకతను కలిగిన శాస్త్రం - అని ఒప్పుకుని - భాషాశాస్త్ర పరంగా కొన్ని సిద్ధాంతాలు, సూత్రాలు ఏర్పడ్డాయి. కానీ ఇవి చాలా వరకు పాశ్చాత్య విమర్శనా సూత్రాలను అవలంబించినవి.

సాహిత్యానువాదంలోని సాధకబాధకాలు, సమస్యలను విశ్లేషిస్తూ వ్యాసాలు, రచనలు, పుస్తకాలు వచ్చాయి. వీటిలో ప్రధానంగా - సంస్కృతిని ప్రతిబింబించే మాటలు - చీరకొంగు, పరికిణీ, పిలక, జంధ్యం, తద్దినం, వడ్డాణం లాంటివి; బంధుత్వాన్ని సూచించేవి - వదిన, మేనత్త, పింతండ్రి, వేలు విడిచిన మేనమామ, పిన్ని, తోడికోడలు లాంటివి; గోంగూర, కంది పచ్చడి, ఊరమిరపకాయ, గారెలు, బూరెలు లాంటి వంటకాలు - వీటిని ఎలా అనువాదం చేయాలి. అనువాదానికి లొంగవు. అనువాదంలో మూలభాషలోని సొగసు పోతుంది అని ప్రతిపాదిస్తుంటారు. తెలుగు నుండి కన్నడ, తమిళ, మలయాళ భాషలలో ఈ మాటలకి సమానార్థకాలు సులభంగా దొరుకుతాయి. కానీ ఇంగ్లీష్‌లోకి అనువదించేటప్పుడు వాటిని యథాతథంగా వాడి, కింద వివరణ ఇచ్చుకోవాలి. అలాగే అనువాదాల్లో ఇమడని యాస, idioms, dialects - మొదలైనవి.

ఆధునిక సాహిత్యంలో గత పదేళ్లలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. సమాజాన్ని ప్రతిబింబించేది మంచి సాహిత్యమనుకుంటే, సమకాలీన సమాజంలోని అభివృద్ధిని, అస్తవ్యస్తతలను, అసమానతలను, అవినీతిని ఎత్తిచూపుతూ బలమైన ఇతివృత్తాలతో, ఆసక్తికరమైన శైలిలో కొత్త సాహిత్యం ఒక కెరటంలా వచ్చింది. తెలుగు భాషపైన ఇంగ్లీషు, హిందీ భాషల ప్రభావం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

సినిమాలు, మీడియా, పత్రికల ప్రభావం సాహిత్యంలో ప్రస్ఫుటంగా కనబడుతోంది. ఈ నేపథ్యంలో కథలను – తెలుగు కథలను ఇంగ్లీషులోనికి అనువదించే విధానంలోని మార్పుచేర్పులను చర్చిస్తాను.

ఇంగ్లీష్ అనువాదాలను ఎందుకు ఎంపిక చేసుకున్నానంటే – తెలుగు సాహిత్యం ఇంగ్లీషులోనికి వెళ్లవలసిన అవసరం ఎక్కువైంది. తెలుగు మూలభాషగా ఇతర భారతీయ భాషల్లోకి వెళ్లాలన్నా అనువాదకులందరికీ తెలుగు వచ్చి వుండకపోవచ్చు. ఇంగ్లీష్‌లోనికి వెళ్తే అది జాతీయ, అంతర్జాతీయ పాఠకులకు అందుతుంది. ఒకప్పుడు మనం చదువుకున్న ప్రపంచ సాహిత్యం – రష్యన్, జర్మన్, ఇటలీ భాషల నుండి తెలుగులోకి వచ్చింది ఇంగ్లీష్ ద్వారానే!

సమాజంలో, భాషలో వచ్చిన మార్పులకు ముఖ్యమైన కారణం – ప్రపంచీకరణ, ప్రసార సాధనాలు. ప్రపంచీకరణ ప్రపంచాన్ని ఒక కుగ్రామంగా మార్చి వేసింది. అమెరికా పొరుగు రాజ్యం. లక్షలాది మంది భారతీయులు వలస వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. రష్యా, చైనాలలో కమ్యూనిస్టు గోడలు కూలిపోయి మార్కెట్‌కు తలుపులు తెరుచుకున్నాయి. నాణ్యమైన సరుకును, తక్కువ ధరకు అందించే చైనా, కొరియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు అందరికీ పరిచయమయ్యాయి. ఈ నేపథ్యంలో అచ్చమైన తెలుగు పదాల అనువాదం అసాధ్యమనే చెప్పాలి. e-mail, supermalls, super speciality hospitals, bypass surgery, hitech పదజాలాన్ని తెలుగు చేస్తున్నప్పుడు వాటిని లిప్యంతరీకరణ చేయటం తప్ప గత్యంతరం లేదు. వాటికి తత్సమాలు, తద్భవాలు వెదుక్కుని రాసినా effective గా ఉండదు.

కొన్ని ఉదాహరణలు: గిడుగు రాజేశ్వరరావు కథ – 'హాండ్సప్' (అమూల్య క్షణాలు, పే. 27 – 39) కథ పేరే ఇంగ్లీష్‌లో ఉంది. దీనికి 'చేతులెత్తు' అన్న తెలుగు పేరు అసమంజసంగా ఉంటుంది. పిల్లల పెంపకంలోని నైతిక బాధ్యతలను ఎత్తి చెప్పే ఈ కథ ఢిల్లీలో నడుస్తుంది. దీనిలో ఆథర్స్ గిల్డ్, ఆఫ్టర్ ఎలాంగ్ టైమ్ లాంటి మాటలతో పాటు హిందీ ప్రయోగాలు కూడా ఉన్నాయి. అక్కడ స్థిరపడిన స్వర్ణ కుటుంబం, తన పిల్లలూ ధారాళంగా హిందీ మాట్లాడతారు. వాళ్లింట్లో పనిచేసే చిన్న పిల్ల మమత మాతృభాష హిందీ. అక్కడక్కడా రచయిత హిందీలోని భావాల్ని తెలుగు చేసినా – 'క్యా హోగయా తేరీ మమ్మీకో? క్యూం నహీ ఆయీ' అన్న వాక్యం 'మమ్మీ, అంకిత్‌నే ప్యారో కో మారా' అన్న ప్రయోగం కథలో చక్కగా ఇమిడిపోయి, శైలికి ఒక కొత్త రంగునిచ్చింది.

దీనిని ఇంగ్లీషులోకి గానీ, ఇతర భాషల్లోకి గానీ లిప్యంతరంతోనే వాడాలి. తెలుగుకథలో అన్య భాషాపదాలు ఉపయోగించరాదు అనే సూత్రం ఇక్కడ వర్తించదు.

నేను ఈ మధ్య కన్నడం నుండి తెలుగు చేసిన కథ కన్నడ రచయిత వసుధేంద్రగారిది. 'హోస హరెయ' అంటే అప్పుడే 'మొలకెత్తిన యౌవనం'. కథ ఇలా మొదలవుతుంది: 'ఫోరమ్ మాల్‌లో కూర్చుని కాపిచీనో కాఫీ తాగుతున్నారు శుభ – అనొన్యా'. ఈ వాక్యం – చాలా loaded expression. ఫోరమ్ మాల్స్ సమాజంలోని కొత్త landmark. దీనికి తెలుగు సమానార్థకం లేదు. 'కాపిచీనో' అనేది చాలా ఖరీదైన ఇటాలియన్ కాఫీ. దీనిని తాగుతున్నారు అని చెప్పడంలోనే కథలోని ఆ పాత్రలు చాలా డబ్బున్నవారని అర్థమవుతుంది. అనొన్యా అనేది బెంగాలీ పేరు. అనన్యను వాళ్లు అలాగే పలుకుతారు. కథలో అభి అనే కుర్రాడు – తెలివిగల ఇంజినీరింగ్ విద్యార్థి. చదువు మీద ఆసక్తి పోగొట్టుకుని B.P.O. లో ఉద్యోగంలో చేరుతాడు. ఈ విషయం తెలిసి వాళ్ల నాన్న <u>హేంగర్</u>తో కొట్టి ఇంటి నుండి పంపేస్తాడు. తల్లి కొనిపెట్టి, <u>bill</u> కట్టున్న <u>cell phone</u> ను ఎవ్వరూ ముట్టుకోకూడదు. నా <u>privacy</u> ని గౌరవించడం నేర్చుకో అంటాడు తల్లితో. ఈ కథలో దాదాపు యాభై పదాలు, phrases లిప్యంతరీకరణలోనే ఉన్నా కథ సాఫీగా చదివిస్తుంది. ఎందుకంటే ఈ కథను ఉద్దేశించి రాయబడ్డ పాఠకులకి ఈ పదాలు కొత్తవి కావు. రోజూ వాడే మామూలు పదాలే. కానీ పదేళ్ల క్రితం E-mails, shadi.com మొదలైనవి మన సంస్కృతిలోనే లేని విషయాలు.

ఎక్కువగా చదువులేని వారికీ, చదువుకున్నవారికీ కూడా అన్య భాషా పదాలు వాడుకలోకి వచ్చాయి.

'బర్త్‌డే పార్టీ', 'మారేజ్ ఆనివర్సరీ', 'హాలిడేస్', 'హాస్పిటల్', 'డాక్టర్', 'ఏయిర్‌పోర్ట్', 'బస్‌స్టాండ్', 'డాన్స్ ప్రోగ్రామ్' మొదలైనవి తెలుగు పదాలే!

టెలివిజన్ 'ఆంకర్లు' అన్యభాషా పదబంధాలను విరివిగా వాడటం వలన అవి బాగా ప్రచారంలోకి వచ్చాయి.

ఇది అనువాదకులకు ఒక విధంగా advantage. అటువంటి పదాలను లిప్యంతరంగా వాడుకుని సందర్భోచితంగా పాఠకులు అందుకుంటారని అనుకోవచ్చు. వీటికి సమానార్థకాలు వెతుక్కుని, కల్పించుకుని వాడినా భాషలో ఇమడక గమ్మత్తుగా అనిపించవచ్చు.

భాషను స్వచ్ఛంగా వాడాలన్నది రచయితల, అనువాదకుల బాధ్యత. అలాగే కొత్త పదప్రయోగాలూ, అన్యభాషలోని పదాలను జాతీయం చేయడం, ప్రయోగాత్మకంగా భాషలో ప్రయోగాలు చేయటం కూడా వీళ్లకే చెల్లు. కొత్త పదాలను కలుపుకోకుండా 'మడి'గట్టుక్కు కూర్చుంటే తెలుగు కూడా సంస్కృతమైపోతుంది. కొత్తదనం పేరుతో, ఆధునికత పేరుతో తెలుగులో అన్యభాషా పదాలను కొన్నిటిని కలుపుకోవచ్చును కానీ తెలుగులో తెలుగు పదాలను వెదుక్కునే పరిస్థితి రాకూడదు! మారుతున్న భాషాస్వరూపాలతో పాటు దానిని పరిగణనలోకి తీసుకుని, ఆ పరిధిలో విమర్శనాసూత్రాలు కూడా రావాలి. అనువాదంతో దీటుగా అనువాద సాహిత్య విమర్శ పెరిగినప్పుడే సాహిత్యానువాదం పరిణతి చెందుతుంది. తెలుగు సాహిత్యం ప్రశస్తి ప్రపంచ సాహిత్యానికి దీటుగా నిలుస్తుంది!

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణలు

1.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ.100/-
2.	తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ. 70/-
3.	తెనుగు సాహితి	రూ. 36/-
4.	స్త్రీల రామాయణపు పాటలు	రూ. 36/-
5.	సమీక్షణం	రూ. 36/-
6.	పరిణతవాణి- 1, 2, 3 సంపుటాలు	రూ. 131/-
7.	ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు	రూ. 70/-
8.	ఇరివెంటి వ్యాసాలు	రూ. 30/-
9.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ. 15/-
10.	రాయప్రోలు రచనలు - తత్త్వవివేచన	రూ.60/-
11.	తెలుగులో సాహిత్యోద్ధారకులు	రూ.40/-
12.	మల్లికా గుచ్ఛము	రూ. 8/-
13.	మనజాతి నిర్మాతలు	రూ. 4/-
14.	సుమతి, వేమన, కృష్ణశతకాలు	రూ. 24/-
15.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ. 250/-
16.	తెలంగాణాలో జాతీయోద్యమాలు	రూ. 10/-
17.	సంస్కృత పాఠవల్లరి	రూ. 4/-
18.	నా సాహిత్యోపన్యాసములు	రూ. 5/-
19.	గౌతమబుద్ధుడు-జవహర్లాల్ నెహ్రూ	రూ. 3=60
20.	కర్నల్ కాలిన్ మెకంజీ	రూ. 1=50
21.	మనదేశం - తెలుగుసీమ	రూ. 7/-
22.	మననదులు - కృష్ణాగోదావరులు	రూ. 3/-
23.	మధురభక్తి - ముగ్ధభక్తి	రూ. 80/-
24.	ప్రాచీన కవిత	రూ. 10/-
25.	ప్రసంగ వ్యాసాలు	రూ. 5/-
26.	ఆంధ్ర సారస్వత పరిషత్తు చరిత్ర (1943 - 1992)	రూ. 10/-
27.	దశరూపక సారం	రూ. 5/-
28.	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ. 2/-
29.	నా రేడియో ప్రసంగాలు	రూ. 5/-
30.	ఆధునిక తెలుగు సాహిత్యంలో హాస్యం	రూ. 60/-
31.	డా. దేవులపల్లి రామానుజరావు అభినందన సంచిక	రూ. 20/-
32.	తెలుగు రచన	రూ. 7/-